సంపుటి:3
సంచిక :8
పుటలు :52
రు. 20/-లు
తెనాలి

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి


నుడి నాడు నెనరు


అక్టోబరు 2017



పాత్రికేయుడు, సంపాదకుడు, పరిశోధకుడు, రచయిత, కళింగదేశ కీర్తిపతాక

## సెట్టి ఈశ్వరరావు (1917-2017) శతజయంతి నివాళి





- మాతృభాష రక్షణ కోసం ఉద్యమం సాగాల్సిందే
- జనమాధ్యమాలకు మార్గదర్శి తాపీ ధర్మారావు
- సారంగపాణి పదాలలో సాంస్కృతిక జీవన వైభవం
- శ్రీపాద శిష్యుడైతే గురువులు గురజాడ, గిడుగు
- స్త్రీపాత్ర ప్రస్థానం-నూరేళ్ళ తెలుగు కథ

**ప్రపంచ తెలుగు మహాసభలు కీలకం, ఆదర్శం కావాలి**

# అందరికీ ఆహ్వానం



పాత్రికేయుడు, రచయిత,
సాహితీ విమర్శకుడు

## సతీష్ చందర్ గారికి
## తాపీ ధర్మారావు పురస్కారం



సతీష్ చందర్ ప్రసిద్ధ జర్నలిస్టు. పత్రికా సంపాదకులు, కవి, వ్యంగ్య రచయిత, కథకులు, విమర్శకులు, మీడియా బోధకులు. ఎ.పి.కాలేజ్ ఆఫ్ జర్నలిజంను స్థాపించి రెండు దశాబ్దాలుగా 2500 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తన 33 ఏళ్ళ అనుభవంలో పాతికేళ్ళుగా ఏదోఒక పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకునిగా రావటానికి ముందు రిపోర్టర్ నుంచి ఛీఫ్ రిపోర్టర్ వరకూ రిపోర్టింగ్‌లో అన్ని స్థాయిలలోనూ (ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, సుప్రభాతం వంటి) పలు పత్రికలలో పనిచేశారు. వివిధ పాత్రికేయ, సాహితీ ప్రక్రియలకు చెందిన 19 పుస్తకాలను వెలువరించారు. ఆయన రాసిన 'పంచమవేదం' పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశంగా ఉంది. ఇంగ్లీషులోకి అనువాదం అయింది. ఈ రచనకై ఆయనకు అనేక పురస్కారాలు అందాయి. నడుస్తున్న రాజకీయాలపై జానపద కథలుగా రాసిన 'ఇతిహాసం', రాజకీయ వ్యంగ్యాస్త్రంగా రచించిన వ్యాసాలసంకలనం 'దరువు', అనుబంధాలు కాకుండా అవసరాలకు మనుషులను కట్టిపారేస్తున్న పరిస్థితులపై రాసిన వ్యంగ్యకథల సంపుటి 'చంద్రహాసం', రైతుల ఆత్మహత్యలు, దళిత ఆత్మగౌరవ పోరాటాలు, బహుళజాతి సంస్థల ఆగడాలపై వచ్చిన కవిత్వం 'ఆదిపర్వం' వంటివి ఆయనకు పేరుతెచ్చిన రచనలు.

2017 తాపీధర్మారావు పురస్కారాన్ని సతీష్‌చందర్ అందుకోనున్నారు.

| | |
|---|---|
| తేది, సమయం : | 15, అక్టోబరు 2017 ఉ॥ గం.10 లకు |
| వేదిక : | ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి, ద్వారకా హోటలు వద్ద, టెలిఫోన్‌భవన్ ప్రక్కన, ఖైరతాబాదు, హైదరాబాదు. |
| సభాధ్యక్షులు : | శ్రీ కె.రామచంద్రమూర్తి, పత్రికా సంపాదకులు, రచయిత. |
| ముఖ్య అతిథి : | జస్టిస్ చంద్రకుమార్, విశ్రాంత ఆంధ్రప్రదేశ్-తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి. |
| విశిష్ట అతిథులు : | ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు<br>శ్రీ నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు |
| ఆత్మీయ అతిథులు: | శ్రీ ఏటుకూరి ప్రసాద్, ప్రముఖ రచయిత<br>శ్రీమతి విమలా సోహన్, తాపీ ధర్మారావుగారి మనుమరాలు |


తాపీ ధర్మారావు వేదిక, విజయవాడ

వివరాలకు : డా.సామల రమేష్‌బాబు, ఫోన్: 9848016136

### ఇంతవరకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు



డా॥ఎన్.వేణుగోపాల్-2009



డా॥కె.శ్రీనివాస్-2011



శ్రీ టంకశాల అశోక్-2013



శ్రీ జి.శ్రీరామమూర్తి-2014



శ్రీ ఎ.కృష్ణారావు-2015



శ్రీ ఆర్ఎం.ఉమామహేశ్వరరావు-2016

సభవద్ద "చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు" పుస్తకం (వెల రు.150/-) లభించును

సభవద్ద **'అమ్మనుడి'** పత్రికకు చందాలు స్వీకరించబడును.

- తెలుగు అభివృద్ధి, సాధికారతలకోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణల్లో, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారికోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




అక్టోబరు 2017

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

## లోపలి పుటలలో....



రేఖా చిత్రాలు : **చిదంబరం** కార్టూన్లు : **సరసి**

కంప్యూటరీకరణ : **సోమయాజులు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్లు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్లు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

**గమనిక :** కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.



ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలలో – తెలుగు మాధ్యమం

**భారత ఇంజనీరింగ్ సర్వీస్ పరీక్షలో 3వ రాంకు సాధించిన**

# అవులూరి శ్రీనివాసులు

**ఐఐటియన్లకో, చిన్నప్పటినుంచీ ఇంగ్లిష్ మీడియం చదివిన నగర విద్యార్థులకు మాత్రమే ఇంజనీరింగ్ సర్వీసెస్ సాధ్యమవుతుందనే అపోహలను తన ర్యాంకు ద్వారా బద్దలు కొట్టాడు అవులూరి శ్రీనివాసులు. ప్రకాశం జిల్లాకు చెందిన ఈ గ్రామీణ విద్యార్థి ఈఎస్ఈలో అఖిలభారత స్థాయిలో మూడో ర్యాంకులో నిలిచాడు. ఎందరికో ప్రేరణగా నిలిచే అతడి విజయప్రస్థానం తన మాటల్లోనే....**

వూరు: నాగరాజుకుంట, కోనకనమిట్ల మండలం, ప్రకాశం జిల్లా.
పదో తరగతి: శ్రీ వివేకానంద హైస్కూలు, పొదిలి, 482/600 మార్కులు
ఇంటర్మీడియట్ (ఎంపీసీ): ఎస్వీ జూనియర్ కళాశాల, పొదిలి. 938/1000 మార్కులు/ **ఎంసెట్:18,500 ర్యాంకు**
బీటెక్–(ఈసీఈ బ్రాంచి) : ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల, కందుకూరు మార్కుల శాతం: 80/ **ఈఎస్ఈ: జాతీయస్థాయిలో 3వ ర్యాంకు**

**ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ తెలుగు మీడియం లోనే చదివాను.** బీటెక్ మూడో సంవత్సరంలో 'గేట్' గురించి తెలిసింది. 2012లో ఇంజినీరింగ్ పూర్తయ్యాక 'ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ'లో చేరాను. 2013 నుంచి వరసగా గేట్ పరీక్ష రాస్తూ వచ్చాను. 2014లో 900, 2017లో 336 ర్యాంకులు వచ్చాయి.

ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్ష గురించి హైదరాబాద్ వచ్చాకే – స్నేహితుల ద్వారా తెలిసింది. వాళ్ళు సంవత్సరాల తరబడి ఈ పరీక్ష కోసం కష్టపడి చదవటం చూశాను. ఇది ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ సర్వీసు అని దీనిపై ఆసక్తి ఏర్పడింది. ఈలోగా 2014లో డీఆర్‌డీఓలో జూనియర్ రిసర్చిఫెలోగా చేరాను.

నా ఇంగ్లిష్ పరిజ్ఞానం బీటెక్ ముగిశాకే పెంచుకున్నాను. డీఆర్‌డీఓలో ఉత్తర భారతీయులుండటం వల్ల తప్పనిసరిగా ఇంగ్లిష్‌లో మాట్లాడాల్సివచ్చింది. మొదట్లో తప్పులు వచ్చేవి, తర్వాత ఆ లోపాలు తగ్గిపోయాయి. అలాగే ఇస్రో, బార్క్, ఏర్‌పోర్ట్ అథారిటీ, బెల్ ఇంటర్వ్యూలకు హాజరు కావటంవల్ల వాటిలో నెగ్గకపోయినా, నా ఆంగ్ల సామర్థ్యం మెరుగుపడింది.

2014–15లో 'ఏస్'లో ఈఎస్ఈ కోచింగ్ తీసుకున్నాను. కోచింగ్‌కు అభ్యర్థి కృషి కూడా తోడవ్వాలి. 2014లో అర్హత పొందలేక పోయాను. తర్వాతి ఏడాది రెండంచెలు దాటాను కానీ, ఇంటర్వ్యూ వరకూ వెళ్ళలేకపోయా. 2016లోనూ అర్హత పొందలేకపోయాను.

ఇలాంటి పరిస్థితుల్లో 2017 పరీక్ష రాశాను. కానీ కచ్చితమైన ప్రణాళిక వేసుకోలేదు. ఆఫీసులో ఖాళీ ఉంటే చదువుకునేవాణ్ణి. గంట విరామం దొరికినా ప్రిపరేషన్ సాగించేవాణ్ణి. ప్రిలిమినరీకి తగినంత సమయం కేటాయించక, అనుకున్నంత కృషి చేయలేకపోయాను. అయినా నెగ్గాను. ఆపైన డీఆర్‌డీఓకు రాజీనామా చేసి 2–3 నెలలు మెయిన్స్ కోసం కష్టపడి చదివాను. మెయిన్స్ రాశాను.

సివిల్స్ మాదిరి కాకుండా.. ఈఎస్ఈలో ప్రిలిమినరీ మార్కులను కూడా లెక్కిస్తారు. ప్రిలిమ్స్‌లో నాకు మంచి మార్కులకు అవకాశం లేదు కాబట్టి ఈ సంవత్సరం పరీక్ష నెగ్గకపోవచ్చని అనుకున్నాను. అందుకే వచ్చే సంవత్సరం కోసం సన్నద్ధత కూడా ఆరంభించాను. నెగ్గటమే కష్టమనుకున్నా కాబట్టి అఖిలభారత ర్యాంకు అస్సలు వూహించనేలేదు.

ఫలితాలు వచ్చిన రోజు.. సెప్టెంబరు 11 సాయంత్రం.. యూపీఎస్సీ వెబ్‌సైట్లో నా పేరు, మూడో ర్యాంకు చూసుకున్నపుడు నమ్మలేనంత ఆశ్చర్యం.. సంతోషంతో ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు!

**అనుకూలించిన మార్పులు..**

2017లో సిలబస్ మారింది. మూడంచెల పరీక్షల నిర్వహణ తీరు కూడా మారింది. గతంలో ఈఎస్ఈని వ్యవధి లేకుండా వరసగా నిర్వహించేవారు. కానీ ఈ సంవత్సరం నుంచీ ప్రిలిమ్స్‌ను జనవరిలో, మెయిన్స్‌ను మేలో, ఇంటర్వ్యూను ఆగస్టులో నిర్వహించటం మొదలుపెట్టారు. దీంతో తగిన కృషి చేయటానికి వ్యవధి ఏర్పడింది. ఈఎస్సీ మార్కుల విషయంలో మన అంచనాలు తప్పుతుంటాయి. మెయిన్స్‌లో 300/600 మార్కులు వస్తాయని అనుకుంటే నా అంచనా లకు మించి 434/600 మార్కులు వచ్చాయి. ఇంటర్వ్యూలో బోర్డు సభ్యులు నా సమాధానాలకు సంతృప్తిపడ్డారు. 200 మార్కులకు 130 ఇస్తారని ఆశించాను. కానీ 116 మాత్రమే దక్కాయి.

ఈఎస్ఈ నెగ్గటం సుదీర్ఘ ప్రక్రియ. రెండు మూడేళ్లు పడుతుంది. తెలుగు విద్యార్థులు ఏడాది గట్టిగా ప్రయత్నించి రాకపోతే నిరాశపడి వదిలేస్తారు. కానీ కనీసం రెండు సంవత్సరాల కృషి తప్పనిసరి అని గుర్తించాలి.

**మంచి ర్యాంకు రావాలంటే...**

ఈఎస్ఈలో సిలబస్ విస్తృతం. ఇంజినీరింగ్ టెక్నికల్ సబ్జెక్టుల్లో మౌలిక విషయాలపై (ఫండమెంటల్స్) పట్టు పెంచుకోవాలి. అంకిత

## అమ్మనుడి

వీర తిలకం దిద్ది
నాకు ఎల్లప్పుడూ
ఆయుధమై నిలుస్తుంది

పెన్ను తట్టి, వెన్ను తట్టి
అవసరమైనప్పుడు
నన్నే ఆయుధంగా మలుస్తుంది.

**–సింగంపల్లి అశోక్ కుమార్**
9256277375

భావంతో నిరంతరం.. రెండేళ్ళ పాటు చదవాలి. ప్రిపరేషన్ గురించి పక్కవాళ్ళతో పోల్చుకోకూడదు. దీనివల్ల అనవసరంగా ఒత్తిడికీ, నిరాశలోకీ వెళ్ళే ప్రమాదముంటుంది. ఆశావహ దృక్పథం పెంచుకోవాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టెస్ట్ సిరీస్ రాయాలి.

ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది. దీనిలో అన్ని సబ్జెక్టుల మౌలికాంశాలు తెలుసుకోవాలి. ఇచ్చిన సమయం సరిపోతుంది.

మెయిన్స్ డిస్క్రిప్టివ్ పద్ధతి. ప్రశ్న దగ్గరే కేటాయించిన స్థలంలో జవాబులు రాయాలి. అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా ప్రశ్నలుంటాయి. సమస్యలను పరిష్కరించాల్సివుంటుంది. 12 సబ్జెక్టుల్లో 8 సబ్జెక్టులను సమగ్రంగా, సంపూర్ణంగా చదివితే ఆ పరీక్షలో నెగ్గవచ్చు. రెండు పేపర్లలో ఒక్కోదానిలో ఏడు ప్రశ్నల్లో ఐదింటికి జవాబులు రాయాలి. కానీ ఐదూ రాయటానికి సమయం సరిపోదు. సమగ్రంగా నాలుగు మాత్రం రాయగలుగుతాము.

మౌఖిక పరీక్షలో... హెచ్‌ఆర్ ప్రశ్నలు ఉండవు. సాంకేతికతను సమాజంలో ఆచరణాత్మకంగా ఉపయోగించటంపై ప్రశ్నలు అడుగుతారు. పుస్తకాలకు మాత్రమే పరిమితమా? బయట ఏం జరుగుతోందీ అవగాహన ఉందా లేదా అనేది పరీక్షిస్తారు. మన స్వభావాన్నీ పరిశీలిస్తారు.

**ఇవి ముఖ్యం**


①సమాధానాలు కచ్చితంగా రాయాలి. ①సమయ నిర్వహణ అవసరం. ①ఏకధాటిగా రోజూ ఒకే సబ్జెక్టు చదవకూడదు. రెండు గంటలకో సబ్జెక్టును మారుస్తూ చదివితే ఆసక్తి వస్తుంది. ①పూర్వ ప్రశ్నపత్రాలు పదేళ్ళవి సాధన చేయాలి. ①టెస్ట్ సిరీస్ రాసి తప్పులు సవరించుకోవాలి. ఫార్ములాల పునశ్చరణ కూడా జరుగుతుంది. ①వివిధ పీఎస్‌యూల ప్రశ్నపత్రాలు అభ్యాసం చేయాలి. దాంతో కాన్సెప్టుల రివిజన్ జరుగుతుంది.

**ఏమిటి తేడా?**

గేట్ .. అప్లికేషన్ ఓరియెంటెడ్. అందుకే క్లిష్టం. కానీ ఈఎస్‌ఈలో మౌలిక అంశాలే ఉంటాయి కాబట్టి సులువు. అయితే సిలబస్ విషయానికొస్తే... మొదటిదానిలో తక్కువ (10 సబ్జెక్టులు), రెండోదానిలో ఎక్కువ (22 సబ్జెక్టులు). రెండిట్లోనూ రుణాత్మక మార్కులు ఉన్నప్పటికీ తికమక పెట్టే ఆప్షన్లు గేట్‌లోనే ఎక్కువ.. ఈఎస్‌ఈలో అవి అంతగా ఉండవు.

గేట్ స్కోరు ద్వారా ఉద్యోగాలు ఎక్కువ లభిస్తాయి. ఈఎస్‌ఈ ద్వారా అవి పరిమితం. రైల్వేస్, డిఫెన్స్, నేవల్, రేడియో రెగ్యులారిటీ సర్వీసెస్.. ఇలాంటివి. గేట్‌ను ఆరు నెలలు కష్టపడి రాసేయవచ్చు. కానీ ఈఎస్‌ఈ నెగ్గటం సుదీర్ఘ ప్రక్రియ. రెండు మూడేళ్లు పడుతుంది. తెలుగు విద్యార్థులు ఏడాది గట్టిగా ప్రయత్నించి రాకపోతే నిరాశపడి వదిలేస్తారు. కానీ రెండు సంవత్సరాల కృషి తప్పనిసరి. ఉత్తర భారతదేశ విద్యార్థులు ఒక్కొక్కళ్ళు 3-4 ఏళ్ళు ఈఎస్‌ఈకి కేటాయిస్తారు కాబట్టి వారి విజయశాతం ఎక్కువ. **ఐఐటీయన్లు మాత్రమే ఈఎస్‌ఈ సాధిస్తారని చాలామంది అనుకుంటుంటారు. ఇది పొరపాటు అభిప్రాయం. ఇంటర్ వరకూ ఇంగ్లిష్ మీడియం చదవని నేనే ఈఎస్‌ఈ ర్యాంకు కొట్టాను. ఇక ఏ విద్యార్థి అయినా నిశ్చయంగా సాధించవచ్చు!**

(జనమాధ్యమాలనుండి మప్పిదాలతో...)



సంపుటి : 3 సంచిక : 8
**అమ్మనుడి**
అక్టోబరు 2017

## సంపాదకీయం

# చంద్రశేఖరరావుగారికి జేజేలు!
# ప్రపంచ తెలుగు మహాసభలు కీలకం, ఆదర్శం కావాలి

**డి**సెంబరు నెలలో ప్రపంచ తెలుగు మహాసభలను అయిదురోజులపాటు ఘనంగా జరుపాలని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారు నిర్ణయించడం ప్రపంచమంతటా విస్తరించివున్న తెలుగు ప్రజల మెప్పును పొందింది. ప్రత్యేక తెలంగాణకై జరిగిన ఉద్యమతీవ్రతలో నాయకుల ప్రసంగాల్లో చెలరేగిన వేడిమాటల వల్ల, కిందిస్థాయిలో అనేక అస్తవ్యస్తపు ప్రకటనల వల్ల జనంలో ఏర్పడిన శంకలు తొలగిపోయాయి. అంతేగాదు, తెలుగునుడి రక్షణ కోసం తలపెట్టిన తక్షణచర్యలను కూడా ముఖ్యమంత్రిగారు ప్రకటించడం సర్వత్రా సంతోషాన్ని నింపింది. అభినందనల వెల్లువను పొంగించింది.

చంద్రశేఖరరావుగారు తెలుగులో ఎం.ఏ చేశారు. దామోదరం సంజీవయ్య, పి.వి.నరసింహారావు, నందమూరి తారక రామారావుల తర్వాత సాంస్కృతిక పునాది, భాషపట్ల అవగాహన కలిగిన ముఖ్యమంత్రి మళ్ళీ తెలుగువారికి లభించారు. ప్రజోద్యమ నిర్మాతగా, తెలంగాణ రాష్ట్ర సాధకుడుగా ఆయనకున్న ప్రధానభూమిక కూడా స్థానిక సాంస్కృతికతతో కూడిన ప్రజారాజకీయం. తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త కీ.శే.జయశంకర్ ఆశయాదర్శాలను ప్రతిబింబిస్తున్న పాలకుడుగా ఆయనను ఇప్పుడు తెలుగు ప్రజలు చూస్తున్నారు. పదిహేనేళ్లక్రితం విజయవాడలో 'ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు'పై నడుస్తున్న చరిత్ర పత్రిక నడిపిన సభలో ముఖ్యఅతిథిగా జయశంకర్ పాల్గొన్నప్పుడు ఆయన మాట్లాడిందీ, మేమిద్దరం చర్చించుకొన్న విషయాలు అన్నీ ఇప్పటికీ నాకు గుర్తున్నాయి. తెలుగు భాషాజాతి ప్రజలందరి శ్రేయస్సును కోరుకొన్న జయశంకర్, పాలకులు తెలుగుకు పట్టిస్తున్న అథోగతికి ఎంతో ఆవేదన చెందారు. తెలుగుభాష, తెలుగు ప్రజల భాషా సాంస్కృతిక సహజ సంబంధాల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రికి ఉన్న అభిప్రాయాలు ఇప్పుడు వెల్లడైనాయి. తెలంగాణ ఉద్యమసమయంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్ణయాలు, నడుస్తున్నచరిత్ర పత్రిక అభిప్రాయాలు అన్నీ సమంజసమైనవేనని, ఇప్పుడు కాలం ధృవీకరించింది.

తెలంగాణకున్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతల వల్ల తెలంగాణ తెలుగుభాషలో కూడా ప్రత్యేకత చోటుచేసుకున్నదని, ఇది తెలుగుభాషా వైవిధ్యమే తప్ప, 'తెలంగాణ భాష' అనే అతివాదం అనవసరమని స్పష్టం అయింది. ఇలాంటి ప్రత్యేకతే ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ, తమిళనాడు తెలుగులోనూ ఉంది. ఇటువంటి ప్రత్యేకతలను కాపాడుకోవడం తెలుగుప్రజలందరి బాధ్యత. తెలంగాణ తెలుగులో నెలకొన్న ప్రత్యేకమైన మాటతీరులను, మాండలికాలను, సాంస్కృతికతను కాపాడుకొని తీరాలి. మొత్తం తెలుగు భాషాజాతి జనులను ప్రభావితం చేసేస్థాయికి అది ఎదగాలి. అందుకు తెలంగాణ ప్రభుత్వమూ ప్రజలూ కలిసికట్టుగా కృషిచేయాలి. తెలుగుభాష ఎవరి ప్రత్యేకమైన సొత్తూ కాదని, దాన్ని కాపాడడంలో తెలంగాణ అగ్రగామిగా ఉంటుందని ఈ ప్రపంచ మహాసభలలో ప్రపంచానికి వెల్లడి కావాలి. ఇదీ మనం చిత్తశుద్ధిగా కోరుకొనేది.

ఈ దిశగా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారు నిర్ణయాత్మకంగా ఆలోచిస్తున్నారని స్పష్టమైంది. 1 నుండి 12 వ తరగతివరకు తెలుగును ఒక తప్పనిసరి బోధనాంశం చేయాలని ఆయన నిర్ణయించడం స్పష్టమైన ప్రకటన. అప్పుడే దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వనేతపై కూడా పడిందని తాజావార్తలు తెలుపుతున్నాయి. నిజానికి, సరిగా ఏనాడూ అమలుగాని ఒక జి.ఒ (నెం.86/2003) ఉంది. దానిప్రకారం 1 నుండి 10 వరకు తెలుగు ఒక తప్పనిసరి సబ్జెక్టే. తెలుగులోనే పాలన చెయ్యాలనే జి.ఓ.లూ ఎన్నో వున్నాయి. పాలకులకు సంకల్పమూ చిత్తశుద్ధీ లేనప్పుడు అవి అమలుకావు గదా! ఇంతకాలమూ పట్టిన దౌర్భాగ్యమంతా అదే. భాష ప్రాతిపదికగా ఏర్పడిన రాష్ట్రంలో ఆ భాషనే తుదముట్టించిన ఘనత పాలకులదే. ఆ 'మాయ'రోగానికి సరైన మందు పడాలి. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన ప్రపంచ మహాసభల సందర్భమూ, ఆ వేదికా నిర్ణయాత్మకం కాగలవని అందరమూ ఆశిద్దాం.

ఈ సందర్భంగా ముఖ్యమైన ప్రతిపాదన చేస్తున్నాము. దయచేసి పరిశీలించండి. సభలకు కనీసం ఒక నెలరోజులు ముందుగా – తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషావిధానాన్ని సమగ్రంగా చర్చించి నిర్ణయించడానికి పాలనా నిపుణులతో, భాషావేత్తలతో, విద్యావేత్తలతో, ఉద్యమకారులతో రెండురోజులపాటు ఒక విస్తృత సదస్సును ఏర్పాటుచేయడం బాగుంటుంది. అందులో చేసే ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం సముచిత నిర్ణయాలను గైకొనడానికి ఇది దోహదపడుతుంది.

ప్రపంచ తెలుగు మహాసభలు కీలకమూ, ఆదర్శమూ కావాలని కోరుకుంటున్నాం. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారికి జేజేలు! విజయదశమి శుభాకాంక్షలు!

తేదీ : 29-9-2017

సామల రమేష్‌బాబు

# మణిపురి లిపి పునరుజ్జీవనం

**మణి**పురి జాతి అస్తిత్వం శతాబ్దాలుగా అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోంది. ఒక నరజాతి ప్రధానంగా వస్తుగత, పాదార్థిక భాషా సంబంధాల ద్వారానే ఒక ఏకమొత్త వ్యవస్థగా రూపొందుతుంది. అలాంటిది 18వ శతాబ్దంలో మణిపూర్ రాజు స్థానిక మణిపురి లిపిని నిషేధిస్తూ, బెంగాలి లిపిలో మణిపురి భాషా వ్యవహారాలను నడపాలని ఆదేశించారు. దాంతో 3,500 ఏళ్ళ చరిత్ర కలిగిన మణిపురి భాష అధికారికంగానూ, ఆ సమాజ కార్యకలాపాలలోనూ వినియోగంలో లేకుండా పోవడంతో మణిపురి భాషాజాతి అస్తిత్వం ప్రమాదంలో పడింది. మణిపురి పాలకుల అశాస్త్రీయ భాషా విధానాలు ఆ జాతి మనుగడను ప్రశ్నార్థకంగా మార్చిన ప్రధాన కారణాలలో ఒకటిగా నిలిచింది. బెంగాలీ లిపిని దిగుమతి చేసుకోవడంతో మణిపురి లిపి మూలన పడింది. అయితే మణిపురి ప్రజలు తమ జాతి అస్తిత్వంకోసంచేసిన సుదీర్ఘ ఉద్యమ ఫలితంగా మణిపురి లిపి క్రమంగా పునర్జీవం పొందింది. వీధుల పేర్లు, దినపత్రికలు, సాహిత్యం, శాసన సభ సమావేశాల రికార్డులు సైతం మణిపురి భాష, లిపిలోనే ఉండటం క్రమంగా ఊపందుకుంది.

పంహైబా పాలనా కాలంలో శాంతిదాస్ గోశాయ్ అనే హిందూ మత ప్రచారకుడు 1709లో ఆ ప్రాంతంలో వైష్ణవ మత వ్యాప్తికి కృషి చేసినందువల్ల మణిపురి భాషా వ్యవహర్తలు తమ లిపిని కోల్పోయారు. గరిబ్ నివాజ్ అనే రాజు తన పేరును సైతం బెంగాలీలోకి మార్చాలని ఆదేశించాడు.

మణిపురి లిపిలోని పుస్తకాలు, ఇతరత్రా సమాచార సామగ్రి మొత్తాన్ని ఆ రాజు తగులబెట్టించాడు. అయితే ఆయన నిషేధ నిర్ణయాన్ని చాలా మంది ప్రజలు వ్యతిరేకించి, వైష్ణవం, స్థానిక సనామహి రెండు మతాలనూ వారు అనుసరించసాగారు. ఆ రకంగా మణిపురి లిపిని వారు తరతరాలుగా పరిరక్షించుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కాలేజీ టీచర్లకు జూన్ 20 నుంచి పది రోజుల పాటు జరిగిన పునశ్చరణ కార్యక్రమం మణిపురీ భాష పునరుద్ధరణలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.

"కళాశాల, విశ్వవిద్యాలయ అధ్యాపకులు మణిపురి లిపిని తప్పనిసరిగా నేర్చుకోవాల్సి ఉంటుంది. ఒక క్రమంలో యూనివర్సిటీ స్థాయిలోనూ దీన్ని బోధిస్తారు" అని మణిపూర్ విద్యాశాఖమంత్రి టి. రాధేశ్యాం చెప్పారు. తగినన్ని బోధనా సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో సిద్ధంగా ఉన్నాయి. 24 సంస్థలతో ఏర్పడిన 'మీలాల్' ఈ పునరుద్ధరణ కార్యక్రమాన్ని 2003 ఆగస్టు 18న ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ముందుపీటిన నిలిచింది. రాతలోను, సామాజిక మాధ్యమంలోను, బహిరంగ రంగస్థలంలోను, విశాల ప్రజానీకానికి వినోదాన్ని అందించే రంగంలోను ఉపయోగించే మణిపురి యేతర పదాల వినియోగంపై మీలాల్ – దేగ కన్ను ఉంచుతుంది. బెంగాలీ లిపిలోని పాఠ్య పుస్తకాలను పక్కన బెట్టి



మణిపురీ లిపిలో బోధించాలని కోరుతూ పాఠశాలల్లో, కాలేజీల్లో మీలాల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించింది. మణిపురి లిపి గురించి పిల్లలకూ, పెద్దలకూ అందరికీ ఉచితంగా క్లాసులను నడిపింది.

**వ్యర్థ అక్షరాలు**

మణిపురి భాష సినో–టిబెటన్ భాషల కుటుంబంలోని టిబెటో–బర్మీస్ విభాగానికి చెందినది. అనేక బెంగాలి అక్షరాలు మణిపురి భాషకు అక్కర్లేదు. వాటిలో కొన్ని అక్షరాలను మణిపురి ప్రజలు సవ్యంగా పలక లేకపోతున్నారు. మణిపురి రాసేవాళ్లు బెంగాలీ అక్షరాలను వెర్రిమొర్రిగా వినియోగిస్తున్నారు. పర్యవసానంగా వారు అనేక పదాలకు విభిన్న గుణింతాలు వాడుతున్నారు. విశ్వవిద్యాలయ ఆచార్యులు తమ కిష్టమైన గుణింతాలను రీసెర్చ్ స్కాలర్స్‌పై రుద్దుతుండడంతో భాషా సమస్య తీవ్రతరమైంది.

**సమరశీలంగా అమలుచేయడం**

ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కార్యకర్తలు కొన్ని సందర్భాల్లో అతిగా ప్రవర్తించారు. మణిపురీ లిపిలోని నామ ఫలకాలపై తారు పూశారు. సిటీఫ్లై ఓవర్ నామఫలకాన్ని ఉద్యమకారులు ధ్వంసం చేశారు. బెంగాలీ పుస్తకాలు పెద్ద సంఖ్యలో ఉన్న, ఇంఫాల్‌లోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని గుర్తు తెలియని నిరసనకారులు ఒక రోజు రాత్రి తగులబెట్టారు.

పునరుజ్జీవన ఉద్యమకారుల కార్యాచరణ ఫలితంగా దినపత్రికలు ముందు పేజీలోని వార్తల్లో ఒక్క వార్తనైనా మణిపురి లిపిలో ప్రకటించవలసి ఉంటుంది.

హోర్డింగ్స్, బిల్‌బోర్డు ఇతరత్రా బహిరంగ కార్యక్రమాలన్నీ మణిపురి లిపిలోనే ఉండాలి. మణిపురి లిపిని అమలు చేయడాన్ని నిర్లక్ష్యం చేసినా లేదా మరచిపోయినా సదరు నిర్వాహకులు ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సి ఉంటుంది. అంతేకాక, వాహన యజమానులు తమ రిజిస్ట్రేషన్ నంబర్లను మణిపురి లిపిలోనే తప్పక రాయాలి.

పాతను పునరుజ్జీవనం చేసే కార్యక్రమానికి చాలా తీవ్ర అడ్డంకులు ఎదురైనాయి. కొన్ని గ్రూపులు చేసిన కోర్టు వ్యాజ్యాలు, అభిశంసనల నేపథ్యంలో మణిపురి లిపిని పునఃప్రారంభించడంలో ప్రభుత్వం వెనుకంజ వేసేట్టు చేసింది. 1980లో 27 అక్షరాలతో కూడిన మణిపురి లిపిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే

(తరువాయి19వ పుటలో)

-పురుషోత్తమ్ ప్రకాష్

# మాతృభాష రక్షణకోసం ఉద్యమం సాగాల్సిందే

**ప్రపంచంలోని ఏ భాష కూడా ఆయా దేశాల జాతీయ భాషగానో లేక అధికార భాషగానో ఉన్నప్పుడు ఆయా ప్రభుత్వ రంగాలలో అమలు కాకుండా ఉన్న ఉదాహరణలు ఎక్కడా లేవు. ఏ భాష అయితే అధికారికంగా అన్ని రంగాల్లో అమలు చేయబడుతుందో అప్పుడు మాత్రమే బలమైన భాషగా అవతరించుతుంది.**

**ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలూ లేకుండా ఆంగ్లాన్ని మాత్రమే రుద్దితే, రేపు మనం కేవలం తెలుగు భాషను మాత్రమే కోల్పోము; దాంతో పాటు భావవ్యక్తీకరణలో సృజనాత్మకతను కోల్పోయే ప్రమాదాన్ని మనం గమనించాలి.**

ప్రపంచంలో సుమారు ఏడువేల భాషలు ఉన్నాయి అని లెక్క. అయితే అందులో కోటికిపైగా వ్యవహర్తలు ఉన్న భాషలు సుమారు 80. ఇవి ప్రపంచ జనాభాలో సుమారు 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇక మిగిలినవాటిలో లక్ష మందికి పైగా మాట్లాడే వారు ఉన్న భాషలు సుమారు 950 కు పైగానే ఉన్నాయి. కోట్లల్లో వ్యవహర్తలు ఉన్న భాషల జనాభా, లక్షల్లో వ్యవహర్తలు ఉన్న భాషల జనాభా కలిస్తే ప్రపంచ జనాభాలో 98 శాతం పైనే. ఇక మిగిలిన 2% మంది మాట్లాడే 6 వేల భాషలూ, వేలూ వందలూ ఇంకా అంతకంటే తక్కువ మంది మాట్లాడుతున్నవే. ఇట్లా వేలూ వందలూ పదుల సంఖ్యలో మాట్లాడే చిన్నా చితకా భాషలు కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ఖండాలలోనూ వున్నాయి. అయితే వీళ్లు అనేక కారణాల చేత తమ జన్మ సంబంధ జాతులనుండి విడివడి వేర్పాటుగా బతకవలసిరావడంచేతనో లేక మానవ జాతుల పరిణామంలో తమ జన్మసంబంధీకులు ఎవరూ మిగలక ఏకాకులుగా మిగిలిన వారు కావటమో కారణం కావచ్చు.

ఈమధ్యనే అంటే ఈ శతాబ్ది ప్రారంభంలో గతంలో తక్కువ ఉన్నా ఇప్పుడు అత్యధిక వ్యవహర్తలు ఉన్న కొన్ని భాషలు అన్ని ఖండాలకూ శరవేగంగా విస్తరించాయి. ఇవి ముఖ్యంగా ఐరోపా దేశాల భాషలే. ఈ భాషలు అన్నీ వలసవాద దేశాల భాషలే. అవి విస్తరించిన పద్ధతీ స్థానిక భాషలపై వాటి ఆధిపత్య ధోరణీ గత కాలపు వలసవాదాన్ని భాష ద్వారా తిరగదోడటంలో కనిపిస్తుంది. అది విద్యా రంగం కావచ్చు ప్రభుత్వ రంగం కావచ్చు, శాస్త్రసాంకేతిక రంగం కావచ్చు. చిన్నా పెద్దా ప్రైవేటు సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కావచ్చు- చివరికి భాషా నైపుణ్యాల పేరుతో అన్ని రంగాల్లో అన్ని వైపులనుంచి విస్తరిస్తున్న భాషల ఆధిపత్యాన్ని మనం గమనించవచ్చు. దీనికి ఉదాహరణగా ఇంగ్లీష్‌ని తీసుకోండి. ఇలా **ఇంగ్లీష్ లేదా మరి ఏ భాష అయినా అది వేరే భాషల మీద తమ ఆధిపత్యాన్ని చలాయిస్తున్నాయి అంటే అది ఆయా భాషలకు గల సామర్థ్యాన్ని నిరూపించుకోవటం కాదు, ఆయా భాషల వెనక ఉన్న వలసవాద ఆధిపత్య ధోరణిని విస్తరించుకోవడంగా గుర్తించాలి.** ఈ భాషలలో రకరకాల పరిశోధనలు జరుగుతుండవచ్చు. ఎంతో సమాచారం అందుబాటులో ఉండవచ్చు. ఇంకా అనేక వనరులు లభ్యం అవుతుండవచ్చు. **శాస్త్రీయ సిద్ధాంత ప్రాతిపదికన ఏ భాషా మరో భాష కంటే అధిక సామర్థ్యం గలదికాదు. ఆధునిక అవసరాలను గుర్తించి అవకాశాలను అందిస్తే ఏ భాష అయినా సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించడానికి అనువుగానూ సమాచార ప్రసారానికీ ఆ సమాజానికి జ్ఞాననిధిగానూ ఉపయోగపడగల సామర్థ్యం గలదే. దీన్ని కాదనడం ఒక మనిషికంటే మరో మనిషీ, ఒక జాతి కంటే మరో జాతీ, ఒక సమాజం కంటే మరో సమాజం గొప్పవని ఒప్పుకోవడమే.** వీటిలోని హెచ్చుతగ్గులు అవకాశాలను బట్టీ అవసరాలను బట్టీ ఏర్పడి వుండవచ్చు. కానీ ఏదైనా ఒక భాష వేరే ప్రాంతాలకు విస్తరించి అక్కడ అన్ని రంగాల్లో ఆధిపత్యం చలాయిస్తున్నదీ అంటే అది నిస్సందేహంగా ఆధునికత ముసుగులో ఇతర భాషలపై ఆధిపత్య ధోరణిని ప్రదర్శించడమే. బహుళజాతివ్యాపార సంస్థల, మార్కెట్ శక్తుల ప్రాబల్యంతో వలస దేశాల సామాన్య ప్రజల జీవనంలోకి కూడా ప్రవేశించి వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే వారిని శాసించే స్థాయికి చేరుకుంటున్నాయి. అయితే ఆయా వలసవాద భాషల ప్రవాహ వేగాన్నీ, వాటి ప్రభావాన్నీ ఇక ఏమాత్రం చూస్తూ కూర్చోలేం.

## మాతృభాష

ఈ భూగోళంపై ఉన్న ప్రతి మానవ జాతీ ఆ జాతి క్రమ పరిణామంలో ఏర్పడ్డ తనదంటూ ఏదో ఒక భాషను తప్పకుండా వాడుతూ ఉంటుంది. ఇలా వాడుకలో ఉన్న భాషను మనం మాతృ భాషగా పరిగణిస్తాం. ఏ భాషనైతే మనం మొట్టమొదటగా ఇంటివద్ద నేర్చుకుంటామో దానిని మాతృభాషగా పరిగణిస్తాం. మనకు ఊహగా నాలు తెలిసినప్పటి నుండీ మన చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ, మెల్లమెల్లగా ఏ భాషనైతే మొట్టమొదటగా గమనిస్తూ మాట్లాడడం నేర్చుకుంటామో దానిని మన మాతృభాషగా పరిగణిస్తాము. చిన్నప్పటి నుండి ఏ భాషలో అయితే మనం ఆలోచించడం నేర్చుకుంటామో, అ భాషలోనే సృజనాత్మకంగా ఆలోచించగలుగుతాం. తరువాత నేర్చుకున్న భాష అంటే పరాయి భాషలో సృజనాత్మకతను వ్యక్తంచేయడం కష్టం. ఉదాహరణకు, **మాతృభాష కంటే ఎంతో కొంత భిన్నంగా ఉండి స్థానిక వ్యవహర్తలలా ఇంగ్లీషులో మాట్లాడగలగడం కష్టం. వారితో పోటీపడి వ్యవహరించడం అంతకంటే కష్టం. ఈ సామర్థ్యం రావాలంటే రెండు మూడు తరాలు గడవాలి. ఇంతలో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.** ఏదైనా కొత్త విషయాన్ని మాతృభాషలో నేర్చుకున్నంత సులభంగా వేరే ఏ భాషలోనూ నేర్చుకోలేము అన్న విషయాన్ని మనం ఇక్కడ గ్రహించాలి. మనం చుట్టూతా ఉన్న పరిసరాల గురించి గానీ, మన సమాజమూ సంస్కృతినీ గురించి గానీ మనం మాతృభాషలో సులభంగా గడగడ మాట్లాడినట్టు మరి ఏ ఇతర భాషలోనూ అంతగా మాట్లాడలేము.

కొన్ని చారిత్రక సామాజిక కారణాలచేత కొన్ని భాషలు కొన్ని రంగాలలో వాడుకలో లేకపోవడంతో వేరే భాషల మీద ఆధారపడవలసి వస్తోంది అనేది వాస్తవమే. కానీ మన మాతృభాషలు ఏ రంగంలో కూడా పనికిరావు అని వేరే భాషల మీద పూర్తిగా ఆధారపడడం మాత్రం

పెద్ద తప్పు అనే చెప్పాలి. ప్రత్యేకంగా బోధనామాధ్యమ విషయంలో. ఆధునిక సమాజంలో ఎంతోకొంత స్థాయివరకూ విద్యా మాధ్యమంగా లేని భాషలు త్వరలో వాడుకకు దూరమవుతాయని అనేక భాషాశాస్త్ర పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ విషయం మీద మాతృభాషలపై అన్ని కోణాల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. విద్యారంగంతోబాటు, పాలన, ప్రసారమాధ్యమాలు, వాణిజ్యవ్యాపార రంగాలలో మాతృ భాషలకు ఉచిత స్థానాన్ని కల్పించాలి. దీనికి కావలసిన ప్రయత్నాలను మొదలుబెట్టి వాటిని అమలుచెయ్యాలి. వీటికి అనుగుణంగా మాతృ భాషలను అధునీకరించాలి, ప్రామాణీకరించాలి. భాషలను అన్ని రంగాలలో ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలి. ఒక వేళ ఎట్టి పరిస్థితుల్లోనైనా ఏదైనా ఒక విషయాన్ని మనం మన భాషలో నేర్చుకో లేము అనుకుంటే వేరే భాష మీద ఆధారపడడం అనేది తప్పక పోవచ్చు. ఇక ప్రపంచంలోని ఏ భాష కూడా ఇతర భాషల నుంచి పదజాలాన్ని తీసుకోకుండా ఉండలేదు. అలా చేయకపోతే ఏ భాష కూడా ఎక్కువ కాలం నిలవలేదు లేదా అది కావలసినంతగా వ్యాప్తి చెందలేదు.

ఒక భాష ఇతర భాషల నుండి ఇచ్చిపుచ్చుకోవడం అనేది సహజం. ఎందుకంటే ఏ భాష కూడా అన్ని సంస్కృతులకూ అన్ని ప్రాంతాలకూ అన్ని రంగాలలోనూ అవసరమైన పదజాలాన్ని కలిగి వుండదు. దీనికి మంచి ఉదాహరణ ఆంగ్లమే. **ఈ ప్రపంచీకరణలో ఇతర భాషలను నేర్చుకోవడం తప్పనిసరి అయిపోయింది. మాతృభాషతో పాటు ఇతర భాషలను నేర్చుకోవాలి అన్న సిద్ధాంతాన్ని మనం పాటించాలి కాని మన మాతృభాషను పక్కన పెట్టి, దాన్ని విధ్వంసం చేసే పద్ధతిలో మరో భాషను బోధనామాధ్యమంగా నేర్చుకోవాలి అన్న సిద్ధాంతాన్ని మనం అనుసరించడం అనేది తప్పేకాదు, మొదటికే మోసం. మన అస్థిత్వానికే ఎసరు. ఇందుకా మన స్వాతంత్ర్యం? అసలు ఇప్పుడు భారతదేశంలో జరుగుతోంది ఇదే.** అనాలోచనతో దూరదృష్టిలేని పనులతో ఆంగ్లాన్ని ఎడాపెడా విద్యారంగంలో ప్రవేశపెట్టి భారతీయ భాషలను అశ్రద్ధ చేయడం కనిపిస్తోంది. ప్రభుత్వ రంగాల్లో, పాలనా రంగంలో, విద్యారంగంలో! ఇలా అన్ని రంగాల్లో మన మాతృభాషలను పక్కన పెట్టడం ఇంకా ఇది ఇలాగే కొనసాగితే మన భాషలు మెల్ల మెల్లగా అన్ని రంగాల నుంచి మాయం అయ్యే పరిస్థితి వస్తుంది.

**ఒక భాష తనది కాని వేరే ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని చలాయిస్తున్నది అంటే అది కేవలం ఒక భాషగా మాత్రమే విస్తరించడం లేదు అని మనం ఇక్కడ గ్రహించాలి. ఆ భాషతో పాటు అక్కడి సంస్కృతిమీద కూడా ఆ భాష ప్రభావం ఉంటుంది. ఇది ఇలా ఉంటే ఇతర భాషలు మన ప్రాంతానికి విస్తరిస్తున్నాయి అంటే దాని వెనుకనే రాజకీయ, సామాజిక, ఆర్థిక ఆధిపత్యాన్ని మన మీద రుద్దుతున్నాయి అని అర్థం.** చాలా ప్రాంతీయ భాషలు ఇదే అవస్థలో ఉన్నాయని తెలుసు. అవి అన్ని రకాల వనరులని కలిగి ఉండకపోవడం వలన అవి వేరే భాషలతో పోల్చుకుంటే కొంత వెనకబాటుతనాన్ని కలిగి ఉంటాయి అన్న మాట వాస్తవమే. ఇలాంటి భాషలుగల ప్రాంతాల్లో ఇంగ్లీషువంటి భాషలు దాన్ని అవకాశంగా మార్చుకొని అక్కడ కొన్ని వందల సంవత్సరాల నుంచి మనుగడ సాగిస్తూ ఆ భాషల మీద తమ ఆధిపత్యాన్ని చలాయిస్తున్నాయి. అలాంటి చోట ఇంగ్లీషు లాంటి భాషలు విస్తరిస్తాయి. అంటే మెల్లమెల్లగా అక్కడ వందల సంఖ్యలో ఉన్న భాషలు విధ్వంసానికి గురవుతాయి. ఒక భాష ఆధిపత్య ధోరణికి కొన్ని వందల సంఖ్యలో ఉన్న భాషలను పోగొట్టుకోవడం అనేది అసలు ఎంత వరకు సమంజసమో మనమే ఆలోచించాలి. ఆధునిక అవసరాలకోసం కొన్ని పరిమిత రంగాలలో ఇతర భాషలకు మనం అన్ని విధాలుగా స్వాగతం పలుకుతున్నాము అంటే మనమే వేల సంవత్సరాలనుంచి కాపాడుకుంటూ వస్తున్న భాషనూ, దాంట్లో ఉన్న జ్ఞాన సంపదనూ మనం పోగొట్టుకుంటున్నామని అర్థం.

ఇక్కడ ఒక సహజమైన ప్రశ్న తలెత్తుతోంది. అదేమంటే, ఇంగ్లీషు నేర్చుకోకూడదని గాదు గానీ ఎప్పుడు ఎవరు ఏ భాషను నేర్చుకోవాలి? ఏ భాషను నేర్చుకోగూడదు అన్న విషయాన్ని చెప్పడానికి ఎవరికీ ఎలాంటి అధికారం లేదు. భాష వ్యక్తిది కాదు. సమిష్టిది, సమాజానిది. సామాజిక న్యాయంతోనే నిర్ణయాన్ని తీసుకోవాలి. అది ప్రజాస్వామిక నిర్ణయం కావాలి. అది సమాజంలో అధిక సంఖ్యాకులకు న్యాయం చేసేదిగా ఉండాలి. అస్తిత్వవాదాల యుగంలో ప్రజాస్వామ్యంలో ప్రజల భాషకే పట్టం కట్టాలి. ఇది ముఖ్యంగా ముందుచూపుతో సామాజిక హితంతో స్థానిక భాషలతో స్థానిక వనరులతో స్వయంసమృద్ధిని సాధించే దిశలో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లే ప్రయత్నం. అంతేగానీ ఇతర దేశాలు మనను ఆదుకుంటాయనీ మన బరువును తమ తలకెత్తుకుంటాయనే భ్రమతో వాళ్ల ప్రాపకం కోసం తలవంచి గొర్రెదాటున ముందుకెళ్లే ప్రయత్నం చేయగూడదు. ఇది ఏ మాత్రం ఆలోచించే ప్రయత్నం చేసే ప్రభుత్వమైనా ఇలాంటి నిర్ణయాన్ని తీసుకోదు. **ఇప్పటివరకూ చేసిన అధ్యయనాలు అన్నీ ఇంటా బైటా ప్రపంచమంతటా మాతృభాషా మాధ్యమమే మేలనీ స్వయం సమృద్ధికీ ఆత్మవిశ్వాసానికీ ప్రతీకగా ఎన్నో ఆధారాలను చూపించాయి.** ఈ ప్రపంచీకరణలో ఆంగ్లం చాలా అవసరమే అన్న విషయం అందరికీ తెలుసు. అది అన్ని రంగాల్లో వ్యాప్తి చెందడం వలన కొంతవరకూ దాని మీద ఆధారపడక తప్పడం లేదు. అయితే ఆంగ్లం నేర్చుకోకూడదు అన్న విషయాన్ని ఎవరూ చెప్పడం లేదు గానీ ఆంగ్లంతో కొన్ని వందల భాషలూ వాటితోపాటు ప్రాంతీయ సాంస్కృతిక జానపద విజ్ఞానం అంతరించిపోతున్నాయి అంటే ఎవరూ పట్టించుకోకపోవడం అనేది దురదృష్టకరం.

## ఇంగ్లీషుపై మోజు

ఇలా తమ భాష అంతరించి పోతున్నా మనం దాని గురించి పట్టించుకోకపోవడానికి కారణం ఆంగ్లం మీద ఉన్న మోజు అన్న విషయం మనకు తెలిసిందే. కాని, మాతృభాష పట్ల చైతన్యం లేకపోవడం, మాతృభాష గురించి సరైన అవగాహన లేకపోవడం, భాషపట్ల పట్టింపు లేకపోవడం కూడా ముఖ్యమైన కారణాలు, దీనంతటికీ కారణం స్కూళ్లల్లో తెలుగు పద్యాలు, గద్యాలు, నవలలూ, కథలూ ఇంకా భాషా వ్యాకరణం, భాషణా నైపుణ్యాలూ వంటి విషయాలు బోధించడం జరుగుతోంది కానీ **మాతృభాష ప్రాముఖ్యత గురించి గాని, సమాజం సంస్కృతీ నిర్మాణంలో మాతృభాషల ప్రధాన పాత్ర గురించి కానీ మాతృభాషయొక్క ఆవశ్యకత గురించి గానీ అది ఒకవేళ అంతరించిపోతే మనం మన సంస్కృతిని గానీ మనం మాతృభాషలో సంపాదించిన జ్ఞాన సంపదనుగానీ మనం ఏ విధంగా నష్టపోతామన్న విషయాన్ని ఎక్కడా బోధించడం అనేది మనకు కనిపించడం లేదు. అందువలన మాతృభాషకు ఎలాంటి హాని జరిగినా అది అంతరించే స్థితిలో ఉన్నా మనం స్పందించే స్థితిలో లేని పరిస్థితి వచ్చింది.** సామాన్య ప్రజల నుంచి ప్రభుత్వం వరకూ కూడా భాషా సమస్య గురించి గానీ, భాషలు అంతరించి పోతున్నాయన్న విషయాన్ని గానీ పట్టించుకొనే స్థితిలో ఎవరూ లేరు. మన తెలుగు అంతరించిపోతున్నది కదా అని అడిగితే,

చాలామంది ఒకే సమాధానాన్ని ఇస్తారు. తెలుగు ఎక్కడ అంతరించి పోతున్నది! ప్రతిరోజూ మనం తెలుగులోనే కదా మాట్లాడుతున్నాం, తెలుగులోనే కదా మనం అన్ని రకాల విషయాలను చర్చించు కుంటున్నాం. మన సినిమా రంగం అన్ని సినిమాలను తెలుగులోనే తీస్తున్నారు కదా, ప్రతిరోజూ ఎన్నో వార్తా పత్రికలూ తెలుగులోనే వెలువడుతున్నాయి కదా, కథలూ, కావ్యాలూ, నాటకాలూ, పద్యాలూ ఇలా ఎన్నో విషయాలు తెలుగులోనే కదా జరుగుతున్నాయి, ముఖ్యంగా మన విద్యారంగం కూడా ఇంకా కొంతైనా తెలుగు మీడియంలోనే నడుస్తున్నది గదా. మరి ఇవన్నీ తెలుగులోనే జరుగుతున్నప్పుడు మరి తెలుగు ఎలా అంతరించి పోతున్నది లేదా చచ్చిపోతున్నది అని అనడం సాధారణం అయిపోయింది. అసలు దీన్నిగురించి మీరు ఏ తర్కంతో వాదిస్తున్నారో నాకు అర్థం కావడంలేదు అని ఇంకా తిరిగి దబాయిస్తారు.

ఇదంతా కొంతవరకూ ప్రస్తుతానికి వాస్తవమే కావచ్చు కానీ భవిష్యత్తు గురించే మన ఆలోచన. మాతృభాషను కాపాడుకోవాలంటే ఇవన్నీ తెలుగులోనే జరుగుతున్నాయి అని అనుకుంటే సరిపోదు. మనం మన మాతృభాషను ఏవిధంగా కాపాడుకోగలుగుతామా అన్న విషయాన్ని మనం తప్పక ఆలోచించాలి. గత వేల సంవత్సరాల నుంచి మనం తెలుగులోనే మాట్లాడుతున్నా, సమాచార వినిమయం తెలుగులోనే జరుపుతున్నా ముందుముందు ఇది పూర్తిగా కనబడకుండా పోయే పరిస్థితి ఎదురవ్వవచ్చు. ఎందుకంటే మనందరం తెలుగు నేలపై పుట్టి పెరిగినం. ఇక్కడ కోట్లాది ప్రజలు తెలుగులోనే మాట్లాడుతారు. కాబట్టి, ప్రజల పాలనలో ప్రజలభాషలోనే అంటే తెలుగులోనే మాట్లాడాలి. తెలుగులోనే రాయాలి. తెలుగులోనే సినిమాలూ, వార్తా పత్రికలూ ప్రకటనలూ నడిపించాలి. ఎందుకంటే స్థానిక భాషలో వ్యవహారాలు జరిగితే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. అదనంగా చేర్చే ప్రతి రంగం వలనా వందలాది ఉద్యోగాలు పెరుగుతాయి. దీన్ని మరిచిపోయి కోట్లాది ప్రజల్ని వేరే భాషకు మారమనడం అవగాహనా రాహిత్యమే గాదు తెలివితక్కువతనంకూడా. **ఏ రంగాల్లోనైతే తెలుగు వాడకం అమలు చేస్తే మన తెలుగును కాపాడుకోగలుగుతామో అసలు అలాంటి రంగాలలో ఎక్కడా ఎలాంటి ప్రయత్నమూ జరగడం లేదు. విద్యా రంగంలోనూ, ప్రభుత్వరంగంలోనూ తెలుగు అమలు చేయడాన్ని పట్టించుకోవడం లేదు.** ప్రతిరోజూ కోట్లాది ప్రజలు తెలుగులోనే మాట్లాడడం, వార్తాపత్రికలు, సినిమాలు, కథలు, కవితలు, నాటకాలు తెలుగులోనే రాయడం సహజంగా జరుగుతున్నా గత వేల సంవత్సరాలలో తెలుగుకు లేని ముప్పు గత ఇరవై, ముప్పై సంవత్సరాలలో తెలుగు వాడకంలో, తెలుగు అమలులో వచ్చిన మార్పును మనం గమనించితే మరి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరి కొన్ని సంవత్సరాల్లోనే తెలుగు భాష వాడకంలో ఎలాంటి భయంకరమైన నిర్ణయాలు తీసుకోవలసివస్తుందో ఏమో అన్న విషయమూ మనం ఇక్కడ గమనించాలి.

ఏదైనా ఒక భాష బతికి ఉండాలంటే అది సామాన్య ప్రజల వాడకంతో పాటు అన్ని రంగాలలో వీలైనంతవరకూ తప్పక అమలు చేయాలి. బోధనామాధ్యమంగానూ పాలన, ప్రకటన రంగాలలో తెలుగు వాడకానికి చట్టబద్ధత కల్పించాలి. భాష అన్ని రంగాల్లో అమలు అవుతుందా లేదా అన్న విషయాన్ని పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక సంస్థ అంటూ ఉండాలి. భాషను ఏయే రంగాలలో అమలు చేయాలో, కాలాన్ని బట్టి భాషలో వస్తున్న మార్పులనూ చేర్పులనూ గుర్తించి ప్రామాణీకరించాలో, ఎక్కడెక్కడ భాష సరిగా అమలు జరగడం లేదో గమనించి, ముఖ్యంగా తెలుగు భాష మీద వేరే భాషల ఆధిపత్యాన్ని అంచనావేసేందుకు ఎప్పటికప్పటికి ఒక ప్రత్యేక పర్యవేక్షణ జరుగు తుండాలి. అప్పుడే తెలుగుభాష బతకగలుగుతుంది. అప్పుడే ఉద్యోగావ కాశాలు పెరిగి ప్రజల జీవనావకాశాలు మెరుగు పడతాయి.

భాష జవసత్వాలతో బతికి ఉండాలి అంటే అది కేవలం ప్రతిరోజూ వాడుకలో మాత్రమే ఉంటే చాలదు. ముఖ్యంగా ప్రభుత్వ రంగాలలో అమలు అవ్వాలి. అప్పుడే భాష వేరే భాషల ఆధిపత్యాన్ని తట్టుకొని నిలబడగలుగు తుంది. లేకపోతే కేవలం ప్రతిరోజూ వాడుకకే పరిమితం అయితే వేరే భాష ఆధిపత్యం వల్ల అది మెల్లమెల్లగా అంతరించి పోతుంది. **ప్రపంచంలోని ఏ భాష కూడా ఆయా దేశాల జాతీయ భాషగానో లేక అధికార భాషగానో ఉన్నప్పుడు ఆయా ప్రభుత్వ రంగాలలో అమలు కాకుండా ఉన్న ఉదాహరణలు ఎక్కడా లేవు. ఏ భాష అయితే అధికారికంగా అన్ని రంగాల్లో అమలు చేయబడుతుందో అప్పుడు మాత్రమే బలమైన భాషగా అవరించుతుంది.** కాని నామ మాత్రానికి మాత్రమే అధికార భాషగా ఉన్న భాషలు, ఆంగ్లం లాంటి భాషల అధిపత్యానికి తట్టుకోలేక అంతరించిపోయిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల వలన అంతరించి పోయే స్థితిలో మరెన్నో భాషలు ఉన్నాయి. **తెలుగు లాంటి భాషలు ఇప్పటికి ఇప్పుడే అంతరించి పోయే స్థితిలో లేవు కానీ ఇలా బోధన, పాలనా రంగాలలో అమలు చేయకుండా ఆంగ్లం లాంటి భాషను ఎన్ని రోజుల వరకు తట్టుకొని ఉండగలుగుతాయి అన్న విషయాన్ని మనం ఇక్కడ గమనించాలి.**

ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం కేవలం తెలుగును మాత్రమే అన్ని రంగాలో అమలు చేయాలి అన్నది కాదు, ముఖ్యంగా తెలుగును విద్యా రంగంలో అమలు చేయడంలో వస్తున్న సవాళ్ళను మనం గమనిస్తునే ఉన్నాం. దాంతో పాటు అసలు అన్ని రంగాల్లోనూ కేవలం ఆంగ్లాన్ని మాత్రమే అమలు చేయడం వలన తెలుగుకు గానీ, తెలుగు సమాజానికి గానీ ఎంత వరకు న్యాయం చేస్తున్నాం అనే విషయం మీద ఒక శాస్త్రీయ పద్ధతిలో పరిశోధన జరగాలి. **ఎలాంటి శాస్త్రీయ మైన ఆధారాలూ లేకుండా ఆంగ్లాన్ని మాత్రమే రుద్దితే, రేపు మనం కేవలం తెలుగు భాషను మాత్రమే కోల్పోము; దాంతో పాటు భావవ్యక్తీ కరణలో సృజనాత్మకతను కోల్పోయే ప్రమాదాన్ని మనం గమనించాలి.**

ప్రపంచంలోని ఎన్నో దేశాలు తమ మాతృభాషలోనే అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాయి అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. కానీ వేరే దేశాలు తమ మాతృభాషలోనే అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధిస్తుంటే, మనం మన భాష మీద సరియైన అవగాహన లేక వేరే భాష భ్రమలో పడి కొట్టుకుపోతున్నాం. మన మాతృభాషలు వలస భాష అధిపత్యం వలన అంతరించి పోయే ప్రమాదం ఉంది అని ప్రభుత్వాలకు నచ్చచెప్పడానికి భాషోద్యమం నిరంతరం సాగవల్సిన అవసరం వున్నది. అంటే మనం మన భాష ఏ పరిస్థితిలో ఉందో గమనించాలి. ఇప్పటికైనా ఈ ప్రమాదాన్ని మరింత ప్రమాద స్థితికి చేరుకోనివ్వకుండా మనమందరం చేయి చేయి కలిపి భాషా ఉద్యమాన్ని ముందుకు నడిపించాలి. **మనం మన భాషలను రక్షించుకుంటే మన భాషలు మన సమాజాలను రక్షిస్తాయి.**

---

రచయిత హైదరాబాదు విశ్వవిద్యాలయంలో
పరిశోధక విద్యార్థి



# కళింగదేశ కీర్తిపతాక సెట్టి ఈశ్వరరావు శతజయంతి –2017

**ఆంధ్ర**దేశానికి ఆ బారున వున్న బారువా గూర్చి తెలుగు వారికి పరిచయం చేయటం విషాదమే, అయినా బ్రిటిష్‌వారు రాజ్యమేలుతున్నపుడు ఈ బారువా నుండే దేశవిదేశాలకు ఓడలద్వారా సరుకులు, సామాన్యులు ప్రయాణిస్తుండేవారు. 1917లో బ్రిటిష్ నేవిగేషన్ కంపెనీ పెద్ద ఓడ 1200 మందితో యిక్కడ మునిగిపోయింది. మొదటి ప్రపంచయుద్ధంలో భాగంగా జరిగిందా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అన్నది బారువా గాలిని అడిగితేగాని తెలియదు. అక్కడనుండే క్రీ॥పూర్వం నుండి తెలుగువారు బర్మా, సియాం వంటి దేశాలకు వెళ్లి అక్కడ మూన్ తెగగా రాజ్యాలు స్థాపించారని మా బర్మా మిత్రుడు నాయుడుగారు చెబుతున్నారు. తెలుగుమాటకు త్రిలింగకున్న లంకె ఏమిటో యిక్కడ అప్రస్తుతమైనా ఆ 'కళింగ దేశచరిత్ర' రాసి పరమపదించిన గురజాడ అప్పారావును లోకానికి పరిచయం చేసిన సెట్టి ఈశ్వరరావు బారువా నివాసి. ఆయన సెట్టి సోమశేఖరరావు, చిట్టెమ్మ దంపతులకు మార్చి8, 1917న మొదటి సంతానంగా జన్మించారు. (విజయనగరంలో జన్మించారని కొందరు అంటున్నారు. –సం॥) ఇది–2017– సెట్టి ఈశ్వరరావుగారి శతజయంతి సంవత్సరం.

అసలు యీ సెట్టి ఈశ్వరరావు ఎవరూ అని ప్రశ్నించే యీ తరం తెలుగువారికి పరిచయం చేయవలసిన అవసరం వుంది. కృష్ణశాస్త్రిగారు గురజాడ గూర్చి ప్రస్తావిస్తూ, మరణానంతరం ఆయన బతికాడని, 'ఆ పునర్జన్మకు కారణభూతుడైన విశిష్టవ్యక్తి సెట్టి ఈశ్వరరావు' అన్నారు. ఈ మాటను బూదరాజు రాధాకృష్ణ గారు 'సాహితీ సేవకుడు సెట్టి ఈశ్వరరావు అస్తమయం' అన్న వ్యాసంలో పేర్కొన్నారు. ఒక్క రాధాకృష్ణ గారే కాదు, ఆరుద్ర మొదలుకొని ఆనాడు బ్రతికివున్న ప్రముఖులు, సంపాదకులు అందరూ ఈశ్వరరావు గురించి వ్యాసాలు రాశారు. వాడుకభాష ఉద్యమం పాత గంజాం జిల్లాలో పర్లాకిమిడి నుండి ప్రారంభమయినా విశాఖపట్నంకూడా వంతపాడింది. అందులో గిడుగు రామమూర్తిగారి మిత్రుడు సెట్టి నరసింహంగారు ఎవిఎన్ కళాశాలలో అధ్యాపకుడుగా వుంటూ తనతో బాటు శ్రీనివాస అయ్యంగార్ వంటివారిని కూడా యీ ఉద్యమంలోకి తెచ్చారని అంటారు. ఆ సెట్టి నరసింహంగారు ఈశ్వరరావుగారికి పెదనాన్న. ఆయన వద్దేవుంటూ కొంతకాలం విజయనగరం యం.ఆర్.కాలేజీలో బి.ఎ. వరకు చదువుకొని పురిపండా అప్పలస్వామి, శ్రీరంగం శ్రీనివాసరావు వంటి వాళ్లతో సహవాసంచేసి వామపక్ష భావాలు అలవరచుకొన్నాడు. 1945లో వివాహం వారి తాతగారైన కోవెల సత్యనారాయణ గారింట్లో విజయనగరంలో జరిగింది. ఆయనకిద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలిద్దరూ మరణించి చాలా కాలమైంది. కుమారుడు సోమశేఖర్ తిరుపతిలో వున్నట్లు ఇటీవలే తెలిసింది. ఇది ఆయన కుటుంబ నేపథ్యం. సామాజిక నేపథ్యం చెప్పనక్కరలేదు, ఎందుకంటే ఎంతో శ్రమించి వివరాలు సేకరిస్తేనేగాని ఆయనగూర్చి తెలియటం లేదంటే ఆయన సామాజికంగా వెనుకబడిన కులానికి చెందినవాడుగావడమే కారణం అయివుండవచ్చు.


అభ్యుదయ రచయితల సంఘం ప్రారంభంనుండి తాపీ ధర్మారావు, చాగంటి సోమయాజులుగారితో వుంటూ 'అభ్యుదయ' పత్రికను మదరాసునుండి వెలువరించాడు. అంతకంటే ముఖ్యమైన "విశాలాంధ్ర" మాసపత్రికను 1950 ప్రాంతంలో ప్రారంభించి తరువాత దాని సర్వహక్కులు పార్టీకే యిచ్చేశారని తెలుస్తోంది. వీటన్నిటికంటే 'సోవియట్ లేండ్' తెలుగు పత్రికను "సోవియట్ భూమి"గా ప్రచురించిన దగ్గరనుండి 1980 వరకు ముఖ్య సంపాదక బాధ్యతలను చేపట్టి సోవియట్ సిద్ధాంతాలు, ప్రజల, అంతర్జాతీయ రాజకీయాలను సులభమైన భాషలో తెలుగువారికందించిన పాత్రికేయుడు ఈశ్వరరావు. ఇటీవల మిత్రుడు అజ్జాడ అప్పలనాయుడుగారితో మాట్లాడితే ఎగిరి గంతేసినంత పనిచేసి ఈశ్వరరావుగారు చాలామంచి కథకుడని శ్రీకాకుళం కథానిలయంకు వెళ్ళి ఆయన ప్రచురించిన 7 కథలను సేకరించారు. ఇంకా ఆయన అముద్రిత రచనలు కొన్ని మద్రాసు యూనివర్సిటీకి, మరికొన్ని విశాలాంధ్ర వారికి యిచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ఈశ్వరరావుగారి నిజమైన సాహితీసేవ – గురజాడ రచనలను పరిష్కరించి, కాపాడి తెలుగువారికందించడమే. కళింగ కీర్తిని దశదిశలా వ్యాపించేలా చేయటానికి ఆయన ఎంతో కష్టపడ్డాడు. బ్రిటిష్ ఇండియా రాజ్యంలో అభ్యుదయభావాలు, నాటి స్వాతంత్ర్య ఉద్యమం పెనుసవాలుగా మారడంతో ఆయన గురజాడ రచనలను డబ్బుపెట్టికొని మద్రాసులో "ప్రజాశక్తి" ఆఫీసులో, తరువాత మిత్రులవద్ద దాచిపెట్టినట్లు బూదరాజు రాధాకృష్ణగారు తెలియజేశారు. కన్యాశుల్కం, నీలగిరి పాటలు, సారంగధర, కొండు భట్టీయం, అసమ్మతి పత్రం విశాలాంధ్ర ప్రచురణ సంస్థ ద్వారా ప్రచురించారు. డైరీలు లేఖలు ఆయన మరణానంతరం అచ్చులో వచ్చాయి. సెట్టి ఈశ్వరరావుగారి కృషి, పట్టుదల, ఒకింత గురజాడపై భక్తిలేకపోతే మనకు గురజాడ జాడ తెలిసేదికాదు.

ముఖ్యంగా 'కళింగదేశ చరిత్ర'ను గురజాడ రాయగా ఆ ప్రతిని ఈశ్వరరావు కాపాడుతూ ఒక పెద్దమనిషికి అప్పచెబితే దాన్ని కొంత కాలం కారుషెడ్డులో తరువాత కాలగర్భంలో కలిపేశారట. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా తెలుగు నుడి పుట్టుపూర్వోత్తరాలు, పెరుగుదల, విస్తరణ తెలుసుకోవాలంటే కృష్ణా గోదావరిమధ్య మాత్రమే వెతికితే సరిపోదు. క్రిందనున్న కావేరి, ఉత్తరాన ఋషికుల్య దాటి గంగ వరకు వెళితే యింకా ఎన్నో ఆణిముత్యాలు తెలుగుతల్లి ఆభరణాలుగా లభిస్తాయి. ఈశ్వరరావుగారు మధ్యకళింగ వాసిగా తన జీవితాన్నీ, తన ముందుతరం గురజాడనూ తెలుగువారికందించినందుకు శతజయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుందాం.

**–ఆచార్య కె.ఎస్.చలం,** 7702200026

# సెట్టి ఈశ్వరరావు సాహిత్యాన్ని మరింత లోతుగా చూడాలి!




**ఆ**యన మంచి కథానికా రచయిత. పందుంపుల్ల, *బాంబులు పడినా, ఉసికొట్టే ఊహలు, హిందు- ముస్లిమ్* లాంటి చక్కటి కథానికలు రాసారు. నాటకాలు కూడా రచించారు. కొన్ని ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యాయి.

శతాధికంగా సాహిత్య వ్యాసాలు రాసారు. 'ప్రగతి' పత్రికలో కాశీనాధుని నాగేశ్వరరావు గారిమీద వ్యాసం రాసినా 'పరిశోధన' పత్రికలో 'వసంతసేన- చింతామణి- మధురవాణి' లాంటి వ్యాసం రాసినా లోతుగా పరిశీలించి, విశ్లేషించడం ఆయన నైజం.

విశాలాంధ్ర ప్రచురణాలయం కోసం ఆయన గురజాడ రచనలు, కథానికలు, కన్యాశుల్కం, ముత్యాల సరాలు (కవిత్వం), జాబులు- జవాబులు- దినచర్య లాంటి గ్రంథాలకు సంపాదకత్వ బాధ్యత వహించి - అటు గురజాడవారి గొప్పదనాన్ని, ప్రత్యేకతను నలుగురికీ తెలియ జెప్పడంతోబాటు గురజాడవారి మీదున్న తన ప్రేమని, తన సత్తాని కూడా నిరూపించుకున్నారు.

వీటన్నింటికన్నా ఆయన తెలుగు ప్రజల హృదయాలలో పాత్రికే యుడిగా కూడ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. రాచమళ్ళ సత్యవతీదేవి సంపాదకత్వంలో వెలువడిన తెలుగుతల్లి సాహిత్య మాసపత్రికకు సహాయ సంపాదకుడిగా పనిచేశారు. *'ప్రజాశక్తి'* దినపత్రిక సంపాదకు లలో ఒకరుగా తమ పాత్రికేయ సేవల్ని అందించారు. న్యూఢిల్లీలోని *'సోవియట్ భూమి'*కి సంపాదకత్వం వహించారు. *'విశాలాంధ్ర'* అనే పక్షపత్రికను ప్రారంభించి ప్రగతిశీల సాహిత్యానికి విశాల నేపథ్యాన్ని కలిగించారు. త్వమేవాహం, నయాగరా, వజ్రాయుధం, సంఘర్షణ లాంటి కావ్యాల తొలి విపుల విమర్శలతో బాటు రష్యన్ జానపద బాల సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించారు. ఆ రోజుల్లో రీడర్స్ డైజెస్ట్ లాంటి పత్రికల ద్వారా వెలువడుతున్న రష్యన్ వ్యతిరేక ప్రచారాన్ని అడ్డుకుని 'సాధక్' అన్నపేరుతో విమర్శా వ్యాసాలు రాసారు.

తర్వాత తర్వాత ఆయన విశాలాంధ్ర టైటిల్‌ను కమ్యూనిస్టు పార్టీ వారికిచ్చివేసారు. అమెరికా నీగ్రో కవుల గీతాలు అనే పుస్తకాన్ని అనువదించారు. 'మహాకవి మహాపురుషుడు గురజాడ అప్పారావు' అనే గ్రంథాన్ని రాసారు.

ఇన్ని వివరాలు ఇచ్చిన తర్వాత ఆ వినూత్న పంథాననుసరించిన ప్రగతిశీల సాహిత్యాన్నిఅందించిన, గురజాడవారి రూపాన్ని మనకు పరిచయం చేసిన గొప్ప సాహితీవేత్తెవరో మీరు గుర్తించేసే ఉంటారు.

ఆయనే సెట్టి ఈశ్వరరావుగారు. 1917 మార్చి 8న విజయ నగరంలో జన్మించారు. అక్కడి మహారాజా కళాశాలలో పట్టభద్రు లయ్యారు. అంటే ఇది ఆయన శతజయంతి సంవత్సరం. ఆయన అందించిన సాహితీ సేవల్ని మరోసారి గుర్తుచేసుకోవడమే ఆయనకు మనం అందించే ఘననివాళి.

గురజాడవారి దేశభక్తిగీత ప్రాముఖ్యతను తెలియజేస్తూ అది ఏ దేశానికైనా జాతీయగీతం కాగలిగిన అర్హతను కలిగి ఉంది అని ఆయన వివరించిన తీరు అమోఘం. అరసం వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. ఆ రోజులలో వారు నిర్వహించిన సమావేశాలకు ఎంతోమంది సాహితీ వేత్తలే కాకుండా చలన చిత్ర ప్రముఖులు వచ్చి, స్ఫూర్తిపొందారు.

అప్పట్లో గురజాడ 'దిద్దుబాటు'కన్నా ముందు 1902 ప్రాంతంలో 'కల్పలత' పత్రికలో సంపాదకులు సాంఖ్యాయన శర్మగారు రాసిన లలిత మొదటి ఆధునిక కథ- కథానిక- అనే అభిప్రాయము కొందరిలో ఉండేది.

దానిని ఖండించినవారు సెట్టి ఈశ్వరరావుగారు. లలితకథలోని భాష గ్రాంధికం. అదీ కాకుండా అది ఒకజానపదగాథ. కథా ప్రారంభం గాని, నడకగాని ఆధునిక లక్షణాలతో లేవు. మొదటి ఆధునిక, కథా లక్షణాలన్నీ పరిపూర్ణంగా దిద్దుబాటులో ఉన్నాయని ఆయన నిర్ధారించారు. భాషని సాహిత్యంలో ఆధునీకరించి, సాహిత్యంతోనే భాషని మార్చవచ్చని నిరూపించినవారు గురజాడే అన్నారు. ఆయన రచనలలోని ఆధునికతని, సంస్కారవాదాన్ని సోదాహరణంగా విమర్శించి సద్విమర్శకులు కూడానని నిరూపించుకున్నారు.

గురజాడ వారి గురించి కె.వి. రమణారెడ్డిగారి కొన్ని అభిప్రాయాల్ని ఆయన ఖండించారు-

పద్యవిద్యకు నన్నయ్య ఆద్యుడు కాదన్న గురజాడవారి అభిప్రా యాన్ని సెట్టి ఈశ్వరరావుగారు తమ విశ్లేషణా రచనలో పేర్కొన్నారు.

గురజాడ ఆశయాలు గొప్పవి. ఆయనది భాషా సాహిత్యాల రంగమే కాని, సంస్కరణ కార్యకలాపాలతో సంబంధం లేదు. ఆయన భాషా సాహిత్యాలకు చేసిన కృషి ఆచరణ కాకుండా పోయిందా అన్నది సెట్టి ఈశ్వరరావుగారి ప్రశ్న. అలాగే గురజాడ నాస్తికులు కాదు. ఆస్తికులే అని కూడా అంటారు ఈశ్వరరావుగారు. భూతదయ ప్రధానంగా వున్న బౌద్ధమతం పట్ల ఆకర్షితులయ్యారనీ అన్నారు. సంఘసంస్కరణాశయానికి ఆయన రచనలలో కనిపించిన ఆశయం కొండంత అండ. బ్రిటిష్ పాలనవల్ల దేశానికి కీడే కాదు మేలు కూడా జరిగిందన్న గురజాడ, రామమోహనరాయల అభిప్రాయంతో తామూ ఏకీభవిస్తామన్నారు సెట్టి ఈశ్వరరావుగారు. సాంఘిక భాషా సాహిత్య భావ విషయాలలో గురజాడ విప్లవవాది. భోగంకుల నిర్మూలనలో కూడా ఆయన అభిప్రా యాలు ఖచ్చితమైనవి. వివాహ వ్యతిరేకి కాదు. గురజాడ ఏకపక్షం వ్యక్తికారు. బ్రాహ్మణులలోని వైదీకి, నియోగి - శాఖా భేదాల్ని విమర్శించాడు."ఏకులమని నన్ను వివరమడిగితే ఏమని తెలుపుదు లోకులకు- పలుగాకులకు" అని ఆయన జవాబిచ్చేవా రన్నారు. ఇలా గురజాడవారి రచనలను గ్రంథస్థంచేసి మంచి ముందు మాటల్లో మనముందుకు తెచ్చిన గొప్ప పరిశోధకులు సెట్టి ఈశ్వర రావుగారు. ఆయన శతజయంతి సందర్భంగా ఆయన సాహిత్యాన్ని మరింత లోతుగా పరిశీలించి పాఠకులందరికీ తెలియపర్చాల్సి ఉంది.

**-డా॥వేదగిరి రాంబాబు, 9391343916**

-ధూపం అభిమన్యుడు
9490483744

# తల్లిభాషను తయారు చేసిన వారెవరు?

జనని సంస్కృతంబు ఎల్ల భాషలకు ...

నిజమే భారతీయ భాషలతో పాటు అనేక యూరోపియన్ భాషలలో సంస్కృత భ్రష్ట రూప పదాలు కనిపిస్తాయి. దీనిని గమనించినప్పుడు సంస్కృతం మూలభాషగానే కనిపిస్తుంది.

నిజానికి సంస్కృతం చాలా భాషలకు మాతృకే... అయినప్పటికీ అతి ప్రాచీనం కాదేమో...

మన పండితులు సంస్కృతాన్ని మూల భాషగా చెబుతున్నప్పటికీ అది నిజం కాకపోవచ్చు...

మా మిత్రుడు ఒకాయన అంటారు.. "సంస్కృతం కూడా భారత దేశంలోని ఏదో ఒక తెగ ప్రజలు మాట్లాడుకునే భాష అయివుండ వచ్చు" అని.. అది తప్పు భావనేమో అన్నది నా అనుమానం...

ఎందుకంటే 'సంస్కృతం'లో కృతం అంటే తయారు చేయబడినది అని అర్థం... తాను సంస్కరించి తయారు చేయబడిన దానిని అని సంస్కృతమే చెబుతోంది... మరి అలాంటప్పుడు దీనికంటే ముందుగా ఏదో భాష లేదా భాషలు వున్నాయనేగా అర్థం...

మరి దీనికంటే ముందుగా వున్న భాషనుండి దీన్ని సంస్కరించి నూతనంగా ఆవిష్కరించారు..అంటే దీనికంటే ముందు వున్న భాష ఏది ..?

ప్రాకృతమా?

అవును... ప్రాకృతమే.

చాలామంది ప్రకృతి సహజంగా ఉద్భవించినది కాబట్టి దీన్ని ప్రాకృతం అంటారు అన్నారు... ఇది కూడా తప్పే అయివుండవచ్చు.

ఎందుకంటే ఇది కూడా కృతమే అని చెబుతోంది.

ప్రాక్ అంటే తూర్పు...ముందు అనే అర్థాలున్నాయి...

అంటే సంస్కృతం కంటే ముందు తయారు చేయబడిన భాష అయివుండాలి...

అసలు భాషను తయారు చేయడమేంటండీ...భాషలు, పదాలు పుడతాయి కానీ ఎవరో తయారు చేయడమేంటీ... వితండవాదన కాకపోతేనూ...

నిజమే. చాలామంది పండితులకు ఇది వితండవాదనగానే కనిపించవచ్చు. సత్యాన్వేషణలో మనకు చాలా సంఘటనలు కనిపిస్తాయి. కొన్ని మనకు అనుకూలంగా వుండవచ్చు, లేకపోనూ వచ్చు. అనుకూలమైన వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని మిగిలిన వాటిని పరిగణనలోకి తీసుకోనప్పుడు... చెప్పడంలోనూ, అర్థం చేసుకోవడంలోనూ గందరగోళమే మిగులుతుంది...

భారతీయ చరిత్రలోనూ ఇవే పొరపాట్లు జరిగాయి... జరుగు తున్నాయి...వాటి గురించి నిర్మొహమాటంగా చర్చించుకోవాల్సిన అవసరం వుంది.

❖ ❖ ❖

సంస్కృతం, ప్రాకృతం రెండూ తయారు చేయబడినవే అనుకు న్నాము కదా...

మరి ఈ అవసరం ఎవరికి కలిగింది...?

**నిజంగా తెలుగువారి మూలాలు ఈ 500 వీర శాసనాలలోనే వుండి వుండాలి. ఎందుకంటే కృతయుగ ఆది నుండీ వున్న వారి శాసనాలలో తప్ప చరిత్ర మరెక్కడ లభిస్తుంది? వీరి శాసనాలలో 'చాతుర్వర్ణ కులజులు' అన్న పదం స్పష్టంగా కనిపిస్తుంది. అంటే నాలుగు వర్ణాలలో వున్న కులం అనేగా దీనర్థం. అంతేకాదు నేడు సప్తర్షి గోత్రాలు చెప్పుకునే బ్రాహ్మణ, క్షత్రియ జాతులకు మూలజాతి ఇదేనా..?**

ప్రాచీన శాసనాలలో ఛప్పన్నారు దేశాలు(56దేశాలు) అన్న పదం తరచుగా కనిపిస్తుంది. జాగ్రత్తగా గమనించినప్పుడు ఈ 56 దేశాలు అనే పదం ప్రాచీన అఖండ భారతదేశానికి సంబంధించినదిగా కనిపిస్తుంది.

అలాగే వీరబలింజలు అనే వారు శాసనాలలో తమను తాము 500 వీరశాసనాలు కలిగినవారుగా చెప్పుకున్నారు. ఇలా చెప్పుకున్న వారు ప్రపంచంలో మరెక్కడా కనిపించరు. వారి ప్రతి శాసనంలోనూ 'పంచాశత వీరశాసన' అనే పదాలు కనిపిస్తాయి.

96 తెగలు కలిగి 56 రాజ్యాలు పరిపాలించినవారు అని ఆ శాసనాలు చెబుతాయి.

ఒకే మూలానికి చెందిన ఈ 96 తెగలు సూర్య చంద్ర, శేషనాగ, యదు వంశాలకు చెందిన వారని బాంబే గెజిటీర్ లోని సమాచారం.

ఇదే గుంపులోని వారే 'అయ్యావళీ -500' అనే వ్యాపారులు.

వీరి గురించి తమిళంలో "తిచైయయేరత్తైన్నూరువర్ ' అంటారు. అంటే వెయ్యిదిక్కులకు చెందిన 500 మంది వర్తకులు అని అర్థం.

దీనిని అలా పక్కకు పెడదాం.

❖ ❖ ❖

వీరబలింజల శాసనాలలో వీరు కృతయుగ కాలం నుండీ ప్రపంచమంతా తిరుగుతూ వ్యాపారాలు చేసిన వారని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తన రెడ్డిరాజ్యాలచరిత్రలో వివరించారు.

ఇక గ్రామపాలనాధికారం కలిగిన 96 తెగలు వీరే అన్న విషయం స్పష్టమౌతోంది.

ఇక 14, 15 శతాబ్దాలనాటి వీరబలింజ శాసనాలలో చప్పన్న దేశాలకు కట్టుబాటు నిర్ణయ పత్రిక అంటూ కులాలకు కట్టుబాట్లు, హద్దులు నిర్ణయించిన శాసనాలు కనిపిస్తాయి. దీనిని బట్టి ఈ 56 దేశాలూ ఒకే రకమైన కట్టుబాట్లతో జీవించారని తెలుస్తోంది.

మరి విభిన్న తెగలు, భాషలు కలిగిన 56 దేశాలను ఏకతాటిపై నిలబెట్టింది ఎవరు...?

ఇంకెవరు?! సంస్కృతమే...

వీరు పరస్పరం సమాచారాన్ని అందిపుచ్చుకుని పరిపాలన సాగించడానికి ఈ తెగల మధ్య అనుసంధాన భాష అవసరం ఏర్పడి వుంటుంది.

అప్పుడే దేశంలోని భాషాశాస్త్ర నిపుణులు సంస్కృతాన్ని ఆవిష్కరించి వుంటారు.

అందుకే ప్రాచీన పండితులు స్థానిక భాషతో పాటు సంస్కృతాన్ని తప్పనిసరిగా చదువుకునేవారు.

నేడు ఇంగ్లీషు ప్రపంచ అనుసంధాన భాషగా ఎలా ఏర్పడిందో... అతి ప్రాచీన వలస సామ్రాజ్యాలను స్థాపించిన భారతీయులు సంస్కృతాన్ని కూడా విశ్వవ్యాపితం చేశారు.

ప్రతి మూల గ్రంథమూ సంస్కృతంలోనే రాయబడింది. ఎందుకంటే ఎక్కువ మందికి తెలిసిన భాషలో వుండే సాహిత్యానికి పాఠకులు కూడా ఎక్కువగా వుంటారు. అందువల్ల అన్ని భాషలలోని కవులు సంస్కృతం వైపు మొగ్గు చూపించి వుంటారు.

సంస్కృతం కంటే ముందు వున్న ప్రధాన భాష ఏది...?

బహుశా తెలుగే అయివుండవచ్చా...

ఏమో అయివుండవచ్చేమో...

# సంస్కృతానికి తల్లి తెలుగేనా?

**ఆ**ధునిక పరిశోధనల తరువాత తెలుగుభాష ఆనవాళ్ళు ఎక్కడెక్కడ కనిపించాయి?

మెసపోటేమియా (నేటి ఇరాన్, ఇరాక్) లో జరిగిన తవ్వకాలలో కాల్చిన మట్టి ఫలకాలు లభించాయి. వాటిపై వున్న కీల లిపిని తర్జుమా చేయగా అవి అచ్చమైన తెలుగు వ్యాపారి రాసిన లేఖగా గుర్తించారు. మెసపోటేమియన్లు వాడిన పదాలు, వారి కేలండర్లోని సంవత్సరాల పేర్లు తెలుగు వారివే కావడం గమనించారు.

అదే విధంగా హిబ్రూభాషలోని బైబిల్ పాతనిబంధన గ్రంథంలో వున్న అనేక తెలుగు పదాలను ఉదహరిస్తూ 'తెలుగు – హిబ్రూకు మాతృభాష' అని పుట్లూరు నరసింహారెడ్డిగారు ఆగస్టు 29 'మన *తెలంగాణ*' పత్రికలో ఆధారాలతో సహా చూపించారు.

ఇక మనకు అత్యంత విలువైన సమాచారాన్ని అందించినవారు సుబ్రమణ్యన్ మలయాండి గారు. ఆయన రాసిన వ్యాసాన్ని అమ్మనుడి డిశంబరు 2016 సంచికలో ప్రచురించారు.

ఇక నా వాదన ఏమిటంటే...జలప్రళయంలో మునిగి పోకుండా నిలిచిన ప్రాంతం ఇప్పటి హంద్రీనదీ పరివాహక ప్రాంతం. ఇక్కడే రాతి ఎడారి వుంది. ఇది ప్రాచీన అగ్నిపర్వత లావా నుండి ఏర్పడినదిగా భూగర్భ శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఇక్కడే కేతవరం గుహలు వున్నాయి. ప్రాచీన మానవుడు రాసిన లిపి ఈ గుహలలోనే బయల్పడింది. ఈ లిపి మొహంజదారో, హరప్పా నాగరికతల లిపి ఒకటే అని తేల్చారు. ఇక్కడే అతిప్రాచీన ఋషుల పేరున్న గ్రామాలు గార్గేయపురం, శాతానికోట (శాతవాహనుల కోట) వంటివి కనిపిస్తాయి.

ఇక ఆంధ్ర అనే శబ్దం కూడా అంద్రినది వల్లనే ఏర్పడిందని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు అభిప్రాయపడ్డారు.

అంద్రిక చెట్లు అధికంగా వుండేది కనుకనే ఈ నదిని అంద్రి అంటారు. ఇక్కడ నివశించిన ప్రజలు ఆంధ్రులు అయ్యారు. సుబ్రమణ్యమలయాండి గారు చెప్పినదే నిజమైతే లక్షల సంవత్సరాల క్రితం జరిగిన ప్రళయానంతరం తిరిగి నాగరికతను కొనసాగించిన వారు ఇక్కడి ప్రజలే.

గతయుగాల నాగరికతల పట్ల అవగాహన కలిగినవారు, లిపి తెలిసిన వారు కూడా అయివుండాలి. ఇక్కడి నుండే సింధూ నదివైపు, మెసపొటేమియా వైపు ప్రయాణించివుండాలి. ఆహార సంపాదన కొరకు అడవులు పట్టుకు తిరిగిన అజ్ఞానులు అయివుండకపోవచ్చు. ఎందుకంటే వీరు గత నాగరికతలు మిగిల్చిన శేషజీవులు. వారికి గత నాగరికతలకు సంబంధించిన జ్ఞానం వుండే వుంటుంది.

మరి ఇలా పనీ పాటా లేకుండా తిరిగిన జాతుల గురించిన సమాచారం మనకేమన్నా శాసనాలలో లభిస్తోందా... చూద్దాం... మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తన 'రెడ్డిరాజ్యాల చరిత్ర'లోని పేజీ నెం.367 లో కొంతమంది గురించి తెలిపారు. అయ్యావోలు ప్రభువుల గురించి కన్నడ శాసనాలలో వున్న విషయాన్ని గురించి తెలిపారు. వాళ్ళు 'సాహసికులు. కృతయుగ ఆది నుంచీ ఎన్నో శతాబ్దాలబాటు సంచరించడానికే పుట్టినవాళ్ళు' అని అయ్యావోలుల కన్నడ పత్రాలు చెబుతున్నాయి అంటారు.

వీరే 500 వీరశాసనాలు కలిగిన వారు. ఇలా 500 వీర శాసనాలు కలిగిన జాతి మరొకటి భూగోళంపై కనిపించదు. వీరే 96 తెగలు కలిగి 56 రాజ్యాలు పరిపాలించినవారు. సూర్య, చంద్ర, శేషనాగ, యదు వంశాలకు చెందిన వారు వీరే... (బాంబే గెజిటీర్ పేజీ నెం.285 ఆధారం)

దీనినిబట్టి మన పురాణాలలో వుండే లక్షల సంవత్సరాల యుగాల లెక్క నిజమే అని భావించాల్సి వుంటుంది. ఈ వ్యాపారుల కుటుంబాలకు చెందినవారే ప్రపంచమంతటా వలసరాజ్యాలను స్థాపించారు. ఈ కుటుంబాలకు చెందిన తరువాతి తరాల వారే ఆంధ్రశాతవాహనులు. నిజానికి శాతవాహనులు గోదావరీ తీరప్రాంత వాసులు కాదు. కృష్ణానదీ తీరంలో ప్రస్తుతం నందికొట్కూరు సమీపంలో వున్న శాతానికోట గ్రామమే వీరి తొలి రాజధాని ఆయివుండవచ్చు. ఈ పురాతన గ్రామం శ్రీశైలం ప్రాజక్టు నీటిమునకకు గురైంది. దక్షిణ భారతదేశానికి నడిబొడ్డు అయిన నేటి కర్నూలుజిల్లా వున్న పాంతం నుండే ఆంధ్రులు అనబడే తెలుగు నాయకులు, వ్యాపారులు ప్రపంచమంతా విస్తరించారు.

ఈ విస్తరణకు కేవలం కొన్ని వందల సంవత్సరాలు మాత్రమే పట్టింది అంటే అది అసహజమైన భావన గానే పరిగణించాల్సి వుంటుంది. ఈ విస్తరణ కొన్ని వేల సంవత్సరాలపాటు సాగింది అని భావించక తప్పదు. ఈ క్రమంలో వేల సంవత్సరాల నాటి అంద్రి పరీవాహక ప్రజలు మాట్లాడినది తెలుగేనా అన్నమాటకు ఆధారాలు చూపించడం అసాధ్యమే కానీ సంస్కృతం కంటే ముందుగా వున్న భాషల్లో తెలుగు ఒకటి అనడానికి మాత్రం చాలా ఆధారాలు కనిపిస్తున్నాయి.

ఎందుకంటే అతి ప్రాచీనమైన భాష సాహిత్య స్థాయి మిగిలిన భాషలకంటే చాల ఎక్కువగా వుంటుంది. ఉదాహరణకు తెలుగు భాషలో ఉన్నన్ని సాహిత్యప్రక్రియలు ఏ భాషలో కనిపించకపోవడం. దక్షిణాది భాషలలో దేనికీ లేని భావ వ్యక్తీకరణ స్థాయి తెలుగు భాషకు వుండడం వంటి కారణాలే కాదు. పద విస్తృతి, శబ్ద విస్తృతి రీత్యా కూడా మిగిలిన దక్షిణాది భాషల కంటే తెలుగు ముందుంటుంది. అందుకే పూర్వ కవులు దేశభాషలందు తెలుగులెస్స అని పలికారేమో.

నన్నయకంటే ముందు తెలుగుభాషకు వ్యాకరణం లేదు... దానికి సాహిత్య స్థాయి లేదు అని కొంతమంది వాదిస్తుంటారు. తెలుగులో

ద్విపద కావ్యాలు నన్నయకంటే ముందే వుండి వుండాలి. లేదా లయ ప్రధానమైన మాత్రా ఛందస్సు కలిగిన కావ్య రచన అయినా జరిగి వుండాలి. ప్రాచీన తెలుగుకు సంబంధించిన లిపి అనేక మార్పులకు గురైన విషయం మనకు విదితమే. ప్రాచీన తెలుగుకు సంబంధించిన లిపి మనకు లభించకపోవడంతో నన్నయ్యే ఆదికవి అనే అభిప్రాయానికి వస్తున్నాం.

ఇక చాలామంది ఆర్య ద్రావిడ సిద్ధాంతాన్ని దృష్టిలో వుంచుకుని దానిలో చరిత్రను ఇమడ్చలేక సతమతమవుతుంటారు.

నిజానికి ఆర్యద్రావిడ సిద్దాంతం ఎప్పుడో తేలిపోయింది. నేటి అయ్యావళులే ఆర్యులుగా పిలువబడి వుండాలి. ఎందుకంటే అయ్యా అనే తెలుగుపదానికి 'ర' కారాన్ని జోడించడం ద్వారా ఆర్యా అనే శబ్దం ఉద్భవిస్తుంది. ఇప్పుడు మనం రాస్తున్న లిపిలో రకారానికి య వత్తు ఇచ్చి రాస్తున్నాము. ప్రాచీన లిపిలో నేటి దేవనాగరి వలెనే య కారానికి ప్రక్కన ర వత్తు ఇచ్చి దానిని 'ర్యా' అని పలికేవారు. చాలా ప్రాచీన శాసనాలు గమనించినపుడు ఈ విషయం మనకు కనిపిస్తుంది.

ఇలా ప్రపంచమంతటా భారీగా వాణిజ్యాన్ని నడిపిన ఈ యోద్ధవ్యాపారులే తూర్పుదేశాలలో వలస సామ్రాజ్యాలను ఏర్పాటు చేసిన తలైంగులు.

ఇప్పటికీ తెలుగువారు రెండు రాష్ట్రాలలోనే కాదు ప్రపంచమంతటా వున్నారు. దక్షిణభారతదేశం మొదటి నుండీ తెలుగునే అధికార భాషగా ఆమోదించింది. అందుకే దక్షిణ భారతదేశమంతటా స్థానికులైన తెలుగువారు నివసిస్తున్నారు. ఈ విషయాన్ని పరిశోధించి తెలుగు కాదు దీన్ని దక్షిణాంధ్రం అనాలని నిరూపించిన సవెం.రమేశ్ గారు అభినందనీయులు.

**సాహసమే ఊపిరిగా, కట్టుబాట్లే ప్రాణంగా, ధర్మమే జీవన విధానంగా జీవించిన వీరబలింజల గురించి ఒక్క శాతం కూడా నేటి తరాలకు తెలియదు. కొన్ని వేల సంవత్సరాల క్రితమే ప్రపంచమంతటా ప్రయాణించిన సాహసులు వీరు. ప్రపంచానికి సంపదను పరిచయం చేసిన వారు, వాణిజ్యాన్ని పరిచయం చేసినవారు వీరే. అసలు మనిషి ఎలా జీవించాలో కూడా నేర్పించినవారు వీరే. వీరు అచ్చమైన తెలుగువారు. ప్రాచీన భారతదేశం నేడు వున్నట్లుగా లేదు. ఆ కాలంలో కులమే ప్రధానం. కులాలకు కట్టుబాట్లు, హద్దులు కఠినంగా అమలు జరిగాయి. వీటిని ప్రక్కకు పెట్టి భారతీయ చరిత్ర తెలుసుకోవడం అసాధ్యం.**

వీరబలింజలకు చెందిన శాసనాలలో 500 వీర శాసనాల గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. వీటి గురించి చరిత్రకారులు దానశాసనాలు అయివుండవచ్చని అభిప్రాయపడ్డారు. దానశాసనాలు అయివుంటే దానశాసనాలనే అభిప్రాయపడేవారుగా...వీరశాసనాలు అని ప్రస్తావించరు కదా...వీరశాసనాలు అంటే వారు సాధించిన విజయాలకు సంబంధించిన శాసనాలు అనుకోవాల్సిందే తప్పదు. వారి ప్రతి బిరుదూ ఒక విజయగాథకు సంకేతంగా పిలువబడుతోంది.

నిజంగా తెలుగువారి మూలాలు ఈ 500 వీర శాసనాలలోనే వుండి వుండాలి. ఎందుకంటే కృతయుగ ఆది నుండీ వున్నవారి శాసనాలలో తప్ప చరిత్ర మరెక్కడ లభిస్తుంది? వీరి శాసనాలలో 'చాతుర్వర్ణ కులజులు' అన్న పదం స్పష్టంగా కనిపిస్తుంది. అంటే నాలుగు వర్ణాలలో వున్న కులం అనేగా దీనర్థం. అంతేకాదు నేడు సప్తర్షి గోత్రాలు చెప్పుకునే బ్రాహ్మణ, క్షత్రియ జాతులకు మూలజాతి ఇదేనా..?

వీరబలింజల 500 వీరశాసనాలలో నేటి వరకు ప్రచురితమైనవి రెండంకెలలో కూడా కనిపించడం లేదు. వీటిలో కూడా ఎక్కువగా 500 శాసనాల ప్రస్థావన వున్న దానశాసనాలే అధికంగా వున్నాయి. తెలుగు వారి వాస్తవ చరిత్ర బయటకు రావాలంటే అసలైన శాసనాలను వెలుగులోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### తెలుగు - హిబ్రూకు మాతృభాష

హిబ్రూ భాషలో "అబ్బ, ఇమా (అమ్మ), అప్త (అవ్వ), కాయ, ఒరి (వరి), అక్క, అనాస, లే (లేదు), కై (చేయి), లబ్ (గుండె), కాసు (డబ్బు), ఇర్ (ఊరు), ఎట్ట (చెట్టు), ఎజి (ఏది), అను(నేను), దలుతు (తలుపు), ఒకెల్ (ఆకలి), ఒకట (బయట), గెషం (వర్షం), జ్వినో (జన్ను), కోస్ (కోపం), లిమన్ (నిమ్మ), లవన్ (వెల్ల/తెల్లని), కాలు (పాలు), కిసె (కుర్చీ), సాప, మర(పడమర), నెమ (చీమ)' వంటి తెలుగు పదాలున్నాయి.

పాత నిబంధనలో కూడా "ఈశయ్య, రామయ్య, సేరయ్య, మీరయ్య" అనే తెలుగు పేర్లు ఉన్నాయి. కొత్త నిబంధనలో "జక్కయ్య, అగ్రిప్ప, తబిత (సబిత), మేరి (కుమారి)" వంటి తెలుగు పేర్లున్నాయి. హిబ్రూ అంటే 'అబీరా' అని అర్థం. మహా భారత కాలంలో పశ్చిమ తీర ప్రాంతంలో నివసించే వారిని "అబీరా జాతి" అని పిలిచే వారు. వీరు హరప్పా నుండి, కేరళ తీరం తెలుగు రాష్ట్రాల వరకు విస్తరించారు. వీరి మాతృభాష తెలుగు. అబీరా అనే మాట "అరవ, అరబ్బీ, హిబ్రూ, అరప్పా (హరప్పా)" గా మారిపోయింది. అందువలన హిబ్రూలు తెలుగు ప్రాంతం నుండి వలస వెళ్ళిన అబీరా జాతి ప్రజలని, తెలుగు హీబ్రూ భాషకు మాతృభాష అని చెప్పవచ్చును.

**పుట్లూరు రాంనర్సింహారెడ్డి,**
9505885249

(మన తెలంగాణ, ఆగష్టు 29, 2017నుండి)

మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి.
అభివృద్ధి నిరోధకమైనవి కూడా.
అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు

భాషోద్యమ
కథానిక

# తీర్పు

–విహారి
9848025600

ఇప్పుడు రాజు – శ్రీవాణీ విద్యా నిలయం. తెలుగుబడిలో ఒకటో తరగతిలో ఉన్నాడు. ఆ బడిలో పరీక్షలూ లేవు. బండెడు పుస్తకాల బరువూ, ఏ డ్రెస్ కోడూ లేవు! ఉన్నదల్లా బతుకు చదువు పాఠాలూ, క్రమశిక్షణా!
రాజుని చూసి మాణిక్యమూ, తన కూతుర్ని, ఆ బడికి మార్పించింది.
రాబోయే మార్పుకి ఇంకా ఎంతమంది తల్లిదండ్రులు ఈ తీర్పుని వరిస్తారో...


సాయంత్రం ఐదు గంటలైంది.

పని ముగించుకుని ఇంటికొచ్చింది నరసమ్మ.

తల్లిని చూడగానే మొదలెట్టాడు రాజు "మమ్మీ– ఎసైన్మెంట్ చెయ్యాలే. ఛార్టు కావాలి, ఎట్టాగే?"

ఆరేళ్ళవాడు. ఒక్కగానొక్క లొట్టికాయ. ఒకటోతరగతి చదువు. ఇంగ్లీష్ మీడియం స్కూలు.

నెత్తిన నీళ్ళకుండని మోస్తున్నట్టు బరువు చూపు చూసింది. వాడికా చూపుకి అర్థం తెలుసు. అందుకే మళ్ళీ గునిశాడు, "డాడీ ఎప్పుడొస్తాడో."



"నాకాడ డబ్బుల్లేవురా." అని మాత్రం అన్నది. ఇల్లు సర్దుకుంటోంది. ముందుగా ఉతికి ఆరేసిన గుడ్డల్ని తీసి మడతలు పెడుతోంది.

"నువ్వెప్పుడూ ఇంతే....."

"అవునా?" అన్నట్లు చూసింది. వాడు అమ్మ వైపు చూడలేదు. ఒళ్ళో ఉన్న పుస్తకంలో పేజీల్ని తిరగేస్తున్నాడు. వాటినిండా ఖాళీ చతురస్రాలూ, దీర్ఘచతురస్రాలూ, వృత్తాలూ.. వివిధ ఆకారాల్లో, సైజుల్లో బాక్సులు. వాటి కింద ఉన్న పేర్లని బట్టి ఛార్ట్‌లో ఉన్న బొమ్మల్ని కత్తిరించి అంటించాలి. అదీ ఎసైన్‌మెంట్!

"డాడీ రాడు, నీకాడ డబ్బుల్లేవు." రాజు గొంతులో అసహనం, చిరాకూ.

బయటినుంచీ చల్లటి గాలితెర తాకింది.

నరసమ్మ గుండెల్లోనూ కొడుకు అవసరం పట్ల తడి వుంది. కానీ, ఆమెది నిస్సహాయమైన ఆర్ద్రత!

"నాయన సంపాదన కాస్తా కొడుకు పుస్తకాలకీ, ఛార్ట్‌లకీ చాలేట్టులేదు. ఛస్తున్నాం" అనబోయింది. కానీ అనలేదు. అంటే వాడు ఏడుస్తాడు. తాను సమాధానం చెప్పలేని ప్రశ్నల్ని వేస్తాడు– "అట్లాంటిదానివి నన్నీ చదువులో ఎందుకు దించావ్?" అని.

వాడికేం తెలుసు – పిల్లకాకి. తన ఆశ, కోరిక– వాడు పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలు చెయ్యాలనే గదా!

ఉన్నట్టుండి చాలా ఆలోచనలు ముసురుకున్నై– నరసమ్మ మనసున.

'చదువులేని మొద్దు. అణ్ణి కట్టుకుని నువ్ సుకపడ్లేవు వద్దే' అన్నది అమ్మ. 'బతుకో, చావో మావతోనే' అని పెళ్ళి చేసుకుంది. అటువాళ్ళూ ఇటువాళ్ళూ బయటికి నడిపించారు. నగరం పక్కన

పల్లెనుంచీ నగరానికొచ్చి వాలారు. శివయ్య స్నేహితుడింట్లో కాపరం. అడ్డా కూలీలుగా ఒకరోజు పనుంటే నాలుగు రోజులు ఉండని పరిస్థితి. చాలీచాలని కూడూ, నీడా. రెండిళ్ళల్లో పనికి కుదిరింది. శివయ్య రోడ్డుపక్కన టిఫిన్ సెంటర్లో టీ మాస్టరయ్యాడు. వేరే రేకుల షెడ్లోకి మారింది కాపరం. రాజు పుట్టాడు. వాడికి నాలుగేళ్లొచ్చేసరికి – భూతంలా ముందు నిలిచింది, చదువు సమస్య. 'రాజుని ఎట్టాగైనా ఇంగ్లీష్ స్కూల్లో వెయ్యాలి', తన మొండి పట్టుదల, కోరిక, ఆశ. 'ఎత్తలేని బరువొద్దే' అన్నాడు శివయ్య. విన్లేదు. వాదులాటలూ, కోపాలూ, తాపాలూ, చివరికి తన కాలికున్న రెండు జతల గట్టికడియాల్నీ అమ్మేసి రాజుని స్కూల్లో చేర్చింది!

అప్పట్నుంచీ – ఇక స్కూలు వాళ్ళవన్నీ హిరణ్యాక్షవరాలే. బస్‌ఛార్జీ, యూనిఫాం, షూస్.. పుస్తకాలూ.. తన రెక్కల కష్టమంతా ఉన్న ఈ ఒక్కలొట్టిగాడి చదువుకే చాలని పరిస్థితి వచ్చింది.

రాజు అవసరాల్నీ భార్య కక్కలేకా, మింగలేకా పడుతున్న అవస్థల్నీ చూసి – రోజూ శివయ్య చిందులూ, శివతాండవం... మధ్య మధ్య 'ఆడ్నసలు సదువు మానెయ్యమను' అని దాష్టీకం!

"మమ్మీ – 'కేటర్ పిల్లర్' అంటే ఏమిటి?"

రాజు ప్రశ్నతో నరసమ్మ ఆలోచన తెగింది. ఉలిక్కిపడి చూసింది. అదేమిటో తనకేం తెలుసు. తనదంతా వేలిముద్ర వ్యవహారం. అయినా, తనకున్న లోకజ్ఞానాన్ని కూడదీసుకుని చెప్పింది, "ఏఁవిటోరా మరి. 'ఆ పిల్లర్ కాడ మా యిల్లు అంటూ చెప్తారుగా, అదేనేమో" అన్నది.

'అట్టాగంటావా?' అని పుస్తకంలో తలదూర్చాడు. మాటని మాత్రం వదల్లేదు. "అదేంటో చూద్దామంటే ఛార్టు కావాలే? అని.

నరసమ్మ మనసు తన మూలుగుని తాను కొనసాగించింది. "ఈ స్కూలు వాళ్ళతో చచ్చే చావుగా ఉంది. నెలరోజులనాడు – రామోజీ ఫిల్మ్‌సిటీకి తీసుకుపోతాం, రెండొందలు తెమ్మన్నారు. శివయ్యకు చెబితే అగ్గిమీద బుగ్గైపోయాడు. 'నన్ను బజార్లో పెట్టి అమ్మేసుకోవే అని' ఘంయ్యిమన్నాడు. గుండెల్లో కర్ర దించినట్లైంది. మాణిక్యమ్మ దగ్గర అప్పు తీసుకుని పంపితే, రాజు మొహం మతాబులా వెలిగిపోయింది. తిరిగొచ్చి ఎన్నెన్నో కబుర్లు చెప్పాడు. ఆ మధ్యన– ఇట్టాగే రికార్డులంటూ నూటేభై తెమ్మన్నారు. చేతిలో పైసా లేదు. రాజుగాడేమో ఏడ్చి రక్కుకుని, దొర్లి, మొహం చెండుకొని సాధించాడు. తను పనిచేసే అమ్మగారిని అడిగి 'అడ్వాన్స్' తెచ్చిచ్చింది. 'ఇదిగో – ఇవ్వాళ ఈ చార్ట్ల గోల' అనుకుని బయటికి చూసింది.

శివయ్య రావటం లేదు. పొద్దుననగా పోయిన మనిషి, రెండింటికి రావాల్సినవాడు. రెండోమనిషి వస్తేనేగానీ, ఈయనకి కాలు కదపటానికి వుండదు. ఆయన రాకపోతే ఎగస్ట్రా డ్యూటీ. అప్పుడింక రాత్రి పదిదాటితేనే ఆయన రావటం!

ఈ ఆలోచనతో, ఆ ఆలోచనతో మనసంతా ముసురు పట్టినట్లైంది. బయటికొచ్చి నిల్చుంది. రోడ్డు మలుపుతిరిగి ఇంటికేసి నడుస్తున్నాడు శివయ్య. నరసమ్మ కళ్ళు మెరిశాయి.

–మొగుడికి అన్నంపెట్టి, రాజు సంగతి చెప్పింది.

విన్నాడు. సౌమ్యంగానే చూశాడు. 'హమ్మయ్య' అనిపించింది. 'ఎంతంట అయ్యగారి టెండరు?' అడిగాడు.

"మూడు ఛార్టులు డాడీ. బర్డ్స్, ఫ్లవర్స్ అండ్ ట్రీస్" అని మాటల్లోనే ఉత్సాహాన్ని ఎగరేస్తూ, "ట్వెల్వ్ రూపీస్ డాడీ" అన్నాడు రాజు.

"నువ్వింక తెలుగులో ఏఁవీ చెప్పవేరా?" అన్నాడు శివయ్య. వాడు తలవంచుకున్నాడు.

"ఆడి సదువు ఇంగ్లీష్ కదా?" అన్నది నరసమ్మ మురిపెంగా. 'అట్టా తెలుగు రాకపోవటమే ఘనత" అన్న తీరులో ముచ్చటపడింది– మెడని వాటంగా తిప్పుతూ.

"చాల్లే సంబడం!" అంటూ తిండి ముగించి లేచాడు శివయ్య. జేబులోనుంచీ ఇరవై రూపాయల నోటుతీసి ఇచ్చాడు. అది ఆ రోజు 'ఎగస్ట్రా' పనికి దక్కిన వేతనం!

రాము మొహం విప్పారింది.

"వాటన్నింటినీ పుస్తకంలో అంటించటానికి మళ్ళీ గమ్ కావాలంటావ్ అదీ తెచ్చుకునేడు" అన్నాడు శివయ్య మంచంమీద నడుం వాలుస్తూ.

"అవునవును" అని "థాంక్స్ డాడీ" అంటూ బయటికి పరిగెత్తాడు రాజు.

"ఇంగ్లీషు చదువు ఇంగ్లీషు చదువే..." అనుకుంది నరసమ్మ! 'వాడివన్నీ నెరపు మాటలే' అని సంతృప్తి పడింది!

❖ ❖ ❖

వారం రోజుల్లోకొచ్చింది స్వాతంత్ర్య దినోత్సవం.

ఆరోజు – పతాకావిష్కరణ సందర్భంలో– ముఖ్యమంత్రి, గవర్నరు పాల్గొనే వందన సమర్పణ కార్యక్రమంలో తమ స్కూలు పిల్లలు పాల్గొనే అవకాశాన్ని సాధించారు యాజమాన్యం వారు. పిల్లలందరికీ చెప్పారు. అందరూ ఉత్సాహంగా 'జయహో, అనుకున్నారు, అన్నారు – ముందుగానే!

రాజు ఇంటికి రాగానే మొహం చాటంత చేసుకుని మమ్మీకి చెప్పాడు వార్తని. 'బాగుందిరా' అని మెచ్చుకుంది.

క్షణాల తర్వాత నిదానంగా మాటని కొనసాగించాడు, "మమ్మీ! ఆ ప్రోగ్రాంకి ఫుల్‌వైట్ డ్రెస్, బూట్స్, బ్లూ టై కావాలి. టై మీద మా స్కూలు బ్యాడ్జ్ ఉందిగా అది పెట్టుకోవాలి"

నరసమ్మ గుండెల్లో రాయి పడింది. చేతిలో చిల్లర తప్ప డబ్బులేదు. శివయ్య కూడా అవసరాలకే చాలని సంపాదనతో అవస్థ పడుతున్నాడు. ఎనిమిది గంటలూ, పదిగంటలూ 'టీ' కలిపి అందించటంలో నిలబడి నిలబడి కాళ్ళు నరాలకేదో జబ్బు పట్టుకుంది. దానికోసం ఈ మందనీ ఆ మందనీ బాగానే ఖర్చవుతోంది. ఇప్పుడీ రాజు 'టెండరు' సంగతి చెబితే – బాధపడటం సంగతి తర్వాత... ముందు ఆవేశంతో తాటి ప్రమాణంగా లేస్తాడు.

కొడుక్కేమీ చెప్పలేదు. చెప్పినా అర్థం చేసుకొనే వయస్సా వాడిది?!

తనలోతానే ఆలోచనలతో నిముషాల్ని దహిస్తూ కూచుంది. చాలాసేపు మనసు మనసులో లేకుండా పోయింది.

– రాత్రి, శివయ్య పక్కన పడుకుని కొంచెం పై స్వరంతో తనకు తానే రాజు అవసరం గురించి చెప్పుకుంది.

విన్నాడు. ఠక్కున లేచి కూర్చున్నాడు. పరిపరివిధాలుగా తల తిప్పుకుంటూ, జుట్టు పీక్కున్నాడు.

"మన వల్ల కాదే అంటే విన్లేదు. చూశావా - వాడి సదువు మనకు దినదినగండం" అని అస్తిమితంగా మళ్ళీ నడుం వాల్చాడు.

నరసమ్మకి కళ్ళ నీళ్ళు తిరిగినై.

ఇద్దరికీ కంటిమీదకి కునుకు రాలేదు.

ఎప్పుడో తెల్లవారుఝాముకు నరసమ్మకే ఆలోచన ఒక కొలిక్కి వచ్చింది. శివయ్యకి చెప్పింది. ముందు తటపటాయించాడు. ఆ తర్వాత చాలాసేపటికి "సరే- నీ యిష్టం" అన్నాడు!

❖ ❖ ❖

ఆగస్టు పదమూడో తేదీ.

సాయంత్రం ఐదవుతుండగా ఇంటికొచ్చాడు శివయ్య. వచ్చీ రావటంతోనే ఆందోళనగా, కంగారుగా చెప్పాడు, "మీ అయ్యకి ఒంట్లో బాగాలేదుటే, మీ బావ ఫోన్ చేసి "పాత కోపాలు వదిలేసి నరసమ్మని వోసారి పంపు" అని చెప్పాడు. మీ అమ్మ కూడా చెప్పమన్నదంట. నువ్వెళ్ళి చూసిరా. నాకు మా సారు సెలవియ్యటం లేదు"

"అయ్యో... అయ్యో... ఏమైందయ్యా" అంటూ హడావిడిగా సంచీలో తనవీ, రాజువీ రెండేసి బట్టలు పెట్టుకుని, ఇంటిని సర్దుకుంది.

నిలువు గుడ్లేసుకుని చూస్తుండిపోయాడు రాజు,

"అయితే నేను ఎల్లొస్తా మాఁవా" అంటూ "మనం ఎల్దాంరా. చిన్నా" అని కొడుకు చేయి పట్టుకుని బయటికి నడిచింది.

అదిగో- అప్పుడూ -

రాజు నెత్తిమీది నీళ్ళకుండ భళ్ళున పగిలింది. ఏడుపే ఏడుపు. "ఇయ్యాల డాడీ వచ్చి నా డ్రెస్, షూస్ కొంటాడన్నావ్, నా ప్రోగ్రాం ఎట్లాగే." అని ఒకటే గునుపు, సతాయింపూ, తల్లి చేయి విదుల్చుకుని, మోకాళ్ళ మీద కూచుని గింజుకోసాగాడు.

శివయ్య కల్పించుకుని, వాడిమీద గుడ్లురిమి చేయి చేసుకుని, బయటికి నడిపించాడు. నీ ప్రోగ్రామూ, నా బొంద... మా ప్రాణాలు పోతున్నై" అని వేష్టపడ్డాడు.

నరసమ్మ ముందుకు!

శివయ్య మంచం మీద వాలి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆయన కళ్ళ ముందు - అత్తా మామల ఇల్లూ, నరసమ్మ చెప్పే అబద్ధాల దృశ్యం- కదులుతోంది!

❖ ❖ ❖

నెలరోజులు భారంగా కదిలాయి.

ఇప్పుడు రాజు - శ్రీవాణీ విద్యా నిలయం. తెలుగుబడిలో ఒకటో తరగతిలో ఉన్నాడు. ఆ బడిలో పరీక్షలూ లేవు. బండెడు పుస్తకాల బరువూ, ఏ డ్రెస్ కోడూ లేవు! ఉన్నదల్లా బతుకు చదువు పాఠాలూ, క్రమశిక్షణా!

రాజుని చూసి మాణిక్కెమ్మా, తన కూతుర్ని, ఆ బడికి మార్పించింది.

రాబోయే మార్పుకి ఇంకా ఎంతమంది తల్లిదండ్రులు ఈ తీర్పుని వరిస్తారో...

విద్యానిలయం ఆవరణలోకి వేపచెట్టు ప్రశాంతంగా, హాయిగా చల్లటిగాలిని పంచుతోంది!

## మణిపురి లిపి పునరుజ్జీవనం

(...8వ పుట తరువాయి)

మణిపురి లిపిలో 18 అక్షరాలుండాలని కొందరు, లేదా 27 అక్షరాలుండాలని మరికొందరు, 36 అక్షరాలుండాలని ఇంకా మరికొందరు డిమాండ్ చేస్తున్నారు.

'మైతీ' లిపిగా పిలుస్తున్న దాన్ని మణిపురి లిపిగా పిలవాలని మాజీ మంత్రి, లెఫ్టినెంట్ కల్నల్ హావోబం భూబన్ డిమాండ్ చేస్తున్నారు. అందుకు మూడు కారణాలున్నాయి-ఈ ప్రాంతాన్ని ఏలిన రాజులు చారిత్రక పత్రాలలో ఆ లిపిని వినియోగించేవారు. 1833 ఏప్రిల్ 18న జీరీ ఒప్పందంపై రాజు గంభీర్ సంతకం చేసారు. మరీ ముఖ్యంగా తంగ్‌ఖుల్ ఆదివాసి తెగ నాయకుడు యాంగ్‌మషో షియాజా నాయకత్వంలో మణిపూర్ అసెంబ్లీ 1979లో 27 అక్షరాలతో మణిపురి లిపిని ఆమోదించింది.

అస్సాం, త్రిపుర, ఇతర ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్, మయన్మార్ తదితర అనేక ప్రాంతాలలోని మణిపురి ప్రజలు తమ రాష్ట్ర భాషను మాట్లాడుతున్నారు.

**గోడ మీద రాత:**

ఈ ఉద్యమ ఫలితాలు ప్రస్ఫుటంగా మనకు కనపడుతూనే ఉన్నాయి. ఆ రాష్ట్రంలోని చాలా సైన్‌బోర్డులు బెంగాలీ లిపిలో లేకపోవడం యాదృచ్ఛికమేమీ కాదు. మణిపురి లిపిని ఉపయోగించని పోక్నాఫం, సంగాయి ఎక్స్‌ప్రెస్, హ్యూయెన్ లన్‌పావో వంటి పెద్ద పెద్ద దినపత్రికలు క్రమంగా పాఠకులకు దూరమవుతున్నాయి. మణిపురి లిపి లోనే విద్యార్థులకు విద్యాబోధన 2006 నుంచి కొనసాగుతుండడంతో, ఒక కొత్త తరం మణిపురి విద్యావంతులు ఉనికిలోకి వచ్చారు.

ముందుచూపున్న ప్రచురణకర్తలు సంప్రదాయక మణిపురి, ఇంగ్లీష్ భాషలలో వార్తాపత్రికలను తీసుకొస్తున్నారు. తిరుగుబాటును సమర్థించే అనేక ప్రజా సంఘాలు తాము విడుదల చేస్తున్న పత్రికా ప్రకటనలలో బెంగాలీ లిపికి బదులుగా రోమన్‌ను వినియోగిస్తున్నారు. చాలా మంది రచయితలు బెంగాలి లిపిని వినియోగించడం మానేశారు. అదే విధంగా అనేక మంది రచయితలు బెంగాలీ లిపిలో రాసిన తమ పుస్తకాలను సంప్రదాయక మణిపురి లిపిలోకి తిరగరాస్తున్నారు.


రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల కార్యక్రమాల వివరాల నకలును మణిపురి లిపిలోనూ ప్రచురించాలని మణిపూర్ అసెంబ్లీ స్పీకర్ వై. ఖేమ్‌చంద్ ఈ మధ్య ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

('ది హిందూ' ఇంగ్లీష్ పత్రికలో
ఐబోయైమ లైథంగ్బమ్ వ్యాసం ఆధారంగా)

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష.**

–డా॥సామల రమేష్‌బాబు
9848016136

# జనమాధ్యమాలకు మార్గదర్శి తాపీ ధర్మారావు



**తనలోని హేతువాదం, శాస్త్రీయ అన్వేషణ, సేవా ధోరణులవల్ల తాపీలోని కవి, రచయిత ప్రజలకోసమే ఆలోచించాడు. ప్రజలకోసమే రాశాడు.**

**తాపీ** ధర్మారావు ఎవరు? ఈ ప్రశ్నకు నేటి తరం యువత వెంటనే జవాబు చెప్పలేక పోవచ్చు. ఇటీవల నేను దినపత్రికల్లో పనిచేసే ఇద్దరు ముగ్గురు సీనియర్ రిపోర్టర్లతో మాట్లాడినపుడు వారు కూడా తమ తెలియని తనాన్ని బయట పెట్టుకో వడం ఆవేదనను కలిగిం చింది. నేటి పత్రికా ప్రసార మాధ్య మాల్లో (పత్రికలు, టీవీ) పనిచేసే ప్రతి ఒక్కరూ తాపీ ధర్మారావు గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది.

ఈరోజు తాపీధర్మారావు 130వ జయంతి. 1887 సెప్టెంబరు 19న ఆయన గంజాం జిల్లాలోని బరంపురం (ఇపుడు ఒడిషా రాష్ట్రం) లో పుట్టారు. 1973 మే 8న హైదరాబాదులో కన్నుమూశారు.

తాపీధర్మారావు పుట్టినరోజును తెలుగు జనమాధ్యమాల దినోత్స వంగా జరపాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య 2009 లో పిలుపు ఇచ్చింది. అప్పటినుండి తెలుగు నేలపై పలుచోట్ల ఈ సందర్భంగా సభలు, సమావేశాలు జరుగుతున్నాయి. 2006 సెప్టెంబరు 'నడుస్తున్న చరిత్ర' పత్రికలో ప్రముఖ రచయిత, ఉద్యమకారుడు కత్తి పద్మారావు– తెలుగు సాహిత్య చరిత్రలో నిర్లక్ష్యధోరణుల గురించి రాస్తూ– 'తాపీ ధర్మారావును ఎందుకు నిర్లక్ష్యం చేశారు? అని ప్రశ్నించిన వ్యాసం చర్చకు దారి తీసింది. దానికి స్పందిస్తూ మరో ప్రముఖ రచయిత, విమర్శకుడు, ఆకాశవాణిలో ఇప్పుడు తిరుపతి కేంద్రం డైరెక్టరుగా ఉన్న డా॥నాగసూరి వేణుగోపాల్, కీ.శే. ధర్మారావులోని బహుముఖ పాండితీప్రకర్షకుతోడు– ఆయన పత్రికల్లో, సినిమాల్లో వాడుక తెలుగును ప్రవేశ పెట్టినందువల్ల ఆ రంగాల్లో కలిగిన అద్భుతమైన మార్పును తెలుపుతూ మొత్తం 'తెలుగు జనమాధ్యమాలకు ఒక దినోత్సవంగా ఆయన పుట్టినరోజును జరపాలని ప్రతిపాదించారు. ఫలితంగా, 2009 నుంచీ ఈ తెలుగు జనమాధ్యమాల దినోత్సవం జరుగుతున్నది. అంతేగాక– తాపీధర్మారావు వేదిక ఏర్పడి, ప్రతి ఏడూ– తెలుగు పాత్రికేయుల్లో విశిష్ట కృషి చేసిన ఒకరికి తాపీధర్మారావు పురస్కారాన్ని ఇస్తున్నది. ఇంతవరకు ఈ పురస్కారాన్ని డా॥నాగసూరి వేణుగోపాల్, డా॥కె. శ్రీనివాస్, టంకశాల అశోక్, జి. శ్రీరామమూర్తి, ఎ.కృష్ణారావు, ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు స్వీకరించారు.. 2017 కు గాను, పురస్కారాన్ని ఎం.సతీష్‌చందర్ అందుకోనున్నారు.

తాపీ ధర్మారావు సంపాదకులకు సంపాదకుడు. కిందటి తరంలో తెలుగులో గొప్ప సంపాదకులుగా ఖ్యాతి గాంచిన నార్ల వెంకటేశ్వరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, పి.శ్రీరాములు, శ్రీవాత్సవ, రచయిత బోయి భీమన్న–వీరంతా తాపీ ధర్మారావు వద్ద ఉపసంపాదకులుగా పనిచేసిన శిష్యులే. రాసింది చూసి నేను నేర్చుకొన్నానని నార్ల వెంకటేశ్వరరావు ప్రకటించిన సంగతిని గుర్తు చేసుకోవాలి. పత్రికా రంగానికే ఆయన కట్టుబడి వుండినట్లయితే తాపీ ధర్మారావు గారి ప్రతిభకూ దీనికి చేసిన సేవకు తెలుగు పత్రికా ప్రపంచం ఆయనను నెత్తిన పెట్టుకొని ఉండేది అని నార్ల రాశారు.

1936 లో వ్యావహారిక భాషావాదిగా మారకముందు తాపీ ధర్మారావు గ్రాంధిక భాషావాది. తమ గురువు గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపి తెలుగు పండితులను, ఛాందసవాదుల్ని ఓడించి తెలుగు నేలపై భాషా ప్రజాస్వామ్యాన్ని తెస్తున్న సమయంలో కూడా ఆయనను ధిక్కరించిన వాడు తాపీ ధర్మారావు. అప్పటికే గ్రాంధిక తెలుగుభాషలో 'విలాసార్జునం' వంటి రచనలు చేసీ, కొండెగాడు, సమదర్శని పత్రికల్ని నడిపీ పండితుడుగా ముందుకు సాగుతున్న తాపీకి శృంగేరీ పీఠాధిపతి. ఆంధ్రవిశారద బిరుదును కూడా ఇచ్చారు. అటువంటి ధర్మారావు 1933–1936 మధ్య భావపరంగాను, భాషాపరంగాను తనలో తాను లోతుగా తర్కించుకొన్నాడు. చివరకు గిడుగు మార్గమే సరైనదని ఒప్పుకొంటూ తానువ్యావహారిక భాషావాదిగా మారినట్లు గిడుగుకు జాబు వ్రాశాడు. అక్కడి నుండీ తన రచనలను వాడుక భాషలోనే సాగించారు. ఆయన సంపాదకుడుగా 'జనవాణి' పత్రిక వాడుక తెలుగులోనే నడిచింది. ధర్మారావు నేతృత్వంలో, పత్రికల భాషలో రూపంలో ఎన్నోమార్పులు వచ్చాయి. పత్రికలకు ఇంగ్లీషులో వచ్చే వార్తలను అప్పటికప్పుడు తెలుగు చెయ్యాలి. అప్పటి కప్పుడు ఇంగ్లీష్ సంకెళ్లను తెంచుకొని తెలుగు అనువాదం చెయ్యడం చాలా కష్టం. అయినా, అనువాదభాషకు బదులుగా తేటతెలుగు భాషను ప్రవేశపెట్టి ఒక వరవడిని దిద్దిన ఘనత ధర్మారావుదే. ధర్మారావు సహజంగా కవీ, రచయితా గనుక తనదైన బాణీ అంటూ ఒకటుండేది. దీనికి తోడు కుశాగ్రబుద్ధి కావడంతో విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవడం త్వరగా జరిగేది. తాను గ్రహించిన విషయాన్ని తానే రచన చేశాడా అన్నంత సహజంగా దానిని వెలువరించ గలిగేవాడు. 1936 తర్వాత వచ్చిన జనవాణి దినపత్రిక, కాగడా, జనవాణి వార పత్రికలు తాపీ ధర్మారావు సంపాదకత్వంలో నడిచి మొత్తం పత్రికా రంగాన్నే ఒకమలుపు తిప్పాయి. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికతో సహా అన్ని పత్రికలూ తమ ముందటి ధోరణిని మార్చుకొని, పూర్తిగా వాడుకభాషలోనికి మరలడానికి తాపీ కారణమైనాడు. తెలుగు దిన పత్రికల్లో వ్యవహారిక భాషకు పూర్తి ప్రవేశం కల్పించిన ఘనత ధర్మా రావు గారిదే అనేది అందరు విమర్శకుల, పరిశోధకుల ఏకగ్రీవ తీర్పు.




**తాపీధర్మారావు 130వ జయంతి విశాఖపట్టణం నగర పౌర గ్రంథాలయంలో సెప్టెంబరు 19న సమైక్య భారతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.** నగరపాలిక డెప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిల్లాన దిలీప్ అధ్యక్షత వహించగా, తాపీవారి మనుమరాలు సుజాత షా, గురజాడవారి మునిమనుమడు డా.మోపిదేవి విజయగోపాల్, కమర్షియల్ టాక్సెస్ డిప్యూటీ కమీషనర్ టి.శివశంకర్, ఆకాశవాణి విద్వాంసులు చంద్రశేఖరరావు, సమైక్యభారతి అధ్యక్షులు పి.కన్నయ్య, నగర కార్యదర్శి జవ్వాది లక్ష్మి ప్రసంగించారు. సభ, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

1937లోనే మోహినీరుక్మాంగద చిత్రంతో సినీరంగంలోకి ప్రవేశించారు తాపీ. క్రమంగా సంభాషణల రచయితగా కథారచయితగా విజృంభించారు. అప్పటివరకు ప్రజల వాడుక భాషకు దూరంగా సినిమాల్లో పాత్రల భాష ఉండేది. ఆ గ్రాంధిక శైలికి స్వస్తిచెప్పి వాడుక భాషలోకి వాటిని మరల్చిన వాడు తాపీ ధర్మారావు. మాలపిల్ల, రైతుబిడ్డవంటి సినిమాల నుంచి 1962 లో భీష్మ వరకు కొన్ని పదుల చిత్రాలకు ఆయన కథ, మాటలు, కొన్ని సినిమాలకు పాటలు కూడా అందించారు. స్క్రీన్ ప్లే రాయడం అనే పద్ధతి తెలుగు సినిమాల్లో తాపీ తోనే మొదలైనదట. తాపీ రచయితగా సినిమాల్లో తెచ్చిన మార్పును అందిపుచ్చుకొని తర్వాత వచ్చిన అనేకమంది రచయితలు ఆ దారిలో ముందుకు సాగారు. ఆయన అందరికీ తాతాజీ. శ్రీశ్రీతో సహా ఎందరో ఆనాటి ప్రసిద్ధ రచయితలు తాతాజీ నుంచి తమ రచనల విషయంలో సవరణలను, సలహాలను తీసుకొనేవారు. దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు? పెళ్ళి–దాని పుట్టు పూర్వోత్తరాలు, ఇనుప కచ్చడాలు, ఆలిండియా అడుక్కుతినే వాళ్ల మహాసభ, సాహిత్య మొర్మొరాలు, పాతపాళీ, కొత్తపాళీ, రాలూరప్పులూ వంటి ఆయన రచనలు ఆ రోజుల్లో యువతపై ఎంతో ప్రభావం చూపాయి. చేమకూర వెంకట కవి రచించిన విజయ విలాసానికి హృదయోల్లాస వ్యాఖ్య రాసి, పండిత లోకానికి ఒక ప్రశ్నగా నిలిచిన పండితుడాయన. అంతటి తాపీ ధర్మారావు తెలుగువారి నందరినీ ఉద్దేశించి భాషవిషయంలో ఆనాడే– *అందరికి తెలియు మాటలు వందలు గదు॥ మారుబాస వాగగనేలా॥ అందమ్మనియా, వీనులవిందనియా॥ దాస్యమెంత వెర్రిదిరా..। నీ భావము నీ జాతికి నీ భాషను చెప్పలేక నీల్గెదవు...* అని హెచ్చరించాడు.

1936 కు ముందు తన రచనలన్నీ పాత పాళీవి అనీ ఇకపై కొత్త పాళీతో రాయుచున్నానని ప్రకటించిన సాహసి తాపీ 1912 లో కొండెగాడు పత్రిక నిర్వహణతో ఆయన పత్రికాజీవితం మొదలైనా, 1936లో కొత్త పాళీని ధరించిన తర్వాతే జనవాణి దినపత్రిక తోనే ఆయన పాత్రికేయ, సంపాదక ప్రతిభ గుబాళించింది. తర్వాత 1940లో కాగడా, 1949లో జనవాణి వారపత్రికలు సంపాదకుడుగా ఆయనకు కీర్తిప్రతిష్టలను చేకూర్చాయి.

పూర్తిగా పత్రికారంగంలో తలమునకలుగా ఉంటూనే సినిమాల రచనలోకీ ప్రవేశించడంతోపాటు, తన బహుముఖ ప్రజ్ఞతో అనేక ప్రజా రంగాల్లో తాపీ తన ప్రతిభను చాటుతూనే ఉండేవారు. తన మరణానికి సుమారు ఒక ఏడాది ముందువరకూ ఇదే ధోరణి. బహుశా ఆయన మరణించక ముందే టెలివిజన్ మన మధ్యకు వచ్చివుంటే తాపీ ధర్మారావు ఆ రంగంలోకి కూడా చొచ్చుకొని పోయేవారు. అంతటి విస్తృతి ఆయనది.

తనలోని హేతువాదం, శాస్త్రీయ అన్వేషణా సేవా ధోరణిల వల్ల తాపీ లోని కవి, రచయిత ప్రజల కోసమే ఆలోచించాడు. ప్రజల కోసమే రాశాడు. ఒక రాజకీయ పార్టీతో ముడి పెట్టుకొని వుంటే రాగల పరిమితులలో ఆయన ఇమడలేడు. అందువల్లనే ఆయన కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకోలేదు. కాని కమ్యూనిస్టుపార్టీతో మమేకమై పనిచేసిన తన పెద్దకుమారుడు మోహన్‌రావుకు పూర్తి సహకారమందించి ప్రజాశక్తి పత్రిక నిర్వహణలో తోడ్పడ్డాడు. 'ప్రజాశక్తి' నిషేధానికి గురైనప్పుడు పార్టీ సహకారంతోనే మొదలైన జనవాణి వార పత్రికను సంపాదకుడుగా నిర్వహించారు. కమ్యూనిస్టు కార్యకర్తగా ప్రజానాట్యమండలిలో క్రియాశీలంగా వున్న రాజమ్మను తన పెద్ద కోడలిగా చేసుకొన్నారు. మూడో కొడుకు తాపీ చాణక్య కూడా కమ్యూనిస్టే. ఆయన అభ్యుదయ కథాంశాలతో చాలా సినిమాలకు దర్శకత్వం వహించారు. వీరికే గాక మరెందరికో స్ఫూర్తి కేంద్రం తాపీ ధర్మారావు.

మొత్తంమీద ఇప్పుడు తెలుగు పత్రికలు, సినిమాలు ప్రజల భాషలో ముందుకు సాగి సమాజం మీద ఇంత ప్రభావాన్ని చూపుతున్నాయంటే– ఇందుకు తాపీ ధర్మారావు మౌలికంగా చేసిన కృషి మరపురానిది. నిరంతరం గుర్తు పెట్టుకొని, భావితరాలకు గుర్తు చేస్తూవుండవలసిన ప్రాముఖ్యత కలది. అందుకే తెలుగు జనమాధ్యమాల దినోత్సవంగా మనం తాపీ జన్మదినాన్ని ప్రతీ సెప్టెంబరు 19న జరుపుకోవాలి. నేటి పత్రికలు టీవీ, సినిమా రంగాలను మరింత ప్రజోపయోగంగా తీర్చిదిద్దుకోవడానికీ, అందుకు సమర్థులైన పాత్రికేయుల సంపాదకులను, రచయితలను, ఇతర బాధ్యులను నేటి కాలానికి తగినరీతిన పెంపొందించు కోవడానికి దీన్నొక అవకాశంగా తీసుకోవాలి.

**తాపీ ధర్మారావు 130వ జయంతి – తెలుగు జనమాధ్యమాల దినోత్సవం సందర్భంగా –** ప్రజాశక్తి దినపత్రిక 19 సెప్టెంబర్ 2017 నుండి

-డా॥వేదగిరి రాంబాబు
9391343916

# శ్రీపాద శిష్యుడైతే గురువులు - గురజాడ, గిడుగు



**గిడుగు ఆధునిక భాషయితే గురజాడ ఆధునిక సాహిత్యం! భాష-సాహిత్యాల మధ్య ఎంతటి సంబంధముందో గిడుగు గురజాడల మధ్యా అంతటి సంబంధముంది. వీళ్ళిద్దరి మధ్యా స్నేహం ఆధునిక భాషా సాహిత్యాల మధ్య చక్కటి బంధమైంది. వీళ్ళిద్దరి తర్వాత ఆధునిక భాషా సాహిత్యాల మధ్యా బంధాన్ని కలిపి తెలుగు వారికి చక్కటి విందునిచ్చిన మహనీయులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. అదెలాగో ఆయన మాటలద్వారానే గురజాడ, గిడుగుల ప్రభావం శ్రీపాద మీద ఎలా ఉందో- ఈ సంచికలో గురజాడ వల్ల, వచ్చే సంచికలో గిడుగువల్ల శ్రీపాద ఎలా ప్రభావితమయ్యారో ఆయన చెప్పిన విశేషాల ద్వారానే తెలుసుకుందాం.**

**గురజాడ తమకు మార్గదర్శి ఎలా అయ్యారో శ్రీపాదవారు 1946 డిసెంబర్ 'నవోదయ' పత్రికలో ఇలా ఓ వ్యాసం రాసారు. దానిని ఇక్కడ చదవండి...**

## మార్గదర్శి గురజాడ అప్పారావు -శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

అప్పారావుగారికి తమ సత్తా తమకి బాగా తెలుసు-

ఒకచోట-

"తూర్పు బలబల తెల్లవారెను
తోకచుక్కయు వేగుచుక్కయు
ఒడయు డౌ వేవెల్గు కొలువుకు
వెడలి మెరిసిరి మిన్ను వీధిని" అన్నారు.

తోకచుక్క విచ్ఛిత్తికి సూచకం. వేగుచుక్క మహోదయానికి సూచకం. నిజమే కాని, ఈ తోకచుక్క యేమిటి? ఇది చేసిన వినాశనం ఏమిటి? ఈ వేగుచుక్క యేమిటి; దీని తరువాత జరిగిన మహోదయం యేమిటి? అంటే-వశ్యవాక్కులు శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారే తోకచుక్క అనీ, గురజాడ అప్పారావుగారే వేగుచుక్క అనీ వ్యాఖ్యానం చేశారు.

రామమూర్తి పంతులుగారు చేసింది కృతకభాషా విధ్వంసనమేగా? అప్పారావుగారు చేసింది కవికుమారుల కళ్ళకు వెలుగు కలిగించడమేగా?

అంచేతనే మిత్రులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రులవారు, అప్పారావుగారిని "గురజాడ వాల్మీకి" అని వ్యవహరించారు.

నేస్తం, భమిడిపాటి కామేశ్వరరావుగారు "స్వయం జ్యోతి" అనీ, "ప్రథమాంధ్ర రచనా బ్రహ్మ" అనీ కీర్తించారు.

కాకినాడలో, ఆంధ్రసాహిత్య పరిషద్వార్షికోత్సవం జరిగింది. అప్పటికా నగరంలో ఇప్పటి టౌనుహాలు లేదు. అంచేత, ఆ సమావేశం మున్సిపల్ ఆఫీసులో జరిగింది.

తొలినాడు కిళాంబి రామావతారంగారూ, మలినాడు పిఠాపురం మహారాజులుంగారూ అధ్యక్షత వహించి కార్యక్రమం నడిపించారు. ఆ కార్యక్రమం ఏర్పరచినవారూ, పైని వుండి సర్వమూ పర్యవేక్షణ చేసినవారూ మాత్రం జయంతి రామయ్యపంతులుగారు.

అధ్యక్షులిద్దరూ రామయ్యపంతులుగారి ఇంగితం గుర్తించుకుంటూనే కార్యక్రమం నడిపించారు.

మరునాటి పొద్దుటిపూట కొన్ని తీర్మానాలు జరిగాయి. ఆ సందర్భంలో గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషావాదం ప్రతిపాదించగా, గురజాడ అప్పారావుగారు బలపరిచారు.

ఉద్యోగధర్మం పురస్కరించుకునేకాక, పాండిత్యం పురస్కరించుకు నిన్నీ వారూ, అప్పారావుగారిని చాలా ఆదరంగా చూసేవారు. తెల్లటి పంచె, నల్లటి పొడుగు కోటు, ఆ కోటు మీద ఆకుపచ్చని జలతారు శాలువ, శిరస్సున తేజోమండలంలాగ నిండైన పాగా, పరిణత వయస్కతకు సూచకంగా తిలతండుల న్యాయంగా వుండిన గుప్పెడేసి మీసాలు, పట్టి పల్లారుస్తున్న దీర్ఘవ్యాధికి గుర్తుగా చప్పిదవడలు. కాని, దూసుకుపోయే చురుకైన చూపులు.

అప్పటి సమావేశం అంతటిలోనూ ఒక్క అప్పారావుగారి ఆకృతే విలక్షణంగా వుండింది.

అందుకు తగ్గట్టు, ఇప్పటి ఆంధ్ర సాహిత్యం అంతటిలోనూ ఒక్క అప్పారావుగారి రచనలే విలక్షణంగా వున్నాయి.

ఏమంచ-

ఉబ్బసంతో వొగర్చుకుంటూ, ఖళ్ళున దగ్గుకుంటూ అప్పారావుగారు తీర్మానం బలపరిచి "నేను బలపరిచాను" అని రామమూర్తి పంతులుగారి చెవిలో నోరుపెట్టి ఇంగ్లీషులో గట్టిగా కూడా చెప్పారు.

ఆ భంగిమ చూసీ, ఆ మాట వినీ, వ్యావహారిక వాదులు వారిద్దరే కావటం గుర్తించీ, ఆవాదమున్నూ విని వుండిన్నీ, అప్పుడక్కడ వుండిన గ్రాంధికవాది ప్రముఖులు ఎగతాళి చేశారు.

వారి ననుసరించి యువకరచయితలున్నూ చాలామంది నవ్వారు.

ఒకక్షణం దాటితే నేనూ వారిలో చేరిపోయేవాణ్ణేకాని, నలుగురి తోబాటు నవ్వలసి వుండిన్నీ, నవ్వబోయిన్నీ, చివరకు నవ్వలేకపోయాను. కారణం, నా గురువర్యులు వేదుల రామకృష్ణశాస్త్రులవారి మందలింపు.

"వారిద్దరూ మహా పండితులు, వారిని న్యూనతపరచడం మనకి క్షేమంకాదు. వారి వాదం వినడం–చేతనయితే యెదిరించడం–యిది మనం చెయ్యవలసింది'' అన్నారు శాస్త్రులవారు, ఆకతాయి నయిపోకుండా నన్ను వారిస్తూ.

ఏమయినా పదికాకుల్లో ఒక కోకిల, రాజవీధిన దర్జాగా వెడుతున్న మదగజం–ఇదీ ఆ క్షణంలో అప్పారావుగారి స్థితి.

వారి మొగాన చికాకు అలుముకుని వుండింది; కాని చూపులు మాత్రం "తొందరపడవద్దు" అని దెకారిస్తున్నట్టున్నాయి.

అది నిజమే అయింది.

అప్పట్లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఏకైక సంస్థ.

సరికొత్త నిర్మాణం. అదీ మిసమిసలాడిపోతోంది.

అందరూ ఎగబాకారు? కాని యిప్పుడు?

గిడుగు రామమూర్తి పంతులుగారి తీవ్ర ప్రచారంతోనూ, అప్పారావు గారి అమర రచనలతోనూ భాషాకాశం మీది కారుమబ్బులు విడిపోయాయి.

సత్యం అవగాహన అయింది. శబ్దం, శక్తిన్నీ తెలిసి వచ్చింది.

దాంతో యువక రచయితలు ఆ ఏకైక సంస్థని విడిచిపెట్టి చక్కా వచ్చేశారు.

ఒక్కొరొక్కరుగానూ, గుంపులు గుంపులుగానూ వ్యావహారికంలో రచనలు మొదలుపెట్టారు.

అప్పటికే రచయితలయి వుండినవారిలో అనేకులు, తరువాత వ్యావహారికంలోకి వచ్చేశారు.

తరవాత్తరవాత, అసలు, వ్యావహారికంలోనే బయలుదేరుతున్నారుగా?

ఇంకో విశేషం యేమిటంటే!

ఇప్పటికీ, గ్రాంధికం విడిచి వ్యావహారికంలోకి వచ్చినవారూ, వస్తున్నవారూ ఎందరో వున్నారు.

ఇంతేకాదు, ఊగిసలాడుతున్నవారూ, రావలసినవారూ కూడా చాలామందే వున్నారు; కాని, వ్యావహారికం విడిచి గ్రాంధికంలోకి వెళ్ళినవారూ, వెడుతున్నవారూ, వెళ్ళదలచినవారూ ఒక్కరూ లేరు.

అది సత్యం అని గుర్తించి అయినా, ఆవిధంగా కూడా శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులవారికి ప్రాతికూల్యం వహించడానికయినా, యెనభైయేళ్ళ వృద్ధు గ్రాంధికంలో అపారంగా గ్రంథాలు సృష్టించిన నిత్యరచయిత– చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులవారు కూడా, చివరికి వ్యావహారికం అవలంబించి, అతి రసవంతంగా వచన రచన సాగిస్తున్నప్పుడు... ఇక దీనికేమి నిదర్శనం కావాలీ?

సారస్వతప్రీతిగల యిప్పటి యువకులు గ్రాంధిక రచనలు చదవడానిక్కూడా యిష్టపడలేకపోతున్నారు గదా, మరో నిదర్శనం చెప్పడం మాత్రం యెందుకూ?

ధర్మమే మరి.

అంధకారంలోంచి వెలుగులోకి రావడానికేగాని, వెలుగులోంచి అంధకారంలో కూలిపోవడానికెవరూ యిష్టపడరుగా?

మన కళ్ళ యెదుట, భాష విషయమై యింతటి మార్పు రావడానిక్కారణం వ్యావహారిక భాషా విశిష్టత వొక్కటి మాత్రమే కాదు, అప్పారావుగారి రచనల ప్రభావమున్నూ!

రామమూర్తి పంతులుగారి వాదం జాతికి ధైర్య సాహసాలు కలిగించగా, అప్పారావుగారి రచనలు దారిచూపించాయి.

అప్పారావుగారు చిన్న కథలు రాశారు. వాటిలో ఒకటి 'దిద్దుబాటు' అనేది యిప్పటికీ అద్వితీయమే. అది మొట్టమొదట ముట్నూరువారి "ఆంధ్రభారతి' మొదటి సంచికలో పడ్డప్పుడు రసికాంధ్ర లోకం వూగిపోయింది.

వారు ముత్యాలసరాలు నిర్మించారు. వాటి నెందరో ఉదహరిస్తుంటారు; కాని, ఆ భాష, ఆ నుడికారం, ఆ రచనా పద్ధతి, ఆ భావ సౌందర్యం–యిప్పటికీ యెవరూ అలవరుచుకోలేకపోయారు.

వారు "మాట–మంతీ" అన్న శీర్షికలో చాలా మంచి వ్యాసాలు రాశారు. ఒక్క 'చాలా' అంటే చాలదు. చాలా చాలా మంచి వ్యాసాలవి. వాటిలో కొన్ని బొంబాయి ఆంధ్రపత్రికలోనూ, కొన్ని రాజమండ్రి ఆంధ్రకేసరిలోనూ ప్రకటన అయినాయి. వాటిలో 'ఇద్దరు రాజులు' అనేది యిప్పటికీ నాకళ్ళ యెదుట కనబడుతోంది. రెండోది ఆకాశ రామన్న ఉత్తరానికి ప్రత్యుత్తరం కూడా గొప్పదే. ఆ వుత్తరం పెద్దాపురం నుంచి వచ్చినట్లు తమ ప్రత్యుత్తరంలో అప్పారావుగారే ఉటంకించారు. రాసిన వారెవరో వారు చెప్పలేదు; గాని గుర్తించినట్లే కనపడుతుంది. నాకు మాత్రం ఆ రాసిన వారెవరో బాగా తెలుసు. రాసినవారే నాకు చెప్పారు. అయితే, అది రాయడానిక్కారణం వారికి గ్రాంధిక భాషమీది అభిమానమేగాని పాపం అప్పారావుగారి మీది ద్వేషం కాదు.

అప్పారావుగారి రచనల్లో మిక్కిలి చెప్పుకోదగ్గవి **నాటకాలు**. వాటిలో **కన్యాశుల్కం** జాతి రత్నం. బిల్హణీయం పూర్తి అయివుంటే అది అంతకంటే పెద్ద జాతిరత్నం అయివుండేది; కాని ఆంధ్రజాతికి, అలనాటి నాటకం చూసుకునే అదృష్టం పట్టలేదు. కన్యాశుల్కంలో ప్రతీవాక్యానికీ కొన్నేసి పేజీల వ్యాఖ్యానం చెయ్యగలమనీషిని నే నెరుగుదును. వారు **శ్రీ భమిటిపాటి కామేశ్వరరావుగారు**. కన్యాశుల్కం తలంపుకి వస్తే–అథవా–ఆపేరు చెవిని పడితే వారి శరీరం ఆపాదమస్తకమూ పులకరిస్తుంది. అస్మదాదులం 'కన్యాశుల్కం బాగా తెలుసు' అనుకుంటాం గాని, కామేశ్వరరావుగారు దాని మీద ప్రసంగం యెత్తుకుంటే, 'తెలియనివాడనై మెలిగితిన్' అనుకోవలసిందే. నేను వరుసగా రెండేళ్ళూ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికల్లో బిల్హణీయం రెండంకాలు చదివిన తరవాతే కన్యాశుల్కం చదవడం ప్రారంభించాను. అయితే కన్యాశుల్కం చదివినప్పుడల్లా ఎంత ఆనందం కలుగుతుందో ఆ అసంపూర్ణ బిల్హణీయం జ్ఞాపకం వచ్చి వెంటనే నాకంత దుఃఖం కలుగుతూ వుంటుంది. ఒక్క బిల్హణీయం చాలు, అప్పారావుగారెంతటి మహాకవో తెలుసుకోవాలంటే. అయితే, వారెంతటి మహాకవి అంటే, ఆ బిల్హణీయం మరెవరూ పూర్తిచేయలేనంతటి –దాని కథాక్రమమే యెవరూ గుర్తించలేనంతటి–మహాకవి.

ఏతావాతా: అప్పారావుగారు మహాకవి మాత్రమే కాదు, తరువాత రచయితల కందరికీ మార్గదర్శిన్నీ!

అయితే ఒక్క సత్యం చెప్పక తప్పదు. అదేమిటంటే, వచన రచయితలు మాత్రమే అప్పారావుగారి మార్గదర్శికత్వం స్వీకరించారు. పద్య రచయితలు ఆ దారి పట్టుకోలేకపోయారు.

*('ఇరువురము ఒకచోటికే పోదము' అంటూ సాహిత్య సృష్టి ప్రారంభించిన శ్రీపాద, గురజాడ వారి ప్రభావంతోనే చక్కటి, చిక్కటి తెలుగు రచనలు చేసారు. వచ్చే సంచికలో శ్రీపాద మీద గిడుగు ప్రభావమెంత ఉందో ఆయన 'గిడుగుతో 36 గంటలు' వ్యాసంలో తెలుసుకుందాం).*

# తెలంగాణా తెలుగు భాషాభివృద్ధి జరగాలి




తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా 5వ మహాసభల్లో ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి ఆచార్య రవ్వా శ్రీహరి




ఆచార్య జయధీర్ తిరుమలరావు రచించిన "భాషావరణం" వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న భాషావేత్త శ్రీనలిమెల భాస్కర్

**నూ**తన తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా మాతృభాషైన తెలుగును అధికార భాషగా అమలు చేయాలని, ముఖ్యంగా పరిపాలన, బోధనా-విద్యా రంగాలలో పక్కాగా అమలు చేయాలని, తెలుగు భాషాభివృద్ధికి సమగ్రమైన చర్యలు చేబట్టాలని కరీంనగర్‌లో సెప్టెంబర్ 10 కాళోజీ జయంతి సందర్భంగా జరిగిన తెలుగు-తెలంగాణాభాషా మాండలికభాషా దినోత్సవం రోజున జరిగిన ఐదవ తెలంగాణా రచయితల వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహా సభలు రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరాయి. ఈమేరకు మహాసభలు పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించాయి. పాలనా బోధనా రంగాలలో పెరిగిపోయిన ఆంగ్లభాషా పెత్తనాన్ని, రాజ్యం పోకడల్ని ఈసభలు నిర్మొహమాటంగా ప్రశ్నించాయి. తెలుగు అమలుకు చిత్త శుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరాయి. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సుమారు పదిగంటల పాటు జరిగిన ఈ సభల్లో వివిధాంశాలపై తెలంగాణాలో తెలుగు భాష అమలు-తీరుతెన్నులపై లక్ష్యాత్మకంగా, సాధికారిక చర్చలు జరిగాయి. పలు పుస్తకావిష్కరణలు జరిగాయి. తెలంగాణాలో తెలుగు భాషావికాసానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాధికార సంస్థను నిపుణులతో ఏర్పాటు చేయాలని, తెలుగును తెలంగాణ భాషగా తీర్చి దిద్దాలని, పాలనాభాషగా, బోధనా భాషగా, పాఠ్యపుస్తకాల భాషగా అభివృద్ధిపరచాలని సభలు కోరాయి. న్యాయస్థానాలలో తీర్పులు తెలుగు లోనే ఇవ్వాలని, తెలంగాణాలోని అన్ని జిల్లాల నుండి వాడుక పదాలు సేకరించి, పదకోశ నిర్మాణాలు చేబట్టాలని, ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని పునర్ముద్రించాలని, తెలంగాణ తెలుగు భాషా వ్యాప్తికి ప్రభుత్వ పరంగా చిత్తశుద్ధితో అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణానాట వున్న చారిత్రక కట్టడాలను అభివృద్ధి చేసి, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఈ సభలు కోరాయి. తెలంగాణా పేరిణీ శివతాండవాన్ని శాస్త్రీయ నృత్యంగా గుర్తించాలని, జానపద సాహిత్యాలను అభివృద్ధి పరచాలని, తెలంగాణా భాషాసాంస్కృతిక వారసత్వాన్ని భావితరాల వారికి అందించాలని, కరీంనగర్ కలెక్టరేట్‌లో తెలుగుకు ప్రాచీన హోదా దక్కడానికి ముఖ్యకారణమైన కుడిక్యాల బొమ్మలమ్మ గుట్ట త్రిభాషా శాసన నమూనాను ఏర్పాటు చేయాలని సభలు తీర్మానించాయి.

రాష్ట్ర తెలంగాణా రచయితల వేదిక అధ్యక్షుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు, భాషావేత్త ఆచార్య రవ్వా శ్రీహరి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ నలిమెల భాస్కర్, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు, కార్యదర్శి డా॥వెన్నిసెట్టి సింగారావు, తెరవే జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు కె. ఆనందాచారి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకుడు డా॥బానాల భుజంగరెడ్డి, శాతవాహన సహాయ ఆచార్యులు డా॥కె.ముత్యం, కథారచయిత పెద్దింటి అశోక్‌కుమార్, తెరవే రాష్ట్ర కార్యదర్శి గాజోజు నాగభూషణం, సాహితీ వేత్తలు డా॥ఎకె.ప్రభాకర్, డా॥యాకూబ్, డా॥ గూడూరి మనోజ, డా॥బూర్ల వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొని, తెలుగు భాషాభివృద్ధికై తీసుకోవాల్సిన చర్యల గూర్చి చర్చించారు. సీనియర్ జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్యకు నిరసన తెలిపి, ఆమెకు సభలో నివాళి అర్పించారు.

ప్రెస్‌భవన్ ప్రాంగణంలో జరిగిన ఈసభల్ని ఆచార్య రవ్వా శ్రీహరి తెరవే జెండాను ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభిం చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండే కాక, తెలంగాణాలోని వివిధ జిల్లాల నుండి రెండు వందల మంది సాహితీవేత్తలు ఈసభల్లో పాల్గొన్నారు. ప్రజాకవి కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం సభలు మొదల య్యాయి. ప్రారంభసభకు జిల్లా శాఖ అధ్యక్షుడు కూకట్ల తిరుపతి సభాధ్యక్షత వహించి, సభ లక్ష్యాలను, ఆశయాలను వివరించారు. జిల్లా తెరవే కార్యదర్శి సివి.కుమార్ మహాసభల నివేదికను సమర్పించారు.

ఆచార్య రవ్వా శ్రీహరి కీలకోపన్యాసం గావిస్తు, తెలంగాణా ప్రభుత్వంలో తెలంగాణా తెలుగు భాషాభివృద్ధికి ఏం చర్యలు తీసు కుంటున్నారో తెలవడం లేదని అన్నారు. తెలంగాణా యాసలో మాట్లాడే మన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణాలో తెలుగు భాషాభివృద్ధి విషయంలో ముందుకురావాలని అన్నారు. తెలంగాణాలో జిల్లాల వారీగా వాడుక పదాల సేకరణ జరిగి, బృహన్నిఘంటువు నిర్మాణం చేయాలని కోరారు. వివిధ ప్రాంతాలలో మాట్లాడే వాడుక భాష నుండి తెలంగాణా ప్రామాణిక భాషను రూపొందించుకోవాలని అన్నారు. అన్ని ప్రాంతాల నిఘంటువులు అచ్చులోకి రావాలని అన్నారు. కేవలం నిఘంటు నిర్మాణాల వల్ల భాష అభివృద్ధి చెందదని స్థిరమైన ప్రాతి




# భాషావరణం

**'నడుస్తున్న చరిత్ర'**లో ప్రచురించబడిన భాషావిషయక వ్యాసాల సంపుటి.
రచన: జయధీర్ తిరుమలరావు.
పుటలు: 300, వెల : రు.200/- ; ప్రతులకు : సాహితీ సర్కిల్, 402, ఘరోండా అపార్ట్‌మెంట్లు, ఉస్మానియా యూనివర్శిటీ మెయిన్‌గేటు దగ్గర, 1వ సందు, డి.డి.కాలనీ, హైదరాబాదు-7. ఫోన్: 9951942242.

పదికగా అభివృద్ధిచేయాలని అన్నారు. వివిధ భాషల పదాలను కలుపుకొని మన తెలుగు భాషను సుసంపన్నం చేసుకోవాలని, పారి భాషిక పదాలను తయారుచేసుకో వాలనిఅన్నారు. రేడియోల్లో టీవీల్లో పత్రికల్లో ప్రామాణిక భాషాపదాల వినియోగం జరిగినపుడే భాషా భివృద్ధికి కృషి జరుగుతుందని అన్నారు. తెలంగాణాలో తెలుగును అధికార భాషగా బోధనాభాషగా తీర్చిదిద్దాలని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణా భాషాసంస్కృతుల మేళవింపు వుండాలని సూచించారు. అసలు పుస్తక పఠనం, పదకోశాల పరిశీలన పెంపొందిన నాడే భాష స్పృహ పెరిగి, పరిపుష్టి అవుతుందని అన్నారు. ప్రాచీనులైన అన్నమయ్య, పోతన్న లాంటి కవులు తమ ప్రాంతీయ నుడికారంలోనే కావ్యాలు రాశారని అన్నారు. అందులో తెలంగాణాలోవాడే తెలుగు వ్యవహారిక పదాలున్నాయని, ఆ పదాల వాడకం పెరగాలని అన్నారు. సైన్‌బోర్డులు తెలుగులోరాయించాలని అన్నారు. ఆంగ్లభాషా వ్యామోహం కూడదని, జపాన్, జర్మనీ లాంటి దేశాల్లో ఆంగ్లం వాడకుండా, అభివృద్ధి జరగడం లేదాయని ఆయన ప్రశ్నించారు.

తెలుగు భాషోద్యమసమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని, తెలంగాణ నిజాంనుండి విముక్తమయ్యాక, భాషా ఉద్వేగంతోనే రెండూకలిసి ఉమ్మడిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు. తదుపరి ఈరాష్ట్రంలో తెలుగులో విద్యాబోధన, అధికార భాష వినియోగాలలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. రాజ్యం పోకడలు, రాజకీయనాయకుల స్వార్థాలున్నాయని అన్నారు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రోద్యమానికి తమ తెలుగు భాషోద్యమ సమాఖ్య మద్దతు ఇచ్చిందని అన్నారు. పొరుగు రాష్ట్రాలలో లాగా తెలంగాణాలో తెలుగు అభివృద్ధి చెందాలంటే తెలుగుప్రాధికార సంస్థ ఏర్పాటు జరగాలన్నారు. వాడుక భాషలోనే పాఠ్యప్రణాళికలు రూపొందించాలని, అచ్చతెలుగు పదాల వాడకం పెంచాలని సూచిం చారు. తెలంగాణాలో తెలుగు భాషోద్యమ వ్యాప్తికి తమ సంస్థ సహకారం వుంటుందని, త్వరలో సమావేశాలు, సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి డా॥ వెన్నిసెట్టి సింగారావు మాట్లాడుతూ తెలంగాణాయాసలో వచ్చిన ఫిదా తెలుగు చిత్రం సాధించిన విజయాన్ని ప్రస్తావించి, తెలంగాణాలో తెలుగు భాషోద్యమం బలపడాలని ఆకాంక్షిం చారు. తెలంగాణ సాహితి అధ్యక్షుడు కె. ఆనందాచారి, అఖిల భారత తెరవే అధ్యక్షులు జూకంటి జగన్నాథం, డా॥ నలిమెల భాస్కర్‌లు మాట్లాడుతూ, తెలంగాణాలో భాషాసంస్కృతుల కోసం పోరాటం చేయాల్సి వుందని అన్నారు. తెలంగాణా భాష, యాసలోనే రచనలు రావాలని, ప్రశ్నించే తత్వం రావాలని అన్నారు. డా॥గూడూరి మనోజ మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజన గోండు వంటి భాషల అభివృద్ధి, అధ్యయనం జరగాలని అన్నారు. డా॥యాకూబ్ మాట్లాడుతూ, ఇవ్వాళ తెలంగాణా యాసలో భాషలో మాట్లాడి రాసే రచయితల సంఖ్య పెరగడానికి తెరాస ఉద్యమ చైతన్యమేనని అన్నారు.

తెరవేరాష్ట్ర అధ్యక్షులు ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లా డుతూ, ఇవ్వాళ తెలంగాణాలో కవులు, రచయితలు తెలంగాణా వాదులు తెలుగు భాష అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారని, కాళోజీ జయంతి స్ఫూర్తిగా తెలంగాణాలో మన భాషలు, యాసలు ఎందుకు పరిఢవిల్లడం లేదన్న ఆవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణా, తెలుగు తల్లులు వేరైనా, మన భాష ఎటుపోతున్నది, బోధన, పాలనా రంగాలలో ఎందుకు అమలు కాకుండా పోతున్నదని ప్రశ్నించారు. తెలంగాణా భాష అమలుకై భాషావాదులు, ఉపాధ్యాయులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అధికార భాషాసంఘం అలంకారప్రాయమైపోయిందని, 5వందల రెసిడెన్షియల్ పాఠశాలలు ఆంగ్ల మాధ్యమంలోనే నడుస్తున్నాయని అన్నారు. సిఎం పేషీల్లో ప్రభుత్వ జీవోల్లో తెలుగు ఉత్తర్వులు ఎక్కడున్నా యని ప్రశ్నించారు. తెలుగు వర్ణమాలను కుదించాలని, లిపిలో మార్పులు చేయాలని, స్వతంత్ర ప్రతిపత్తికల భాషాసాంస్కృతిక మండలులు ఏర్పాటు కావాలని అన్నారు. తెలుగు సాఫ్ట్‌వేర్‌లలో తెలంగాణా పదాల వినియోగం జరగాలని, ఇవ్వాళ పౌరసమాజం సజీవమైన తెలంగాణా భాషని కోరుతోందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో జరిగిన తెలుగు ప్రపంచ మహాసభల్లో వలసపాలకులు వారి ఆధిపత్యాన్ని, భాషా సంస్కృతులను మనపై రుద్దారని అన్నారు. ప్రజారాజకీయాలు తెలంగాణా భాషని దూరం చేయరాదని, త్వరలో జరిగే తెలంగాణా ప్రపంచ మహాసభలపై ఒక విధి విధాన పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కవులు, రచయితలు ద్వంద్వంగా వ్యవహరించక, పాలనాభాషగా తెలుగు అమలుకై ఉద్యమించాలని, ఈ కోవలో చైతన్యపరచేలా తగినన్ని రచనలు చేయాలని పిలుపు నిచ్చారు. తదుపరి జరిగిన సమావేశాల్లో తెలంగాణా భాష విశిష్టత, తెలంగాణాభాష సాంకేతికత ఆధునికతలు, భాషాభివృద్ధి తదితర అంశాలపై చర్చలు జరిగాయి. కవులు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, డా॥బండి చంద్రశేఖర్, గులాబీల వుల్లారెడ్డి, యాకూబ్, ముత్యం, డా॥బానాల భుజంగరెడ్డి, రామానుజం సుజాత తదితరులు పాల్గొన్నారు. ముగింపుసమావేశానికి అధ్యక్షత వహించిన తెరవే ప్రధాన కార్యదర్శి గాజోజు నాగభూషణం మాట్లాడుతూ, వ్యూహాత్మకంగా జరుగుతున్న ఈసభల్లోని తీర్మానాలను చదివి వినిపించారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు రాసిన భాషావరణం, సినారే స్మారక ఎన్నీల ముచ్చట్లు, శ్రీ దాస్యం లక్ష్మయ్య రాసిన రెండు పుస్తకాలను మహాసభల్లో ఆచార్య రవ్వా శ్రీహరి, డా॥నలిమెల భాస్కర్, జయధీర్ తిరుమలరావు తదితరులు ఆవిష్కరించారు.

**-సంకేపల్లి నాగేంద్రశర్మ.**

భాషోద్యమ
కథానిక

–డా|| కె.జి.వేణు
9848070084

# నాన్నా! నన్నిలా పెంచండి

> "నాన్న... దయచేసి నన్నిలా పెంచండి.
> అమ్మ ఎన్ని ఉద్యోగాలు చేసినా
> అమ్మతనం ఉద్యోగానికి మాత్రం
> రాజీనామా చేయ్యొద్దని చెప్పండి.
> పుట్టీ పుట్టగానే నన్నో ఇంజనీరో
> డాక్టరో చేయాలనే తలంపుతో
> తడి ఆరని నా పసితనాన్ని
> కర్కశంగా లాక్కెళ్లి
> కాన్వెంట్ శిలువ నెక్కించకండి."

**పెద్ద** కప్పు చేత్తో పట్టుకొని పరిగెత్తుకుంటూ ఇంట్లోకి వచ్చాడు యశ్వంత్.

"అమ్మా... నాన్న... రండి తొందరగా రండి" అంటూ కేకలేసి పిలిచాడు....లోపల్నుంచి ఇద్దరూ వచ్చారు.

"నాకు పద్యాల పోటీలో ఫస్టు ప్రైజు వచ్చింది నాన్న ఇదిగో చూడండి" అంటూ తండ్రికి కప్పు అందించాడు.

"ఇంతకీ ఏ పద్యాల పోటీలో ఈ ప్రైజ్ వచ్చింది ఇంగ్లీషు పద్యాల పోటీలోనే కదా?" తండ్రి అడిగాడు..

"ప్రైజు వచ్చింది ఇంగ్లీషు పద్యాలలో కాదు నాన్న... తెలుగు పద్యాల పోటీలో ఈ ప్రైజు వచ్చింది." తండ్రి ప్రశ్నకు భయపడుతూనే సమాధానమిచ్చాడు యశ్వంత్.

ఆ మాటకు తల్లి ఎంతో ఆనందపడిపోయింది.

"ఏ పద్యం పాడావురా...ఏదీ ఒకసారి ఆ పద్యం పాడు" అడిగింది తల్లి. అంతే. వెంటనే పోతనామాత్యుడి భాగవతంలోని పద్యం అద్భుతంగా పాడి వినిపించాడు.

'ఆపు' గట్టిగా అరిచాడు శివనారాయణ. ఆ అరుపుకు బెదిరి పోయాడు యశ్వంత్. "నీకెన్నిసార్లు చెప్పానురా..తెలుగు జోలికి వెళ్లవద్దని...నిన్ను విదేశాల్లో చదివించాలనుకుంటున్నాను. నీకు ఇంగ్లీషు బాగా రావాలి. ఇంగ్లీషులో ప్రావీణ్యముంటే తప్ప భవిష్యత్తులో నువ్ రాణించలేవురా..నీ మీద మేము చాలా..చాలా ఆశలు పెట్టుకున్నాం.. నువ్ పెద్ద ఇంజనీరువి కావాలని, విదేశాలకు వెళ్లాలని, గొప్ప..గొప్ప ఉద్యోగాలు చేయాలని.. ఎన్ని కలలు కంటున్నాంరా.. నువ్వేమో తెలుగు తెలుగు అంటూ ఆ తెగుల్ని పట్టుకొని ఏడుస్తున్నావ్" పూనకం వచ్చిన వాడిలా ఊగిపోయాడు తండ్రి.

"అది కాదు నాన్న.." ఏదో చెప్ప బోయాడు యశ్వంత్. మరింత కోపం ఎక్కువయింది శివనారాయణకు.

"ఆ అమ్మ..నాన్న.. ఏమిట్రా.. మమ్మీ.. డాడీ .. అని పిలవలేవా." గుడ్లు ఉరుముతూ చూశాడు కొడుకు వంక.

"అమ్మ..నాన్న పదాలు బూతు పదాలు కాదు కదా నాన్న" యశ్వంత్ అతి వినయంగా చెప్పాడు. ఊహించని కొడుకు సమాధానానికి మరింత రెచ్చిపోయాడు శివనారాయణ.

"నోర్మూయ్..మరోసారి తెలుగు గురించి మాట్లాడితే చంపేస్తాను" అంటూ లోపలికి వెళ్లి పోయాడు.

తల్లి చేతుల్ని తనచేతుల్లోకి తీసుకొని. "అమ్మా.. కుక్కలు.. కోతులు.. పిల్లులు..బల్లులు.. సమస్త జీవులన్నీ వాటి సొంత భాషలోనే మాట్లాడుకుంటాయి కదా..మరి మనం మన మాతృభాషలో మాట్లాడు కుంటే తప్పేమిటమ్మా" అమాయకంగా అడిగాడు యశ్వంత్.

కొడుకు కళ్లల్లోకి చూస్తూ "ఈ ఇంట్లో మీ అమ్మ మాటకు ఎంత విలువుందో. ఈ రాష్ట్రంలో అమ్మభాషకు అంతే విలువుంది



నాయనా.. నువ్ మాత్రం తెలుగు పద్యాలు పాడినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. తెలుగు భాషను సరిగ్గా మాట్లాడగలిగితే ప్రపంచంలో ఏ భాషనయినా అతి తేలిగ్గా మాట్లాడేయవచ్చు. నువ్ తెలుగును బాగా నేర్చుకో. అదీ మీ నాన్నకు తెలియకుండా..” అంటూ కొడుకును దగ్గరగా తీసుకుంది.

❖ ❖ ❖

చాలా సేపట్నుంచి పనిపిల్ల లక్ష్మిని బెల్టు తీసుకొని కొడుతూనే ఉన్నాడు శివనారాయణ. ఆ పిల్ల గోడు గోడున ఏడుస్తూ కేకలు పెడుతూ ఉంది.. అడ్డుపడుతున్న రమాపద్మను కసిరేసి లోపలికి వెళ్లిపొమ్మన్నాడు.

“చెప్పు... ఇంట్లో తీసిన అయిదు వేలు ఎక్కడ పెట్టావో చెప్పు” అంటూ మళ్లీ కొట్టాడు.. లక్ష్మి గట్టిగా ఏడ్వటం మొదలు పెట్టింది.

“ముందు ఆ వెధవ ఏడుపు ఆపుతావా లేదా..” సహనం కోల్పోతున్నాడు శివనారాయణ.

“బాబు నేనా దొంగతనం చేయలేదు బాబు.. పెమాణపూర్తిగా చెబుతున్నాను.. ఆ డబ్బు సంగతి నాకు తెలవదు బాబు. నాను దొంగను కాదు బాబు.” కాళ్లు పట్టుకొని బ్రతిమాలింది.

“నువ్ ఇలా చెప్పవే.. నిన్ను పోలీసులకు పట్టిస్తే కానీ డబ్బులు సంగతి చెప్పవ్. యశ్వంత్ బర్త్‌డే కోసమని ఆ అయిదు వేలు బీరువాలో ఉంచాను..ఎవ్వరూలేంది చూసి ఆ డబ్బు తీశావ్.” జుట్టు పట్టుకొని పైకి లేపాడు.

రెండు చేతులతో దండం పెడుతూ “నిజంగా చెబుతున్నాను బాబు. నేనా డబ్బు తీయలేదు బాబు. బ్రతిమాలింది.. కోపం తారాస్థాయికి చేరిపోయింది శివనారాయణకు...గొడ్డును బాదినట్లు బాదటం మొదలు పెట్టాడు. ఇంతలో పుస్తకాల బ్యాగుతో ఇంట్లో కొచ్చాడు యశ్వంత్.

“నాన్న లక్ష్మిని ఎందుకలా కొడుతున్నారు” అడిగాడు. విషయం చెప్పాడు శివనారాయణ. వీపున ఉన్న పుస్తకాల బ్యాగును కిందికి దింపి తలవంచుకొని నిలబడ్డాడు యశ్వంత్. తల్లికూడా హాల్లోకి వచ్చింది.

“బీరువాలో పెట్టిన డబ్బు నేనే తీశాన్నాన్న” నిజం చెప్పాడు యశ్వంత్. నమ్మలేక పోయింది రమాపద్మ. శివనారాయణ అగ్గిమీద గుగ్గిలమై పోయాడు.

“నువ్ చెబుత్నుది నిజమేనా” దగ్గరికొచ్చి భుజాలు పట్టుకొని అడిగాడు.

“నిజమే నాన్న” భయంతో వణకి పోయాడు యశ్వంత్. బలంగా చాచి లెంపకాయ కొట్టాడు శివనారాయణ. గిర్రున తిరిగి క్రింద పడిపోయాడు యశ్వంత్. కొడుకును చూసి తల్లడిల్లి పోయింది రమాపద్మ. క్రింద పడ్డ వాడ్ని పైకిలేపి మళ్లీ కొట్టటం ప్రారంభించాడు శివనారాయణ. కోపంతో ఊగిపోతున్నాడు.

“మా కడుపున చెడ పుట్టావ్ కదరా. ఎందుకురా ఈ బ్రతుకు. నువ్ చచ్చినా ఫరవాలేదు.. దొంగగా మాత్రం నువ్ బ్రతక్కూడదు చావ్ చావ్.’ అంటూ వీపుమీద పిడిగుద్దులు గుద్దేశాడు.

తల్లి తట్టుకోలేక పోయింది.“ఏమండి..వాడు చచ్చిపోతాడండి” ఏడుస్తూ గట్టిగా అరిచింది.

“చావనీ వాడ్ని గురించి ఎన్ని కలలు కన్నామే.. వాడ్ని ఎంత గొప్ప వాడ్ని చేయాలనుకున్నాం... చివరకు దొంగగా మారిపోతాడా... ఇక వీడు జీవితంలో ఏం బాగుపడతాడే.. మనమేం పాపం చేశామే.. ఇలాంటోడు మన కడుపున పుట్టాడు..” తలబాదుకొన్నాడు శివ నారాయణ.

కొడుకును దగ్గరగా తీసుకుంది రమాపద్మ..“నాన్న నిజంగానే ఆ డబ్బును నువ్ తీశావా..” నమ్మలేక తిరిగి అడిగింది రమాపద్మ.

తల్లి కళ్లల్లోకి చూస్తూ.. “నిజమేనమ్మా. ఆ డబ్బు నేనే తీశాను” అన్నాడు.

శివనారాయణ ఉగ్రుడై పోయాడు.“చూశావా డబ్బు తీశానని వాడు ఎంత దర్జాగా చెబుతున్నాడో..” భార్య వైపు కోపంగా చూశాడు.

‘మీరాగండి’ అంటూ కొడుకు బుగ్గలమీద కారుతున్న కన్నీటిని తుడుస్తూ “ఆ డబ్బు ఏం చేశావ్ నాన్న..” అనునయిస్తూ అడిగింది. భయం లేదు..చెప్పు..” నవ్వుతూనే అడిగింది తల్లి.

అమ్మ నవ్వుతో ఇపుడు యశ్వంత్‌లో భయం లేదు. అమ్మ చేతులు గట్టిగా పట్టుకున్నాడు.. చెప్పటం ప్రారంభించాడు.

“మరేం లేదమ్మ..ఒకరోజు స్కూలునుంచి వస్తూ ఉంటే మధ్యలో మా బస్సు ఆగిపోయింది. బస్సు రిపేరు చేస్తూ ఉంటే పిల్లలందరం క్రిందికి దిగాం. ఆ ప్రక్కనే అనాథ శరణాలయం ఉంది. అనాథలు ఎలా ఉంటారో చూడాలని లోనికెళ్లానమ్మా.. అందరూ చిన్నచిన్న పిల్లలు.. ఇంతింత ఉన్నారమ్మా.. వాళ్ల ఒంటిమీద బట్టలు కూడా సరిగా లేవు.. అన్నీ చినిగి పోయిన బట్టలే..చలికి గజగజా వణకి పోతున్నారమ్మా..నాకు చాలా జాలేసిందమ్మా..వాళ్లను చూసి ఏడు పొచ్చిందమ్మా. ఇంటికొచ్చాక కూడా వాళ్లే గుర్తుకొచ్చారమ్మా.. మనమేమో హాయిగా దుప్పట్లు కప్పుకొని వెచ్చగా నిద్రపోతున్నాం.. మరి వాళ్లు ఎలా నిద్రపోతారు. రాత్రుళ్ళు పడుకుంటే ఇవే ఆలోచన్లు నన్ను బాధ పెట్టేవి. ఒకరోజు బీరువా తాళం వేయకుండా నాన్నగారు వెళ్లిపోయారు. దొంగతనం చేయటం తప్పని నాకు తెలుసమ్మా.. తెలిస్తే నాన్నగారు కోప్పడతారని కూడా తెలుసు.. అయినా చలిలో వణికి పోతున్న ఆ చిన్నపిల్లల మొహాలే నా కళ్లముందు కనిపించా యమ్మా.. ఆ పిల్లలు చేతులు చాచి నన్ను ఏదో అర్థించినట్లుగా ఉండేది.. అందుకే ఆ డబ్బు తీశాను..మా మాస్టారుగారి సహాయంతో ఆ పిల్లలకు దుప్పట్లు కొని ఇచ్చానమ్మా.. ఇపుడు వాళ్లు హాయిగా పడుకుంటున్నారు.. ఆనందంగా నిద్రపోతున్నారు.. మరుసటి రోజు అక్కడికి వెళ్లాను. . వాళ్లంతా నన్ను చూసి చప్పట్లు కొడుతూ దండం పెట్టారమ్మా..ఇవన్నీ నాన్నకు చెపితే ఒప్పుకోరని ఇంట్లో చెప్పలే దమ్మా...నన్ను క్షమించండమ్మా.” కన్నీళ్లు పెట్టుకొని తల్లి పాదాలు పట్టుకున్నాడు యశ్వంత్.

ఇల్లంతా నిశ్శబ్దంగా మారింది.యశ్వంత్‌ని పైకిలేపి గుండెలకు హత్తుకుంది రమాపద్మ.

“నాన్న నిన్ను చూసి ఆ పేదపిల్లలు దండం పెట్టటం కాదు.. ఇపుడు నేను నీకు దండం పెడుతున్నా(రా..” అంటూ చేతులు జోడించింది.

“అమ్మా” అంటూ చేతులు పట్టుకున్నాడు.

“నేను దండం పెడుతున్నది, నీకు.. నీ వయసుకు కాదు నీ గొప్ప మనసుకు..నీ గొప్ప ఆలోచనకు.. అనాథలను చూసి కరిగి పోయిన నీ హృదయ సంస్కారానికి దండం పెడుతున్నాను.” అంటూ..

"నాన్న! ఇంత గొప్ప ఆలోచన నీకెలా వచ్చిందిరా..." ఆశ్చర్యంగా అడిగింది.

"ఏమండీ మనవాడు చాలా గొప్ప మనసున్న వాడండీ." అంటూ భర్త దగ్గరికి వెళ్లింది.

శివనారాయణ తల వంచుకొని నిలబడ్డాడు. "ఇన్నాళ్లు మన బాబును మనం మామూలుగా చూసే వాళ్లం. ఇప్పుడు వాడ్ని చూడాలంటే.. ఆకాశం వైపు చూడాలండి." అంటూ పైకి చూపించింది.

యశ్వంత్‌ని దగ్గరికి రమ్మని రెండు చేతులు చాచి పిలిచాడు శివనారాయణ. తండ్రి అంత ప్రేమగా ఎపుడూ తనని చూడలేదు. పరిగెత్తుకుంటూ వచ్చి తండ్రి దగ్గర వాలిపోయాడు. ఒక్కసారిగా కొడుకును కౌగలించుకున్నాడు.

"ఇంత గొప్ప ఆలోచన నీకు ఎలా వచ్చిందిరా..." అంటూ అడిగాడు తండ్రి.

కళ్లు పెద్దవి చేసి... "నాకు తెలుగు అంటే చాలా ఇష్టం నాన్న. తెలుగు నేర్చుకుంటే భాషే కాదు, భావం కూడా వృద్ధి చెందుతుంది. తెలుగులో అద్భుతమైన నీతి శాస్త్రాలు వున్నాయి, బుద్ధి వికాసానికి ఎన్నెన్నో నీతి కథలు వున్నాయి. మీకు తెలియకుండా వేమన శతకం, సుమతీ శతకం అవన్నీ నేను మన ప్రక్కింటి తాతగారి దగ్గర నేర్చుకున్నాను. వాటి ఫలితమే కష్టాల్లో వున్నవారికి సహాయం చేయాలన్న ఆలోచన కలిగింది. అందుకే తెలుగు తల్లికి నేనెప్పుడూ రుణపడి వుంటాను. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి మానసిక వికాసానికి తెలుగులో వున్నన్ని గొప్ప గ్రంథాలు మరి ఏ ఇతర భాషల్లోనూ లేవంటారు నాన్న" అని చెప్పగానే కొడుకును ముద్దులతో మంచెత్తింది తల్లి. కొడుకు మాట్లాడుతూ ఉంటే ఎవరో వేదపండితుడు పారాయణం చేసినట్లుగా ఉంది శివనారాయణకు.

" నాన్న నామీద కోపం పోయిందా..?" కళ్లల్లోకి ఆశగా చూస్తూ అడిగాడు.

ఏం మాట్లాడలేక పోయాడు శివనారాయణ. మరొక్కసారి కొడుకును కౌగిలించుకున్నాడు.

"నాన్న.. ఈ రోజు మళ్లీ కూడా ప్రైజు వచ్చింది నాన్న.." బ్యాగు తెరిచి వచ్చిన ప్రైజు బయటికి తీశాడు.

"ఎందులో ఈ ప్రైజు వచ్చింది నాన్న.." తల నిమురుతూ తల్లి అడిగింది.

"ఈ మారుకూడా నాకు తెలుగు కవితల పోటీలో ప్రైజు వచ్చిందమ్మా."

"నువ్ తెలుగు కవితలు కూడా రాస్తావా." ఆశ్చర్యంగా అడిగాడు తండ్రి.

"రాస్తాను నాన్న.. ఇదిగో చూడండి.. ప్రైజు వచ్చిన కవిత. అంటూ బ్యాగులోనుంచి కవిత తీసి ఇచ్చాడు. శివనారాయణ చదవటం మొదలు పెట్టాడు. భార్య వచ్చి ప్రక్కన నిలబడింది. 'నాన్న! నన్నిలా పెంచండి ..' కవితా శీర్షిక.. అందులో ఏముందో చదవాలని ఇద్దరి కళ్ళూ వెతికాయ్. చదువుతూ ఉంటే ఒక్కొక్క అక్షరం నేరుగా గుండెను తాకుతోంది.

అపుడే పుట్టిన బిడ్డ తన తండ్రితో మాట్లాడుతున్న సందర్భమది.

"నాన్న... దయచేసి నన్నిలా పెంచండి.
అమ్మ ఎన్ని ఉద్యోగాలు చేసినా
అమ్మతనం ఉద్యోగానికి మాత్రం రాజీనామా చేయ్యొద్దని చెప్పండి.
పుట్టీ పుట్టగానే నన్నో ఇంజనీరో డాక్టరో చేయాలనే తలంపుతో తడి ఆరని నా పసితనాన్ని కర్కశంగా లాక్కెళ్లి కాన్వెంట్ శిలువ నెక్కించకండి.
*మార్కుల ముళ్ళ కిరీటంతో ర్యాంకుల మేకులతో*
*నిత్యం రక్తం కారేలా నా బాల్యాన్ని గాయపరిస్తే..*
*గడ్డకట్టిన నా ఏడుపు. రక్తంతో కలిసి..*
*రాక్షసుడిలా ఈ గడ్డ మీద నన్ను నిలబెడుతుందేమో..*
*నాకు టామ్ అండ్ జెర్రి కథలే కాదు..*
*సుమతీ శతకాలు.. గురజాడ గేయాలు..*
*శ్రీశ్రీ గీతాలు..వేమన పద్యాలు..నేర్పించండి.'*
*పుడితే ఊయాల. పోతే మోయాల.*
*బ్రతికినంత కాలం, దేశానికి ఏదో ఒకటి చేయాల."*
*ఈ భావాన్ని అన్నంతో పాటు..రోజూ నాకు తినిపించండి..*
*కులం.. మతం.. వర్గం.. వర్ణం..*
*ఈ అంటురోగాలకు దూరంగా ఉంచి నన్ను పెంచండి..*
*నన్ను మీ బిడ్డగా కాకుండా..మీ మంచి స్నేహితుడిగా ఎదగనివ్వండి."*

కవిత చదివి శివనారాయణ ఉద్వేగభరితుడయ్యాడు. కళ్లల్లో గిరగిరా నీళ్లు తిరిగాయి. కొడుకును ఎత్తుకొని..

"నువ్ కోరినట్లే నిన్ను పెంచుతాను నాన్న.. నువ్ కోరినట్లే పెంచుతాను.. అన్నిటికంటే ముందు నువ్వు తెలుగే నేర్చుకో.."అంటూ కన్నీళ్లు తుడుచుకొని..."ఒరేయ్ నాన్న..నీ దగ్గర తెలుగు నేర్చుకోవాలని వుందిరా" ముద్దుల వర్షం ముఖం నిండా కురిపించాడు. ఆ క్షణంలో తల్లి ముఖంలో కనిపించిన ఆనందం మల్లెపూల సుగంధమై ఆ ఇల్లంతా పరిమళించింది.

ప్రతిస్పందన

## మిత్రులే గాని, గురుశిష్యులు కాదు...

2017 మే నెల 'అమ్మనుడిలో' లో నేను వ్రాసిన 'సంఘసంస్కరణ రంగంలో స్ఫూర్తిమూర్తిత్రయం' వ్యాసంపై స్పందిస్తూ– 2017 ఆగస్టు అమ్మనుడిలో బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి గురించి పెద్దలు, అనుభవజ్ఞులు బుద్ధవరపు వెంకటరత్నంగారు ఆసక్తికర అంశాలు ఇచ్చినందుకు మప్పిదాలు.

చక్కని అంశాలను ఇచ్చిన ఈ రచనలో ఒక చారిత్రకమైన పొరపాటు దొర్లిందేమోనని భావిస్తున్నాను. నాయుడుగారి బోధనలను స్ఫూర్తిగా గ్రహించి, ఆ లక్ష్యాన్ని తన జీవితంలో అంకిత భావంతో స్వీకరించి, ఆచరించి కృతకృత్యులైన వారిలో నాయుడుగారి శిష్యులు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు అగ్రగణ్యులు. ఈ కర్తవ్య నిర్వహణలో వీరేశలింగం పంతులుగారు గురువునకు మించిన శిష్యులు అని కితాబు నందుకొన్నారు." ఇవి బుద్ధవరపువారి వాక్యాలు. ఈ వాక్యాలవల్ల నాయుడుగారి శిష్యులు వీరేశలింగంగారని స్ఫుటంగా వ్యక్తమవుతోంది. వీరేశలింగంగారు నా గురువుగారు నాయుడుగారని ఎక్కడైనా వ్రాసినా, ప్రకటించినా; లేదా నాయుడుగారు వీరేశలింగం నా శిష్యుడని ఎక్కడైనా వ్రాసినా, ప్రకటించినా మాత్రమే అంశం చరిత్రాంశమవుతుంది. ఎవరు ఎవరికి శిష్యులైనా మంచిదే. చరిత్రకి వాస్తవమే ముఖ్యం. కనుక దీనిపై పెద్దలు బుద్ధవరపువారి వివరణ అవసరం అని భావిస్తున్నాను. ఈ వయస్సులో ఇంకా వ్రాస్తున్న వెంకటరత్నం గారికి వందల వందనాలు.

–సన్నిధానం నరసింహశర్మ




# 6. బౌద్ధ ఆచరణ కూడా శాస్త్రీయమే!

### ఆత్మ , అహం ఒక్కటే

**బౌద్ధం** ప్రధానంగా నైతికశాస్త్రం. అందులోకి భౌతిక దృక్పథాలూ, తాత్త్విక దృక్పథాలూ ఏమైనా కానీండి.... అన్నీ నైతిక పరిధికి లోబడే ఉంటాయి. అందుకే అది పూర్తి వైజ్ఞానిక శాస్త్రంగా కాకుండా సామాజిక శాస్త్రంగా రాణించింది. బౌద్ధాన్ని ఇలా సామాజీకరించింది దానిలోని ప్రధాన తత్త్వమే. బౌద్ధ సిద్ధాంతం మొత్తం "అనాత్మ, అనిత్యం, దుఃఖం" అనే ఈ మూడు కాళ్ళమీదే నిలబడి ఉంటుందని గతంలో చెప్పుకున్నాం.

ఆ అనాత్మవాదమే బౌద్ధాన్ని సామాజిక నైతిక శాస్త్రంగా రూపొందించింది. సమాజంలో ఒక ప్రత్యేక ధార్మిక వ్యవస్థలకి అంకురార్పణ కూడా చేసింది.

ఈ సమాజాన్నీ, ఈ సమాజంలో ఉన్న దుఃఖాన్నీ తనదైన శైలిలో వ్యాఖ్యానించిందీ, గుర్తించిందీ, ప్రబోధించిందీ బుద్ధుడు ఒక్కడే కాదు. ఆద్యుడూ కాదు. ఆయనకు సమకాలీనులు చాలామంది ఉన్నారు.

అయితే, వారంతా 'ఆత్మ' లేదా "అహం" పరిధిలోనే ఉండి పోయారు.

ఆత్మవాదులు– 'దుఃఖాన్ని తొలగించుకోవాలంటే' ఆత్మను శుద్ధి చేసుకోవాలని చెప్తారు. ఆత్మకు ఏలాంటి "పాపాలు" అంటకూడదని చెప్తారు. ఇది చివరికి 'ఏలాంటి "కర్మఫలాలు" అంటకూడదు' అనేదాకా వెళ్ళింది. శంకరుని "నిర్గుణబ్రహ్మ" వాదం ఇదే! వీరందరి దృష్టిలో 'ఆత్మ' వ్యక్తిగతం. ఎవరి ఆత్మ ప్రక్షాళన వారిదే! ఎవడు తన ఆత్మను శుద్ధిచేసుకుంటాడో వాడు సరాసరి నిర్గుణబ్రహ్మను చేరతాడు. కాబట్టి ఆత్మవాదులకి తమ ఆత్మగోడే తమది కానీ, ఇతరుల ఆత్మల గురించిన అవసరంగానీ, అవగాహన కానీ అనవసరం అని భావిస్తారు.

అందుకే వారంతా... ఆత్మశుద్ధికోసం అడవులు బట్టిపోయారు. ఆత్మ నిగ్రహానికి అవరోధాలైన కామక్రోధలోభాలకు దూరంగా, ఇంద్రియాలకు విషయాలు దరిదాపులకురాని , అవి అందుబాటులోకి రాని ప్రదేశాలలో ఉండిపోయారు.

చెడిపోయే అవకాశాలు లేకపోతే అందరూ శుద్ధులే! రొయ్యలబుట్ట లేకపోతే శ్రీవైష్ణవులకు ఎలాంటి వ్రతభంగం అవ్వదు. రొయ్యలబుట్ట ఉన్నప్పుడు అది మాయం కాకుండా వుంటేనే వారు శుద్ధులు! మాయమైతే!–

అలాగే... ఈ తాపసులు కూడా తమకి అవకాశాలు అందనంత వరకూ అగ్రతాపసులే. ఉగ్రతాపసులే. కాంతా కనకాలు, పదవులు అందినప్పుడే కాలుజారతారు. వాటికి దాసులవుతారు. ఇలాంటి కాలుజారిన తాపసుల చరిత్రలు బోలెడన్ని ఉన్నాయి. కాబట్టి 'ఆత్మసంయమనం' కోసం అడవులు పట్టడం అనేది ఆత్మవాదంలోని ప్రధాన విషయం. ఎందుకంటే "ఆత్మ" అనేది ఎవరికి వారికి "వ్యక్తిగతం" కాబట్టి.

అంటే.. "ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిత్వం, వ్యక్తిగతం... అంతా ఆ ఒక్క వ్యక్తికే సంబంధించి ఉంటుంది" అనే ఆలోచననే దీనికి కారణం. ఆ ఆలోచనకి వారు నమ్మే ఆత్మవాదమే మూలం.

అంటే... ఆత్మవాదం అంటే వ్యక్తిగతవాదం అన్నమాట.

ఈ వ్యక్తిగత వాదం, ఎంతగా సమాజంలో ప్రబలి పోయిందంటే... "ఆత్మలేదు" అని చెప్పే అనాత్మవాదుల్లో కూడా ఇది గూడుకట్టుకొని పోయింది. అనాత్మవాదాన్ని, సామాజిక శాస్త్రాల్ని, నాస్తిక భౌతిక దర్శనాల్నీ ప్రవచించిన ప్రవక్తలు కూడా ఈ "వ్యక్తిగతం" పరిధిని దాటి రాలేకపోయారు. ఇప్పటికీ రాలేకపోతున్నారు.

బుద్ధుని కాలానికే ఈ వ్యక్తిగత అంశం వేళ్లూనుకు పోయింది. అది ఇప్పటికీ 'కెరియరిజం' పేరుతో బ్రతుకుతూనే ఉంది. ఈమధ్య వైజ్ఞానిక మేధావులు చెప్పే వ్యక్తిత్వ వికాసవాదం అంతా ఈ ఆత్మవాద, వ్యక్తివాదాల పరిధిల్లోనివే.

బుద్ధుని కాలానికి కూడా వైజ్ఞానిక దృక్పథంతో అలోచించేవారు కూడా ఈ వ్యక్తి వాదం నుండి బైటకు రాలేక పోయారు.

ఆనాటి అసితకేశకంబలిగానీ, ప్రకృథ కాత్యాయనుడు గానీ, చార్వాకుడు గానీ, సంజయవేలట్టి పుత్రుడుగానీ, మక్కల గోసాల గానీ... వీరెవరూ ఈ పరిధిని దాటి రాలేకపోయారు. తమతమ సిద్ధాంతాల్ని అడవుల్లోనో, తమ ఆశ్రమాల్లోనే కూర్చొనే చెప్పారు. వాటికి ఒక వ్యవస్థీకృత రూపాన్ని ఇవ్వలేక పోయారు.

జైనులు కొంత ప్రయత్నం చేసినా అనాత్మవాదులు కాలేక పోయారు.

### ఆ ఇద్దరూ

**ఇక్కడేకాదు.. పాశ్చాత్య దేశాల్లో కూడా సోక్రటీస్ నుండి అరిస్టాటిల్ వరకూ ఆ తర్వాత హెగెల్ వరకూ ఉన్న తాత్త్వికులందరూ 'వ్యక్తిగత' పరిధులు దాటి రాలేక పోయారు. కార్ల్ మార్క్స్ ఒక్కడే తన భావాలని వ్యక్తిగత పరిధినుండి ప్రాపంచిక పరిధికి మార్చాడు– అంటే తన సిద్ధాంతాన్ని సమాజ సిద్ధాంతంగా, సమాజ 'ఉమ్మడి హక్కుగా' మార్చాడు.**

**అసలైన అనాత్మవాది, నిఖార్సయిన భౌతికవాది కాబట్టి అలా**



**చేయగలిగాడు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే "శాస్త్రీయవాది" కాబట్టే చేయగలిగాడు.**

**అయితే– ఈ పనిని రెండు వేల ఐదువందల సంవత్సరాల క్రితమే బుద్ధుడు చేశాడు. అందుకే ప్రపంచంలో పుట్టిన తొలి శాస్త్రీయవాదిగా బుద్ధుణ్ణి కీర్తించేది.**

**బుద్ధుడు అనాత్మవాది. కాబట్టి ఆయనలో వ్యక్తిగతవాదం ఉండదు. అనాత్మవాద భావజాల ప్రభావం ఆయనమీద ఏ కోశానా లేదు.ఇది చాలా అరుదైన విషయం. అద్భుతమైన అంశం.**

మనువాదం వద్దంటూ– మనువాదులుగా బ్రతికేవారు ఎందరో ఉన్నారు. తమలో మనువాదం దాగుందంటే వారు ఒప్పుకోరుకూడా. అలానే కులవాదాన్ని ఒప్పుకోనివారు, కులనిర్మూలన జరగాలనేవారు తెలిసో తెలియకో కులవాదాన్ని మరోప్రక్క పెంచుకుపోతూనే ఉంటారు.

ఇది ఎలాంటిదంటే..

ఊబిలో దిగిన ముసలి ఎద్దు ఎంతగింజుకున్నా ఎలా ఆ ఊబినుండి బైటపడలేదో..అలాగే మనువాద,కులవాద ఊబినుండి చాలామంది బైటపడలేరు.

## ప్రత్యామ్నాయ సాంస్కృతిక నిర్మాత

ఈ భావజాల జాడ్యాలు వదలడం అనేది అంత సులువేం కాదు. ప్రత్యామ్నాయ సాంస్కృతిక నిర్మాతలు మాత్రమే దాన్నుండి పూర్తిగా బైటపడగలరు. అలాంటి వారిలో అగ్రగణ్యుడు బుద్ధుడు.

ఆయన ఏ భావజాలం వద్దనుకున్నాడో దాన్నుండి పూర్తిగా బైట పడ్డాడు. ఆత్మవాదం తప్పనుకున్నాడు కాబట్టి వ్యక్తిగతం(అహం) నుండి బైటపడ్డాడు. అందుకే తన ప్రబోధాల్ని ప్రజాపరం చేయడానికీ, వ్యక్తిగత బంధాలనుండి బైట పడేయడానికి "సంఘాన్ని" నిర్మించాడు. అదే బౌద్ధసంఘం.

ఈ సంఘంలోని సభ్యులు అడవుల్లో ఉండరు. మనుషులకి దూరంగానూ ఉండరు. రొయ్యల బుట్టల దగ్గరే ఉంటారు. దాన్ని మాయం చేయకుండా ఉంటారు– బురదలో ఉండీ, దాన్ని పులుముకోని పద్మంలా ఉండాలనేది బుద్ధుడు తన సంఘ సభ్యులకు చెప్పిన నియమం.

కాబట్టి అవకాశాలకు దూరంగా ఉండే "ఆత్మనిగ్రహం" కాదు కావలసింది, అవకాశాలు అందుబాటులో ఉన్నా వాటికోసం వెంపర్లాడని "మనోనిగ్రహం" కావాలన్నాడు. ఆ దిశగా బౌద్ధసంఘాన్ని నిర్మించాడు.

అడవులు వదిలి తాపసుల్ని జనావాసాలకి మరల్చాడు. అందుకే బుద్ధుడు జ్ఞానాన్ని జ్ఞానంగా కాకుండా దాన్ని ధర్మం అనే దర్పణంలోంచి చూశాడు.

ఆత్మవాదంలోంచే "అహం" అనేది పుడుతుంది."నేను, నాది' అనేది ఆత్మవాద ప్రాథమిక రూపం."నేను నాది" అనుకునే అనాత్మవాదికూడా తనగురించి తను తెలుసుకోలేని ఆత్మవాది! ఊబిలో దిగబడిన ముసలి ఎద్దే.

అసలైన అనాత్మవాదికి "మనం" , "మనది" అనేది ఉంటుంది కాబట్టి అనాత్మవాద దృక్పథంతో "నాయకుడు" "సేవకులు" అనేవారు ఉండరు."గురువులు" "శిష్యులు" అనేవారూ ఉండరు– అందుకే బౌద్ధంలో బౌద్ధసంఘాల్లో నాయకులు ఎవ్వరూ ఉండరు. అనుయాయులు ఉంటారు. 'సహచరులు' మాత్రమే ఉంటారు.

మొత్తం బౌద్ధ సాహిత్యంలో బుద్ధుడు ఏ భిక్షువునీ– "శిష్యా!" అనిగానీ,"నాయనా!"అనిగానీ సంబోధించిన సందర్భం కనిపించదు. "భిక్షూ!" అని మాత్రమే సంబోధిస్తాడు.

భిక్షువులు కూడా "అవుసో" అని పలకరించుకుంటారు. అంటే "సహచరుడా!" అని అర్థం– అంటే బౌద్ధంలో 'పెద్దవారిని గౌరవించడం అనేది లేదు' అనికాదు. గౌరవం గౌరవమే! ఎలాంటి వ్యక్తిగతం (బానిసత్వం)లేని గౌరవం అది.

ఈ "సంఘ నిర్మాణం" అనే ఆలోచనే అద్భుతమైనది. తాను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడం లాంటిది. ఒక సిద్ధాంత ఆచరణని కూడా బుద్ధుడు ఇలా శాస్త్రీయంగా "సంఘం" రూపంలో ఆచరించి చూపించాడు.

బౌద్ధంలో మొదట్లో ద్విరత్నాలే ఉండేవి. ఒకటి బుద్ధం. రెండు ధర్మం.

ఆ తర్వాత, ధర్మచక్ర ప్రవర్తన అనంతరం వచ్చి చేరింది మూడోది. అదే "సంఘం". ఈ మూడింటినీ త్రిరత్నాలంటారు.

ఈ మూడూ శాస్త్రీయ ప్రాతిపదికలే!

## రూల్స్ – రూలర్స్

ఇక్కడ మనం తప్పక ఒక విషయాన్ని చెప్పుకోవాలి.

బుద్ధుడు పరినిర్వాణం పొందే సమయంలో కొందరు బుద్ధుని దగ్గరకు వచ్చి–

"భంతే! మీతర్వాత ఈ సంఘాన్ని నడిపే నాయకులు ఎవరు? మీరే ఉపదేశించండి! వారి వెనుకే నడుస్తాం" అంటారు.

అప్పుడు బుద్ధుడు– "ఈ సంఘానికి నాయకునితో ఎప్పుడూ అవసరం రాదు. లేదు. ఈ సంఘంలోని నియమాలే మీకు మార్గదర్శకాలు. వాటిని ఆచరించుకుంటూ పోవడమే మీ కర్తవ్యం" అని చెప్పాడు.

అంటే... బౌద్ధసంఘంలో "రూల్స్" మాత్రమే ఉన్నాయి. "రూలర్స్" లేరు.

"రూల్స్" అంటే నిబంధనలు– ఇవి సామాజికం.

రూలర్స్ అంటే పాలకులు– ఇది వ్యక్తిగతం.

అందుకే ఆత్మవాద సిద్ధాంతాల్లో ఎవరో ఒక దేవుడో, దేవదూతో, దేవుని ప్రతినిధో, దేవుని బిడ్డడో ఎవరో ఒక "వ్యక్తి" ఉంటాడు.

**కానీ, ఆనాటినుండి ఈనాటివరకూ బౌద్ధం అనేకమార్గాలుగా చీలింది. హీనయానంగా, మహాయానంగా, వజ్రయానంగా– జెన్ బౌద్ధంగా, నవయానంగా...ఇలా ఎన్నిమార్గాలుగా చీలినా "యానాలుగానే" ఉందిగానీ, వ్యక్తిగత పేర్లతో వ్యక్తి నాయకత్వంలో ఈ ప్రపంచంలో ఏ బౌద్ధ సంఘం ఇంతవరకూ లేనేలేదు.**

**వ్యక్తి పేర్లతో బౌద్ధమార్గాలేవీ లేవు. ఇది బౌద్ధంలో– బలమైన అనాత్మవాదానికి...బలమైన సాక్ష్యం.**

**నిక్కచ్చిగా చెప్పుకోవాలంటే... "వ్యక్తిగతాన్ని" బౌద్ధం ఎప్పుడూ తనలోకి రానీలేదు.–**

దాదాపుగా బౌద్ధం లాంటి సామాజిక సిద్ధాంతమే అయినా మార్క్సిజాన్ని అనుసరించే వారిలో వ్యక్తిగతాలు, వ్యక్తిగత సామ్యవాదాలు బలపడ్డాయి. ఆత్మవాద భావజాలాన్నుండి అవి బైటపడలేక పోయాయి. ఆ బలహీనత లెనిన్, స్టాలిన్‌లతో మొదలై మావోతో బలపడింది. ఈ దేశంలో అయితే విప్లవవాద సంస్థలన్నీ వ్యక్తిపేర్లతోనే ప్రాచుర్యంలో ఉన్నాయి!!

అనాత్మవాదమైన మార్క్సిజం ఇలా ఆత్మవాద ఆత్మాశ్రయ ధోరణుల్లో పడిపోయింది.

## జీవితకాల పోరాటం

ఆత్మవాద భావజాలాన్ని జయించడం అంత తేలిక కాదు. అది తనని చంపిన వాళ్ళలో కూడా దూరి వాళ్ళని నాశనం చేయగలదు. ఎందుకంటే అది బైట ఎక్కడో ఉండదు. మనలోని అకుశల భావాలలో బ్రతికుంటుంది. ఈ విషయం బుద్ధునికి బాగా తెలుసు. ఆయన జ్ఞానోదయం పొందే క్రమంలో చేసిన యుద్ధమంతా ఈ భావజాలంతోనే. బౌద్ధంలో అకుశకర్మలకు ప్రతీకగా మారుడు అనే వాణ్ణి చూపుతారు.

పూర్తి ప్రత్యామ్నాయ అనాత్మవాద భౌతిక సంస్కృతిని నిర్మించాలంటే ఏం చేయాలో బుద్ధుడు కచ్చితంగా అదే చేశాడు. మారునితో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో విజేతగా నిలిచాడు. ఇక మారుణ్ణి జయించిన తర్వాత తాను ఏది చెప్పినా, ఏది చేసినా తనని మారుడు ఓడించలేడు. అంటే తనకు తెలియకుండా తాను ఆత్మవాదంలో పడిపోలేడు. అలా పడిపోకుండా ఉండడంకోసం మారునితో జీవితాంతం పోరాడుతూనే ఉన్నాడు. మారునితో పోరాటం అనేది దీర్ఘకాల పోరాటం. జీవితకాల పోరాటం.

మారునితో యుద్ధం ఎలా చేయాలో మారుణ్ణి ఎలా జయించాలో– చెప్పిన సూత్రాలే బౌద్ధ ధ్యాన సూత్రాలు– వినయ పిటకంలోని నియమాలు.

మారుణ్ణి జయించలేకపోయిన కొందరు బౌద్ధులూ ఉన్నారు.

మారుణ్ణి జయించడం అంటే... ఆత్మవాద భావాల్ని, ఆత్మవాద భావజాలాన్ని ఏ విధంగానూ, ఏ రూపంలోనూ తనలోకి రాకుండా చూసుకోవడమే! ముందు తనకు తానుగా ఆ బంధనాలనుండి బయటపడడం.

ఇది– ప్రత్యామ్నాయ సంస్కృతిని, సమాజాన్ని నిర్మించాలనుకునే ఆచరణాత్మక తత్త్వవేత్తలకే సాధ్యం అవుతుంది.

అది సాధించిన వ్యక్తి బుద్ధుడు. అంటే... ఆయన ఆలోచనలు ఎంత శాస్త్రీయమో, ఎంత వైజ్ఞానికమో, ఆయన ఆచరణలు కూడా అంతే శాస్త్రీయం. అంతే వైజ్ఞానికం.

– ఇప్పటిదాకా, సిద్ధాంతం, ఆచరణల్లో బౌద్ధ శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక మార్గాన్నీ చూశాం. ఇక ఖగోళ, భూగోళ, గణిత, వైద్య విభాగాల్లో బౌద్ధం సాధించిన వైజ్ఞానిక ప్రగతిని చూద్దాం!

(వచ్చే సంచికలో)

గుండెలోతుల్లోంచి వచ్చేదీ,
మనసువిప్పి చెప్పగలిగేదీ
అమ్మనుడిలోనే.

-ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
98485 98446

# విజయనగర చక్రవర్తుల బిరుదులు-2

**మొదటిదేవరాయలు (క్రీ.శ. 1406-1422) :** రెండో హరిహరుని చివరి కుమారుడైన మొదటి దేవరాయలు నవంబర్ 5వ తేదీ, క్రీ.శ.1406న సింహాసనాన్నధిష్ఠించాడు. అంతకుముందు ఉదయగిరి పాలకునిగా దక్షతను నిరూపించుకొన్నాడు. విజయ నగరాన్ని విస్తృతం గావించి, ఆలయ గోపురాలతో అందంగా తీర్చిదిద్దాడు. తుంగభద్రానదికి ఆనకట్టను కట్టి, నగరానికి నీటి సరఫరా చేశాడు. ఇతని కాలంలో విజయనగరాన్ని నికోలో కోంటీ సందర్శించాడు. బహమనీసుల్తాన్ ఫిరోజ్‌షాతో యుద్ధాలు చేసి, రెడ్డిరాజ్యాలతో సఖ్యత నెరిపాడు. కన్నడ శాసనాల్లో ఇతనికున్న కింది బిరుదులగురించి ప్రస్తావించబడింది. **అరిరాయ విభాడ(ళ), అష్టదిక్కురాయ మనోభయంకర, గజముఖ భీమ**(యుద్ధాల్లో భీకరుడు), **పూర్వ పశ్చిమ ఉత్తర దక్షిణ సముద్రాధిపతి, మగధరాయ మదమర్దన, రణముఖరామ** (యుద్ధంలో రామునివంటి పరాక్రమవంతుడు), **వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, సంగీత విద్యాసాగర** (సంగీతవిద్యలో అపార జ్ఞానం గలవాడు), **సాహిత్య విద్యా విశాలావతార** (సాహిత్యం, విద్య, కళల్లో అపారమైన ఆసక్తి గలవాడు), **హిందూరాయ సురత్రాణ** అనే బిరుదులను ధరించాడు.

**రెండో దేవరాయలు లేక ప్రౌఢదేవరాయలు (క్రీ.శ.1422-1446):** మొదటి వీర విజయరాయలు పాలించిన (క్రీ.శ.1422-26) కాలంలో తండ్రితోపాటు పాలనలో పాలుపంచుకొన్న రెండో దేవరాయలు క్రీ.శ.1426లో తండ్రి మరణానంతరం పాలనా పగ్గాలను చేతబూనాడు. ఇతని దక్షిణయాత్రలో కేరళలో కొంత భూభాగము విజయనగర సామ్రాజ్యంలో చేరింది. కొండవీడులోని కొంతప్రాంతాన్నికూడా హస్తగతం చేసుకొన్నాడు. బహమనీలు, గజపతులతో యుద్ధాలు చేశాడు. యుద్ధతంత్రనిపుణుడుగా **గజబేటకార** అనే బిరుదును పొందాడు. సాహితీ కళారంగాలకు చేయూతనందించాడు. ఇతని కాలంలోనే శ్రీనాథుడు, విజయ నగరంలో డిండిమభట్టు నోడించగా, రాయలు శ్రీనాథునికి కనకాభిషేకం గావించాడు. ఇతని కాలంలో అబ్దుల్‌రజాక్ విజయనగరాన్ని సందర్శించాడు. దేవరాయలు కవులు కళాకారులను ప్రోత్సహించటమే కాక, తానుకూడా ఒక కవిగా గుర్తింపు పొందాడు. సంస్కృతంలో మహానాటక సుధానిధిని, బ్రహ్మసూత్రాలకు (వృత్తి) వ్యాఖ్యానాన్ని రచించాడు. అతని బిరుదుల్లో **అప్రతిమ బిరుదంక, అభినవభధ, అభినవవీర, అరిరాయ మానమర్ధన** (శత్రురాజుల గర్వాన్ని అణచిన వాడు), **అరిరాయవిభాడ, అష్టదిక్‌మనోభయంకర, అశ్వపతి, ఈళం తిర్యకొండ**(శ్రీలంకను జయించినవాడు), **ఉదయబాలభాస్కర, కండనాడు కూందు కూండనాడ కూడదపూర్వ దక్షిణ పశ్చిమోత్తర చతుస్సముద్రాధిపతి, కర్ణాటక్షితినాథ, కర్ణాటక్షితిపాల, కుడికూటక తప్పువనాయంకర గండభేరుండ** (రెండు తలల పక్షిలా బలాఢ్యుడు), **గండరిగూళి, గజబేటకార**(ఏనుగులను వేటాడటంలో దిట్ట), **గజపతి**(గజదళ అధిపతి, ఒరిస్సా గజపతులను జయించిన వాడు), **గజాఘుగండభేరుండ** (ఏనుగులకు గండభేరుండ మాదిరి శత్రువులకు ఇతడలా), **చండమండనకేసరి, చతుసముద్రాధిపతి, చోళరాజ్య స్థాపనాచార్య, జపంపరమేశ్వర, తురుష్కమహాహయ ప్రబల సైన్య విదారి**(తురుష్కులకంటే మించిన మహాబలశాలులైన గుర్రాలు, సైన్యం కలిగినవాడు), **తురుష్కతురుగారూఢ**(తురుష్కుల గుర్రాలను స్వారీ చేయగలవాడు),


రెండవ దేవరాయలు నాణెము


నాణెము రెండోవైపు

**తుళువదళవిభాధ, దుష్టనిగ్రహ శిష్టపరిపాలక, ధరణీవరాహ**(భూమిని రక్షించిన వరాహావతారం వంటివాడు), **ధర్మ రత్నాకర, ధర్మచరిత్ర, నరపతి**(కాల అధిపతి), **నిజభూమికార** (భూమికి నిజమైన ప్రభువు), **పరరాయభయంకర, పూర్వ దక్షిణ పశ్చిమ సముద్రాధిపతి, పూర్వ పశ్చిమ దక్షిణోత్తర చతుసముద్రా ధిపతి**(సముద్రనాయక), **పూర్వ దక్షిణ పశ్చిమోత్తర బల్లాయరాయ, భాషాతిలంగ** (భాషాపారంగతుడు, భాషాతిలకుడు), **భాషెగె తప్పువ రాయగండ** (ఆడిన మాటతప్పిన రాజులకు అధిపతి), **భూపాల భుజంగ, మస్తకాశూర మూవరు రాయరగండ**(రాజు, మాండలిక, సామంతు లకు అధిపతి), **యదుకులతిలక**(యదుకులానికి తిలకం లాంటి వాడు), **యాదవవంశప్రదీప. యాదవరాజ్య ప్రతిష్ఠాచార్య, విజయనగర పురవరాధీశ్వర, వివేక నారాయణ, వైరిభూపతివేతండ, సత్కళా భోజ**(కళాప్రోత్సాహ), **సత్యహరిశ్చంద్ర, శరణాగత రాయ స్థాపనాచార్య**(శరణు వేడిన రాజులను మళ్ళీ వారి సింహాసనాలపై కూర్చుండ బెట్టినవాడు), **శరణాగతవజ్రపంజర, వీరప్రతాపచక్రవర్తి, శైవాసార సంపన్న**(శైవాగమాలసారం తెలిసినవాడు), **హిందూరాయ సురత్రాణ** (హిందూరాజులకు సుల్తానులాంటివాడు) అనే బిరుదులను ధరించాడు.

**మల్లికార్జునరాయలు(క్రీ.శ.1446-1465) :** మూడో దేవరాయలు, మూడో మల్లికార్జునరాయలని పేర్లుగల మల్లికార్జునరాయలు క్రీ.శ. 1446లో సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు బలహీనుడు కావటంవల్ల పొరుగురాజులైన బహమనీలు, గజపతులు విజృంభించారు. ఇంతకు మునుపు రెడ్డిరాజ్యంలో ప్రధాన స్థావరాలైన కొండవీడు, అద్దంకి పట్టణాలను కపిలేశగజపతి ఆక్రమించాడు. అతని కుమారుడైన హంవీరుడు విజయనగరసామ్రాజ్యాంతర్భాగమైన శ్రీశైలాన్ని ఆక్రమించాడు. హంవీరుని కుమారుడు కుమార కపిలేశ్వరుడు ఇదే అదునుగా విజయనగర దుర్గాలైన ఉదయగిరి, చంద్రగిరి, తిరుచనావల్లిలను జయించటంతో విజయ నగరప్రాభవం మల్లికార్జునరాయలి చేతిలో వన్నె తగ్గింది. ఇతనికి **అరిరాయ విభాడ, చతుసముద్రాధిపతి, పరమేశ్వర, భాషగెతపులవరాయ గండ, మహారాజాధిరాజ, శ్రీ వీరప్రతాప చక్రవర్తి** అనే బిరుదులున్నాయి.

**రెండో విరూపాక్షరాయలు(క్రీ.శ. 1465-1485) :** సంగమ వంశంలో చివరివాడైన ఇతడుకూడా బలహీనుడు కావటాన శత్రువులు విజృంభించి, విజయనగర భూభాగాల్లో కొన్నింటిని కాజేశారు. ఇతనికి **అరిరాయవిభాడ, కరుణైకసింధు, చతుసముద్రాధిపతి, భాషగెతప్పువ రాయగండ, మూరురాయరగండ, హందూసురత్రాణ** అనే బిరుదులు ఉన్నాయి.

(ఇంకా ఉంది)

-మోదుగుల రవికృష్ణ
9440320580

# సారంగపాణి పదాలలో సాంస్కృతిక జీవనవైభవం

సారంగపాణి చిత్తూరు జిల్లాలోని పుత్తూరు సమీపంలోగల కార్వేటి నగర సంస్థాన కవి. 19వ శతాబ్దిలో జీవించి ఉన్నవాడు. సారంగపాణి రచించిన 230 పదాలు ప్రస్తుతం లభ్యమౌతున్నాయి. ఇతర పదకర్తల కంటే సారంగపాణిలో ఒక విలక్షణత గోచరిస్తుంది. సమకాలీన సమాజాన్ని సారంగపాణి తన పదాలలో చిత్రించాడు. ఇతర పదకర్తలు రాజులు వారి రాసలీలలు ఇవే ప్రధానంగా చెప్పారు. కాకపోతే భగవం తుడి పేరుని ముద్రగా వాడుకున్నారు. సారంగపాణి వేణుగోపాలుడి ముద్రతో, తన పోషకుల ముద్రతో శృంగారపదాలు రాసినప్పటికీ, కొన్ని పదాలలో నాటి ప్రజల జీవనవిధానాన్ని నమోదుచేయడం విశేషం.

సారంగపాణి ఒకరకమైన సంధిసమయంలో జీవించివున్నాడు. తనను పోషించిన కార్వేటినగర రాజుల ప్రాబల్యం తగ్గుతూ వస్తుంది. సంస్థానంలోని అనేక గ్రామాలను డబ్బుకోసం పాలకులు కుదువ పెడుతున్నారు లేదా అమ్మేస్తున్నారు. పాలన దాదాపుగా కుంటుపడింది. పాలకుల భోగవిలాసాలు పెచ్చుపెరగుతున్నాయి. ఫ్రెంచివాళ్ళ, ఇంగ్లీషువాళ్ళ పెత్తనం పెరుగుతూ ఉంది. వారి జీవనశైలి స్థానిక ప్రజల జీవనశైలిని ప్రభావితం చేస్తూ ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో సారంగపాణి పదరచన చేశాడు.

ప్రజల సంస్కారాన్నిబట్టి ఏర్పడే ఆచార వ్యవహారాలు, ఉపాసన తదితరాంశాల్ని సాంస్కృతికాంశాలు అవుతాయి. సాంఘికాంశాలు ప్రజల బాహ్యాభివృద్ధిని సూచిస్తే, సాంస్కృతికాంశాలు వారి అంతస్సౌంద ర్యానికి అద్దం పడతాయి. ప్రజల హృదయ పరిపక్వతను ఆవిష్కరిస్తాయి. ఆరాధన, తదితర కర్మకాండలు సాంస్కృతికాంశాల్లో చేరతాయి. సారంగపాణి పదాలను ఆధారం చేసుకొని కార్వేటినగర పరిసర ప్రాంతాలలో ప్రజల సాంస్కృతిక జీవనాన్ని అర్థం చేసుకోవచ్చు.

**వేడుకలు :**

సంతోషాన్ని, ఉత్తేజాన్ని కలిగించేందుకు ఉద్దేశింపబడి, తరతరా లుగా ఆచారంలో ఉంటూ, సంస్కృతిలో ఒక భాగంగా స్థిరపడిన కార్యక్రమాలే వేడుకలు. ఉదాహరణకు పెళ్లిళ్లు, పండుగలు, ఉత్సవాలు. కార్వేటినగరం ప్రాంతంలో పేర్కొనదగ్గ ఉత్సవాలు కృత్తికోత్సవం, తెప్పతిరునాళ్లు, కొండచుట్లు, అగ్గితిరునాళ్లు.

**కృత్తికోత్సవం :**

ఆపదల్ని అధిగమించడానికి అనారోగ్యంనుంచి తేరుకోవడానికి దేవుళ్లకు ప్రజలు రకరకాలుగా మొక్కుబళ్లు చేసుకుంటారు. సుబ్రహ్మణ్యస్వామికి 'కావళ్లు' ఎత్తి తలనీలాలు సమర్పించుకొంటామని మొక్కుకుంటారు. సుబ్రహ్మణ్యస్వామికి అన్ని కృత్తికా నక్షత్రాల్లో పూజలు జరిగినా ప్రతి సంవత్సరం ఆడి నెలలో వచ్చే 'కృత్తికానక్షత్రం' నాడు మాత్రం పూజలు ఘనంగా జరుగుతాయి. కాబట్టి ఆరోజే ఎక్కువమంది భక్తులు తమ మొక్కుబళ్లను చెల్లించుకొంటారు. ఈ ఆడికృత్తికకు మొక్కుబళ్లు చెల్లించుకొనేవాళ్లు కాకుండా భగవంతుణ్ని, భక్తజన సందోహాన్ని తిలకించడానికి చిత్తూరు జిల్లా నలుమూలలనుంచే కాక ఉత్తర ఆర్కాడు, చెంగల్పట్టు జిల్లాలనుంచి కూడా ప్రజలు తండోప తండాలుగా 'తిరుత్తణి'లోని సుబ్రహ్మణ్యస్వామి గుడికి వస్తారు.

సారంగపాణి పదాలలో ఒకానొక నాయకుడు నాయికతో 'నచ్చత్రం బొయ్యెత్తామె. చంద్రూమాశి – నచ్చత్రం సూశత్తామె' అనే నక్షత్ర ప్రస్తావన, 'శిరతని నచ్చత్రం బొయ్యేనంటి శిన్నోన్నేసుకొని' అనే పదంలో నచ్చత్ర ప్రస్తావనే కృత్తికా నక్షత్రం. ఈ కృత్తికా నక్షత్రమే కృత్తికోత్సవం.

నునుపుగా చెక్కిన నాలుగు లేదా ఐదడుగుల కొయ్యకు ఇరుప్రక్కల చివర్లలో రెండు గంటల్ని అమర్చుతారు. అటువైపు ఒకటి, ఇటువైపు ఒకటి వెదురు పుల్లల్తో అల్లిన బుట్టల్ని వ్రేలాడగడతారు. ఆ బుట్టకు పసుపు గుడ్డల్ని తొడుగుతారు. దీన్నే 'కావడి' అంటారు.

**కావడి చెల్లించే పద్ధతి :**

కృత్తికా నక్షత్రం రోజు మొక్కుబడి ఉండేవాళ్లు ఉపవాసముంటారు. ఇల్లు, వాకిలి శుభ్రం చేసి, గోడకు సున్నం పూస్తారు. దిన్నెకు ఎర్రమన్ను పెడతారు. కొబ్బరికాయ, కర్పూరం, నిమ్మపండ్లు, ఖర్జూరపు పండ్లు, మారేడు ఆకు, తులసి ఆకు, పాలు, తేనె, పసుపు, కుంకుమ, గంధం, అత్తరు, పన్నీరు, కదుంపొడి, విబూదిపండ్లు వంటి వస్తువుల్ని సిద్ధం చేసుకొని భక్తితో ఒక బావి దగ్గరకు వెళతారు. కావడితోబాటు బావిలో మునిగి స్నానం చేస్తారు. కావడిని శుభ్రం చేసి, దానికి గంధం పూసి, విబూదిపండుతో గీతలు గీస్తారు. పాలతోను, తేనెతోను, కదుంపొడి తోనూ కావడిని అభిషేకిస్తారు. తిరుత్తణిలో భగవంతుణ్ణి పూజించడానికి ఒక విబూదిపండు, రెండు నిమ్మపండ్లు, రెండు ఖర్జూరపండ్లు, కొబ్బరికాయ, కర్పూరం ఒక కావడి బుట్టలో భద్రపరుస్తారు. భక్తుడు స్నానం చేసిన తర్వాత పసుపు బట్టల్ని ధరించి కావడిని భుజంమీద మోసుకుంటూ తిరుత్తణికి వెళ్లి సుబ్రహ్మణ్యస్వామికి మొక్కుబడి చెల్లిస్తారు. ఇలా మూడు సంవత్సరాలు చెల్లించి మొక్కుబడి తీర్చుకుంటారు. కొందరు 'వడ్డికావడి' పేరుతో నాలుగో సంవత్సరం కూడా దేవుణ్ణి దర్శించి వస్తారు.

**ఊరేగింపు :**

ఆలయంలో మూలవిగ్రహం 'మూలవర్లు'. ఈ మూర్తికి సంబంధిం చిన ఉత్సవ విగ్రహాన్ని ఉత్సవాల్లో వివిధ వాహనాల మీద ఊరేగిస్తారు. ఉత్సవమూర్తి సన్నిధివీధి కుడి, ఎడమవీధుల్ని త్రొక్కివస్తాడు. స్వామిని దర్శించి ప్రజలు పాపాలు పోగొట్టుకోవడం, స్వామి ప్రజల్ని రక్షించడం ఈ ఊరేగింపు ఉద్దేశ్యం. వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు వస్తుండగా ఆనాటి ప్రజల ఆనందోత్సాహాన్ని, భక్తిని సారంగపాణి క్రింది పదంలో ఎంత చక్కగా వర్ణించాడో గమనించండి.

ప. కదలివచ్చెను జూడరే – వేణు
గోపాలుడు – కనుల పండుగగాను
అ.ప. పదిలుడై గరుడుని – పై నెక్కి భక్తుల
ముదమంద జేయుచు – ఇదిగో రాజమార్గమున

చరణం : సురలు నుతింపగను – వేదము లవనీసురులు పఠింపగను
ధరణీశు లతిభక్తి – తను సేవింపగాను
సరసిజాక్షులు నాట్య – సరణి నభినయింపగాను ॥కదలి॥

కార్వేటినగర వేణుగోపాలస్వామి గరుడోత్సవాన్ని కళ్లకు కన్పించి నట్లు సారంగపాణి ఈ పదంలో వర్ణించాడు.

**తెప్పతిరునాళ్లు :**

అర్చామూర్తులకు జరిగే అనేక ఉత్సవాల్లో తెప్పోత్సవం ఒకటి. ఇది ప్రతియేడు నిర్ణీతకాలంలో మాత్రమే జరుగుతుంది. తెప్ప నొకదాన్ని నిర్మించి, దానిలో దేవుని ఉత్సవమూర్తిని వేంచేపు చేయించి తెప్పను పుష్కరిణిలో వదులుతారు. ఒకటి లేదా మూడు లేదా ఐదు చుట్లు రోజువారీగా మూడు రోజులు తిప్పుతారు. తెప్పలో జరిగే ఈ ఉత్సవాన్ని చూసేందుకు వేలాది ప్రజలు వస్తుంటారు. సుప్రసిద్ధాలయాలన్నింటి లోను తెప్పోత్సవం జరుగుతుంది. కార్వేటినగరం శ్రీ వేణు గోపాలస్వామికి జరిగే తెప్పోత్సవాన్ని సారంగపాణి రమ్యంగా వర్ణించాడు.

ప. నగరాన తెప్పతిర్నా యేడికె సూన్ను –
నాగు నూ రాలేదంటే అపిడె

అ.ప. అగుముడియల్లచ్చి – తొగటాయాటమ బశివి
చిగమెత్తినట్లె్లి – వొగరితో సెప్పకనే రెయ్యి
పదమ చరచుకాడ – పందిల్లె బగినోదం
సదురేశిందే చోదెం – చామిదే యింతా
యెదురు ముగ కూడొం – దేశి రింటెలుపున
అదెశెయి సూపియ్యేశి – రాన్నే మాశి కింత్తతై ॥నగరాన॥

కార్వేటినగరం సమీపంలో ఒక పెద్ద పుష్కరిణి ఉంది. దీన్ని 'స్కంధ పుష్కరిణి' అంటారు. దీనికే 'పద్మపుష్కరిణి' అని నామాంతరం. ఈ సరస్సు విశాలమైన సోపానాలతో పూర్ణజలంతో విరాజిల్లుతూ ఉంది. ఈ సరసులోనే వేణుగోపాలస్వామి తెప్పోత్సవం జరుగుతుంది. చుట్టూ పందిళ్లు వేసి చాలా వేడుకగా ఆనాడు ఈ ఉత్సవాన్ని జరిపేవారని తెలుస్తుంది. అన్నం వండించి పోసేవారు. ఆ ప్రాంతమంతా ఇసుకవేస్తే నేలరాలనట్లు జనంతో కిటకిటలాడేది. తాత్కాలికంగా అంగళ్లు పెట్టుకొని వర్తకులు వ్యాపారం కూడా చేసుకునేవారు. జంగాలు శంఖాలు ఊదేవారు. తెప్పోత్సవం కోసం తీసుకురాబడిన ఉత్సవమూర్తుల్ని మండపంలో ఉంచేవారు. దేవదాసీలు అక్కడ నర్తనం చేసేవారు. కొందరు వేషాలువేసుకుని వచ్చి ఆటపాటల్ని ప్రదర్శిస్తారు. ఈ తెప్పోత్సవ దృశ్యాన్నంతా తిలకించేందుకు సంస్థానంవారు తమ బలగంతో వచ్చేవారు.

**కొండచుట్టు :**

గ్రామప్రాంతాల్లో అనేక ఉత్సవాలు జరుగుతాయి. కొండప్రాంతాల్లో ఉండే గ్రామాల్లో జరిగే ఉత్సవాల్లో 'కొండచుట్టు' పేర్కొనదగింది. ఈ ఉత్సవం ప్రతియేటా జరుగుతుంది. చుట్టుప్రక్కల గ్రామాల్లోని వేల్పుల విగ్రహాల్ని కొండ సమీపంలోని ఒక సంకేత స్థలానికి తీసుకువస్తారు. తర్వాత విగ్రహాల్ని కొండచుట్టూ ప్రదక్షిణాలు చేయిస్తారు. అక్కడక్కడా ఆపించి హారతి, నివేదన చేయిస్తారు. కొండ ప్రదక్షిణ పూర్తి అయ్యాక వేల్పులవిగ్రహాలు తమతమ స్థానాలు చేరుకుంటాయి. విగ్రహాలు కొండచుట్టి రావడంవల్ల ఈ ఉత్సవానికి కొండచుట్టు అనే సార్థకనామం కలిగింది. ఈ ఉత్సవం సంక్రాంతి, శివరాత్రి సందర్భాల్లోనే జరుగుతుంది. సారంగపాణి కాలంలో కూడా ఈ ఉత్సవాన్ని విశేష శ్రద్ధా భక్తులతో జరుపుకొనేవారని తెలుస్తుంది. దీనికి ఆధారం సారంగపాణి పదమే.

ప. కొండ సుట్టొచ్చేరంటె నారాల తూరి –
కొండ సుట్టొచ్చేరంటే
బండారి పాపీంద్ర లాలి దాసరి శెన్ను –

అ.ప. వండే రంటొరికూళ్లు వారస్తాణె పైణాలు

చరణం: ఊరూరు యిగిణిల్లు – వూపుతా వాస్తా చన్నా
గార నూరే మండపాన – గంటవాపి దింపగానే
తేరుమూకే పర్చైన – దెయేంద్ర యిబమాలె
గారడా లంటుండావొ – కళిగ్గె వైకుంటమేనె ॥కొండ॥

కార్వేటినగర ప్రాంతంలో జరిగే కొండచుట్టు తిరుణాళ సందర్భంలో జరిగే ఉత్సవ విశేషాలు ఈ పదంలో వర్ణింపబడినాయి.

కొండచుట్టి (కొండచుట్టూ తిరిగి) వచ్చినారంటే (అదొక గొప్ప ఆ ఉత్సవంలో). బండారి పాపి, ఈంద్ర లాలి, దాసరి శెన్ను (వీళ్లు ముగ్గురూ పక్కపక్క ఇండ్లవారై ఉంటారు. లేదా స్నేహితురాండ్రై ఉంటారు) వరి అన్నం వండుతున్నారంట. అన్నం వారుస్తూనే (గంజి వంపగానే) ప్రయాణమంట.

ఆ ప్రాంతపు గ్రామాలన్నిటి నుండి విగ్రహాలు సన్నాయి వాద్యాతో ఊరేగుతూ వస్తాయి. గారునూరు దగ్గర ఉన్న మండపంలో గంట వాయించగానే విగ్రహాలన్నిటిని దింపుతారు. రథం లాగడానికి ఉత్సవం చూడడానికి వచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎగబడతారు. చూడడానికి దేవేంద్ర వైభవం వలె ఉంటుంది. గారడీగా చెపుతున్నా ననుకుంటావేమో గాని నిజంగా అది కలియుగ వైకుంఠమే.

ఆ వేడుక చూచిన వాళ్లదే జన్మం. దేవదాసీలు పాటలు పాడుతూ నాట్యం చేస్తున్నారు. అలా చేస్తూనే జనం వైపుకు వచ్చి బహుమానాలు అడుగుతున్నారు. జనంలో కొందరు ఇవ్వగా, ఇవ్వలేనివాళ్లు బిక్కముఖం వేసుకొన్నారు. ఇదంతా చూడడానికి ఎంతో వేడుకగా ఉంది.

అక్కడ ఒక కాసుకు చేరడు ఎండు చేపల పొడి దొరుకుతుంది. అక్కడ గోగులు ఇంకా అగ్గవే. రాచవారి పొలంలో శిర్రాకు బాగా పెరిగి ఉంది. వేణుగోపాలస్వామిని తలచుకొంటూ కోసుకొని పోదాం రండి అని ఆ స్త్రీలలో ఒకరితో మరొకరు చెప్పుకొంటున్నారు.

చుట్టుప్రక్కల గ్రామాల్లోని విగ్రహాల్ని తెచ్చి ఒక మంటపంలో గంటలకొట్టి దించేవారు. ప్రభువు పూజించే విగ్రహాల్ని అంబారీతో అలంకరింపబడిన ఏనుగు మీద తెచ్చేవారు. ఉత్సాహవంతులు రకరకాల వేషాలతో ప్రజల్ని అలరించేవారు. ఉత్సవం చివర గుగ్గిళ్లను ప్రసాదంగా పంచేవారు. ఇలా కొండచుట్టు ఉత్సవం దేవేంద్ర వైభవంగా చూడవేడుగ్గా ఉండేదని చూచిన సారంగపాణి తన పదంలో మనకు చూపించాడు.

**అగ్గి తిరునాళ్ల :**

తమిళనాడులోను దానికి సమీపంలో ఉన్న చిత్తూరు జిల్లాలోను భారతోత్సవాలు ప్రతియేటా జరుగుతాయి. ఈ భారతోత్సవాలనే 'ద్రౌపదమ్మ తిరునాళ్ల'నీ, 'ధర్మరాజు తిరునాళ్ల'నీ, అగ్నిగుండమనీ, అగ్గి తిరునాళ్లనీ, నిప్పు తిరునాళ్లనీ, భారతాలనీ వ్యవహరిస్తారు. ఈ ఉత్సవాలు ధ్వజారోహణతో ప్రారంభమై అగ్నిగుండంతో ముగుస్తాయి. ఇవి చిత్తూరు జిల్లాలో పదిరోజులపాటు జరుగుతాయి. ప్రతిరోజు ద్రౌపది, ధర్మరాజు, భీమార్జునాదుల విగ్రహాల ఊరేగింపు ఉంటుంది.

ఈ పదిరోజుల్లోను పగటిపూట హరికథాగానం, రాత్రిపూట జానపద బాణిలో నాటకాలుగా సాగుతుంది. మొదటిరోజు పాండవ జననం, రెండోరోజు పాండవుల విద్యాభ్యాసం, మూడోరోజు లాక్షాగృహ దహనం, నాల్గోరోజు బకాసురవధ, ఐదోరోజు ద్రౌపదీ కల్యాణం, ఆరోరోజు ద్రౌపదీ వస్త్రాపహరణం, ఏడోరోజు ఆరణ్యవాసం, ఎనిమిదోరోజు అర్జునుని తపస్సు, తొమ్మిదోరోజు కీచకవధ, పదోరోజు అభిమన్య, దుశ్శాసన, దుర్యోధనువధ ఘట్టాలు ప్రదర్శింపబడుతాయి. చివరిరోజు సాయంకాలం అగ్గితొక్కే వేడుక జరుగుతుంది. నేలను తవ్వి గుండంచేసి, అందులో కట్టెలు పేర్చి అగ్ని రగిలిస్తారు. కణ కణమండే నిప్పుల్లో భక్తులు నడచి తమభక్తిని ప్రదర్శించుకుంటారు. త్రేతాయుగంలో సీత అగ్నిప్రవేశం చేసి పునీత అయినట్టే ద్వాపరయుగంలో కూడా పాండవులు అగ్నిప్రవేశం చేసి పాపాల్ని పోగొట్టుకొని పవిత్రులయ్యారని జానపదుల విశ్వాసం. కానీ ఈ సంఘటన భారతంలో లేదు. ఈ అగ్గి తిరునాళ్లను దృష్టిలో పెట్టుకొని ఒక జానపదుడు పదం పాడినట్టు సారంగపాణి రచించాడు.

ప. అగ్గితిరునాళ్ళంట – అజ్జుని కతంట–
అవురా యంతరు సోద్దమే భారతకథ –
ఔరా యెన్నెన్నింతలే
అ.ప. సుగ్గీజయము దీని – సుట్టు బలాదూరు
అగ్గరోరపు అయ్యో – ర్నడిగే నీ సాచ్చిగ
యిగనేను పైనెక్కి – యీ బీసనూ డొచ్చి
బగుపెగ్గె లెన్నెన్నో – బలికి దుశ్శాసూని
మొగము చూడగానె – మోర్చనాయాట్టే
గుగురు మిగురనకుండ – గుడ్లె గుక్కెనే ॥అగ్గి॥

కార్వేటినగర ప్రాంతంలో జరిగే అగ్గి తిరునాళ్ల విశేషాలను ఈ పదం వివరిస్తున్నది.

అగ్గి తిరునాళ్లంట – అర్జునుని కథంట. ఔరా! ఎంత ఆశ్చర్యంగా ఉంది భారతం కథ. ఎన్నెన్ని వింతలు కనిపిస్తున్నాయి. సుగ్రీవ విజయం కథ భారతం కథ ముందు బలాదూర్. నీ సాక్షిగా ఇది నిజం. కావాంటే అగ్రహారపు అయ్యవారిని అడుగు.

విభీషణుడు విఘ్నేశ్వరునిపై ఎక్కి వచ్చాడు. ఎన్నెన్నో పెగ్గెలు (ప్రతినలు) పలికినాడు. దుశ్శాసనుని ముఖం చూడగానే మూర్ఛపోయాడు. చడీ చప్పుడు లేకుండానే కనుగుడ్లు బయటకు వచ్చాయి.

హనుమంతునికి వెనక పుట్టినవాడు అభిమన్యుడంట. శనివలె పట్టుకోగా అల్లే యుద్ధం చేస్తూ వీరభద్రుని వృషణాలను తొక్కి, కను మూసి తెరచే లోపల కర్ణుని చీల్చివేశాడు.

హిరణ్యాక్షుని తోడల్లుడైన ఇంద్రజిత్తు ఒకరాత్రి దుర్యోధనుని చెవిలో దూరి ముక్కుగుండా బయటకు వచ్చాడు. పిశాచి అరచినట్లు అరచి అశ్వత్థామను మింగాడు. అప్పటికి సూర్యోదయమైంది. ఇవన్నీ చూడడం ఎంతో వేడుకగా ఉంది.

మారుబాసవాడు తప్పకుండా ఆంగ్లేయుడే అయి ఉంటాడు. అప్పటికి ఆ ప్రాంతమంతా తూర్పు వర్తకసంఘం పరిధిలోనే ఉండింది. ఆంగ్లేయులు ఉత్సవ సందర్భాల్లో ప్రజలతో కలిసిపోయి తాము పరదేశీయులమనే అంశం ప్రజలకు గుర్తురాకుండా ఉండడానికి ప్రయత్నించారు. దాని కోసం ఏదో ఒకటి బహుమానంగా కొందరికైనా ఇస్తూ వాళ్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో భాగంగానే ఒక ఆంగ్లేయుడు తన సంచి తెరచి చేరడు చేరడు అక్కడుండిన జనానికి ఇచ్చి ఉంటాడు. ఇచ్చినదేదో తెలియదు.

**బండి తిరునాళ్ల :**

ప. సూడ బోదమే గంగూ– సూడ బోదమే
బండితిర్లునాళ్లంట – బారుకోతి బాపలంట
శింద పూలదండ లంట –శెలియ సాముండు నంట॥సూడబో॥
ఈరనాల మోతలంట – యినప దండ్ల దీయలంట
బోరుబోరున వూపేరంట – బోగమక్క లాడే రంట॥సూడబో॥
ఇలుకు గబ్బు గీములోను – పులుసు నీలు శాత బోసి
తలల శిప్పలంట బొడిశి – దచ్చనాల్లడిగే రంట ॥సూడబో॥

ఈ పదంలో సారంగపాణి బండి తిరునాళ్లను వర్ణించాడు.

ఓ గంగూ! రథోత్సవం చూడడానికి వెళదామా! బండి తిరనాళ్లంట. వరుసలు వరుసలుగా బ్రాహ్మణులు నడుస్తూ ఉంటారంట. చెండుమల్లె పూలదండలు అలంకరించినారంట. బండిలో స్వామి కొలువుదీరి ఉంటాడంట.

చర్మవాద్యాల మోతలు వినపడుతా ఉంటాయంట. ఇనుప కమ్ముల దివిటీలు మోగుతూ ఉంటాయంట. వేగంగా రథాన్ని లాగుతారంట. బోగం స్త్రీలు ఆడతా వస్తారంట. ఒక రకమైన వాసన వచ్చే ఇరుకైన గదిలో పులుసునీళ్లు (తీర్థం) అక్కడికి వచ్చిన వాళ్ల చేతులలో పోసి,తల మీద శఠకోపం పెట్టి, దక్షిణలిమ్మని అడుగుతారంట.

ఈవిధంగా కార్వేటినగర పరిసరప్రాంతాల జనజీవన సాంస్కృతిక అంశాలను సారంగపాణి తన పదాలలో పొందుపరిచాడు.

**పరిశీలనా గ్రంథాలు :**


1. డా. కె. మునిరత్నం – చిత్తూరు జిల్లా జానపద గేయాలు – సాంఘిక, సాంస్కృతిక పరిశీలన.
2. క్రీడాభిరామం – వినుకొండ వల్లభరాయుడు, (శ్రీనాథుడు)
3. ఆంధ్రుల సాంఘికచరిత్ర – సురవరం ప్రతాపరెడ్డి.
4. ఆచార్య యస్. గంగప్ప – సారంగపాణి పదసాహిత్యము.


జనవాణి

## ఫ్లెక్సీలు, పోస్టర్లు

**ప**ట్టణాలను పోస్టరు రహితం చేయాలని మంత్రి ఆదేశం
దొంగే దొంగా దొంగా అరచినట్టన నిదియా అని సందేహం
గుంటూరు పట్టణమున ఎంతో విశాలమైనది మా బజారు
అధికారగణ ఫ్లెక్సీలు, ఆచ్ఛాదనలేని కేబుల్ బాక్సులు
అంతటా అవి వేలాడటం రోజూ చూచే మా గుండె బేజారు
మంత్రులూ మహాధికారులు పయనిస్తారాదారిన రోజూ
మరి వాళ్ళ కళ్ళకున్నాయేమో కామెర్ల పొరలు?
కలకటేరు కమీషనరు పత్రికా ప్రకటనలు
కావె కుచ్చితములు కాకమ్మల కథనములు
మనసున్న లేవె మార్గములు మాన్పుటకు
మరపించ మురిపించు పల్కులు గాక!?


**–నన్నపనేని అయ్యన్నారావు,** గుంటూరు, 9491478884

-గజానన్ తామన్
9440211285

# నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి

**'అమ్మ'ను మించిన దైవం, 'అమ్మనుడి'ని మించిన నుడి లేదని ఘనంగా, హృదయస్పర్శిగా, తర్క సంగతంగా ఉద్ఘోషించే శ్రీ మణీలాల్ పటేల్ గుజరాతీ రచన నా యీ లేఖావళికి మహత్ప్రేరణ. ఏ అర్థంలోనూ ఇది అనువాదం కాదు. అలాగని, ఆ రచనను చదవకుండా ఈమాత్రం వ్రాయగలిగానని చెప్పడం సత్యదూరమవుతుంది. వర్ధమాన తెలుగు భాషోద్యమానికి 'చంద్రుని కొసగే నూలు పోగు' చందాన నా ఈ లేఖావళిని సమర్పిస్తున్నాను. ఈ లేఖలను అందుకొనబోయే నిగమశర్మ తెనాలివారి నిగమశర్మ కాదు. ఉన్నత సంస్కారం గల కుటుంబంలో జన్మించి, ఉత్తమ సంస్కారాలను అలవరచుకొన్న వ్యక్తి. తెలుగు భాషాభిమాని.**

తమ్మిచెరువు వీధి, మంత్రపురి.
రథసప్తమి

ప్రియమైన తమ్ముడు చి॥ నిగమశర్మకు

ఆశీర్వదిస్తూ అక్క నిర్మల వ్రాస్తున్న జాబు.

ఉభయకుశలోపరి.

ఎన్నో రోజుల నుండి నీకు వ్రాయాలని మనసులో వున్నా వీలు పడనందుకుగల కారణాలు కొల్లలు. అవన్నీ ఏకరువుపెట్టి నిన్ను విసిగించకుండా ఒకటి రెండు మాత్రమే ఇక్కడ వివరిస్తాను. మొదటి చిక్కు – పిల్లల పరీక్షలు. ఇక రెండవది – మీ బావగారు నీటిపారుదల శాఖ డెప్యూటీ ఇంజనీరుగా ఉద్యోగ బాధ్యతల నిర్వహణ దృష్ట్యా నెలరోజులకు పైగా మంత్రపురి సమీపంలోని సుందిళ్ళ గ్రామంలో మకాం వేసి యున్నారు. అక్కడ గోదావరి నదిపై బ్యారేజీ నిర్మిస్తున్నారన్న విషయాన్ని టి.వి.లేక వార్తాపత్రికల ద్వారా తెలిసికొనియే ఉంటావు. అస్తు!

ఇపుడిప్పుడే ఆమని చేలాంచలం ప్రకృతిపై, జన నివాసాలైన పల్లీపత్తనాలపై హుందాగా రెపరెపలాడుతున్నది. ఊరి పొలిమేరల్లోగల నల్లరేగడులలో రైతు బాంధవులు శనిగెలూ, గోధుమలు విత్తడంలో క్షణంపాటు తీరిక లేకుండా ఉన్నారు. వివాహాలకు వలసిన సుముహూర్తాలు కొన్ని ఉన్నందున, ఈడొచ్చిన అమ్మాయిల్ని ఓ ఇంటివాళ్ళను చేయగోరే తలిదండ్రులు 'పట్టు' 'పసిడి' కొనుగోలులో మునిగి తేలుతున్నారు.

కవులకు ప్రీతిపాత్రమైన అందాలను ఏమని వర్ణించను? నన్ను అన్ని విధాలా ఆకట్టుకొనే ఋతువు ఆమని. ఈ ఋతువును సంస్కృత కవులు మధుమాసం అంటారు. అయితే వర్ష శరత్తులు ఉపేక్షితవ్యాలు కావు. ఆంగ్ల మహాకవి కీట్స్ అన్నట్లు 'శిశిర శోభలు' వసంత శోభలకు తీసిపోవు. మహాకవి ఆవంత్స సోమసుందరంలా 'ఆమ్రపర్ణి' వంటి ఉత్తమ కావ్యాన్ని తెలుగు సాహిత్య జగత్తుకు అందించలేను. ఆమ్రపర్ణి అంటే మామిడి. పుష్పించిన మామిడే వసంత ఋతువు ఆగమనాన్ని లోకానికి చాటుతుంది.

నీవు రకరకాల పక్షి, వృక్ష జాతులను గురించి చెబుతూ పారవశ్యంలో మునిగిన క్షణాలను ఈవేళ గుర్తుకు తెచ్చుకుంటున్నాను. నా మట్టుకు నాకు కుహుకుహు రాగాల కోకిలమ్మలే కాదు అన్య జాతికి చెందినవీ నా మనస్సుని దోచేవే! చిలుకలూ, గోరింకలు, పారావతాలు చివరకు గబ్బిలాలు కూడా! దేవులపల్లివారి 'ఎందుకే నీకింత తొందర' అనే గీతాన్ని స్నానగదిలో తరుచుగా పాడుకొంటాను. పంజరపు బ్రతుకు ముగిసి నీలాల నింగికి ఎగిరిపోతానన్న నలనీషను అభివ్యక్తం చేసే గీతం ఇది. 'నా కవితలు దయా పారావతాలు' అన్న బాలగంగాధర తిలక్‌ని ఎలా మరువగలం? కాళిదాసుడు తన సందేశాన్ని ప్రియురాలికి చేరవేసేందుకు మేఘాన్ని ఎంచుకుంటే మన జాషువాకవి దీనుల వ్యధను శివునకు విన్నవించేందుకు దూతగా 'గబ్బిలాన్ని' నియమించుకొన్నారు.

విహంగ తతుల గురించి ఋతువుల గురించి కవులు గానం చేసిన రచనలు తెలుగులో లెక్కకు మించి ఉన్నవి. ఎన్నో మనకు తెలుగు పాఠ్య పుస్తకాలలో సాక్షాత్కరిస్తాయి. పక్షుల మాట చెప్పుకొన్నాక ఋతువుల మాట ఎత్తుకోవాలి. 'ఈ జంట నగరాలు, హేమంత శిశిరాలు' చెప్పుకోదగ్గ సాహితీ కృతి. దీని రచయిత ఉత్పలవారు. పనిగట్టుకొని కొన్నింటినైనా చదువు. తెలుగు సాహిత్య వైభవాన్ని ఆకలనం చేసుకొనటానికి తోడుపడతాయి.

ఇక హంసలు– నీవూ నేనూ ఏనాడూ చూడనివి. మానస సరోవర ప్రాంతంలో విహరించే విహంగాలని పెద్దలు చెబుతారు. నానా అగచాట్లుపడి అక్కడికి వెళ్ళేకన్న శ్రీనాథ విరచిత శృంగార నైషధాన్ని విప్పి చూడు. నలదమయంతుల మధ్య దౌత్యం నెరపిన హంస నీ ఎదుట నిలుస్తుంది. అది మనం నిత్యం చూసే పక్షి కాదు. చదలేటి బంగారు జలరుహంబుల తూండ్లు దాని మేత. శారద ఆ హంసకు సహాధ్యాయిని. బ్రహ్మదేవుని రథానికి పూన్చబడిన వారువము. ఎంత గొప్ప సీసపద్యం! ఇలాటి పద్యాలు ఎన్నో ఉన్నాయి 'నైషధం'లో. ఆ పద్యాలలోని తూగును గమనించావా? లాక్షణికులు చెప్పే పద లాలిత్యాన్ని, అర్థ గౌరవాన్ని పసిగట్టావా? సీసపద్యాలంటే శ్రీనాథునివే! నాన్నగారు ఇచ్చే పాకెట్‌మనీలోని కొంతభాగాన్ని 'ఎమెస్కో' వారు ప్రచురించే తెలుగు ప్రబంధాల్ని కొనడానికి వెచ్చించు. తీరుబడిగా చదువుకొందువుగాని.

ఇంతగా ఎందుకు చెబుతున్నానంటే మన తెలుగువాళ్ళకు పుస్తకాలను కొని చదివే అలవాటు అంతంత మాత్రమే! వార్తాపత్రికలకే పక్కింటి వారి తలుపు తట్టుతారు. ఇలాంటి విషమ పరిస్థితిలో విశ్వకోశాలు, నిఘంటువులు ఎలా పుట్టుకొస్తాయి? ఏ పద్యాన్నయినా,

గేయాన్నయినా పారడీగా మలచగల జలరుక్ శాస్త్రిగారి నేర్పు నాలో కొరవడినా, ఈవేళ రాయప్రోలువారి 'దేశభక్తి' గేయాన్ని వదలిపెట్టను.

ఏదేశ మేగినా ఎందుకాలిడినా
ఎలుగెత్తి చాటు నీ తెలుగు వైభవము.

మన తెలుగునకు రెండువేల సంవత్సరాల చరిత్ర ఉంది. అరవలు పలుమారులు అడ్డుపడినా ప్రాచీన భాషగా (classical) ఇటీవల గుర్తింపు పొందింది. వ్యాసభారతాన్ని తెలిగించవలెనని రాజరాజ నరేంద్రుడు కోరగానే మన నన్నయ అందుకు పూనుకొన్నాడు. ఆయన రచన అనుసృజన తప్ప మాతృకావిధేయం కాదు. వ్యాసభారతాన్ని అన్యభాషాకవులు అనువదించారు. నన్నయ అక్షర రమ్యత వారి రచనల్లో ఈషణ్మాత్రమైనా అనుభూతికి రాదు. మహాకావ్య నిర్మితికి రాచబాట ఏర్పర్చిన నన్నయ తెలుగు భాషను వ్యాకరణబద్ధం చేసి స్థిరరూపాన్ని ప్రసాదించాడు. ఆయన కావ్యాన్ని చదివి అర్థం చేసుకొనటానికి ఏ మల్లీనాథుడు అవసరం లేదు. ఆంగ్లం లోని చాసర్ పదవ శతాబ్దపు భాష ఇప్పటివారి ఆకలన పరిధిలో లేదు. మరాఠీ జ్ఞానేశ్వరి అంతే! నన్నయకు పూర్వం పెద్దగా తెలుగులో సాహిత్య నిర్మితి కాకపోయినా, ప్రభువులు శిలా శాసనాల్లో తరువోజలు, మధ్యాక్కరలు, కందపద్యాలు మనల్ని పలుకరిస్తవి.

ఇంతటి ఘనమైన చరిత్రగల మన మాతృభాష సమీప భవిష్యత్తులో అంతర్ధానమయ్యే భాషల జాబితాకెక్కినదని యునెస్కో హెచ్చరించినప్పుడు ఏ తెలుగు భాషి మౌనధారణ వహిస్తాడు? ఈ విషాదాంతికకు కారణాలను కారకులకు శోధించటం కష్టమైన పనికాదు.

ఈజాబు వ్రాయటంలో ముఖ్యహేతువు నీకు నా హార్దిక అభినందనలను తెలపటానికే! ఎందుకని నీవు అంటావేమో? నీవు ఇంటర్ ఎం.పి.సి చదవటానికి నీ మాతృభాషయైన తెలుగును మాధ్యమంగా ఎన్నుకొన్నందుకు! ఈ నీ నిర్ణయం నిజానికి సాహసోపేతమైనదే! మన వాళ్ళకు ఆంగ్లభాషలో విద్యాబోధన అంటే ఎనలేని మోజు. లక్షలు కుమ్మరించి పిల్లల్ని కార్పొరేటు విద్యాలయాల్లో చేర్పిస్తారు. నిన్ను, నీబోటివారిని ప్రతీపవాదులుగా గణించినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఈనాటి నవ్యోక్తి 'ఉత్తమం ఆంగ్లం- మధ్యమం తెలుగు'. 'నర్సరీ రైమ్స్' పిల్లలచే వల్లె వేయిస్తూ మన గురజాడ, శ్రీశ్రీలకు దూరం చేస్తున్నారు. 'మమ్మీ డాడీలు' 'అమ్మ', 'నాన్న' స్థానాన్ని ఆక్రమించాయి.

మాతృభాషలో విద్యాభ్యాసం చేయటం వల్ల విద్యార్థి కల్పన తర్క శక్తులు వికసిస్తాయి. మాతృస్తన్యం గ్రోలు దశలోనే వ్యక్తి భాషాభ్యాసం మొదలవుతుంది. మొదట పదాలు, ఆ తరువాత చిన్నచిన్న వాక్యాలు నిర్మించే క్షమత అలవడుతుంది. తలిదండ్రులనుంచి, ఇరుగు పొరుగుల నుంచి, బంధుమిత్రుల నుంచి చివరకు బృహత్ సమాజం నుంచి ఎనలేని ప్రావీణ్యాన్ని సంపాదించి జనాదరణ కల్గిన ఒక వక్తగా వ్యక్తి ఎదుగుతాడు. న్యాయవాదికి, ఆచార్యులకు, రాజకీయులకు వక్తృత్వ సామర్థ్యం ఎంతైనా అవసరం. ఎన్నేళ్లు చదివినా ఏ కొందరికో తప్ప ఆంగ్లంపై పట్టు ఏర్పడదు. ఎల్లప్పుడూ హుందాగా ఉండే భారతీయులు ఆంగ్లం మాట్లాడే సందర్భాలలో విదూషకులుగా మారిపోతారు! ఇది ఆంగ్లకవి విలియమ్ బట్లర్ ఏట్స్ అన్నమాట.

విశ్వకవి రవీంద్రులు, జాతిపిత బాపూజీ మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని మరీమరీ చెప్పారు- గాంధీజీకి ఆంగ్లంపై ప్రభుత లేక కాదు. అయినా ఆయన స్వీయ ఆత్మకథను మాతృభాషయైన గుజరాతీలోనే వ్రాసి పలువురి ప్రశంసలందుకొన్నారు. రవీంద్రులు తన గీతాంజలిని ఆంగ్లంలోనికి అనువదించారు. బెంగాలీ మాతృకలోని గేయానికి గల శబ్ద సౌందర్యం లయాత్మకత అనువాదంలో లోపించి ఈ అనువాదాన్ని చదివి ఆంగ్లకవి ఏట్స్ పెదవి విరిచారు.

తస్మాత్! విద్యార్థి ఆంగ్లాన్ని మాధ్యమంగా ఎన్నుకొన్న పక్షంలో విజ్ఞానార్జన అటుంచి సాంస్కృతిక మూలాన్ని కోలుపోతాడు. రెంటికి చెడ్డరేవడ అవుతాడు. భూదివుల మధ్య వేలాడే త్రిశంకువు అవుతాడు. అప్పయ్య దీక్షితులవారు తెలుగువాడిగా పుట్టడం గతజన్మలోని పుణ్యఫలంగా భావించారు. 'దేశభాషలందు తెలుగు లెస్స'. ఈమాట ఎవరో కాదు. తెలుగు కవుల పాలిట కల్పతరువైన కృష్ణరాయలవారే సెలవిచ్చారు.

ఈ లేఖ ఇంత పొడువైనది అవుతుందని మొదలెట్టేటప్పుడు అనుకోలేదు. నీవు బహు సహనశీలివి. నీ సహనాన్ని పరీక్షకు పెట్టటం సభ్యసమాజంలో క్షంతవ్యం అనిపించుకోదు.

మన భాషను గురించిన మరికొన్ని విశేషాలను ఇంకో జాబులో వ్రాస్తాను.

ప్రేమతో,

సెలవా మరి!

నీ అక్క....నిర్మల

కవిత

# కవి-కవిత

-దాసరాజు రామారావు
96182 24503

పోస్టుల ఆహ్వానపత్రం
పండగొచ్చి, పలకరించినట్టు-
ఒక యోధుడినై
యుద్ధంల గెలవాలనుకోలేదు
యుద్ధం చేస్తే చాలు
అక్షర ప్రేమ వెల్లివిరిస్తే మేలనుకున్న

మిత్రులకు విన్నపాల మెసేజ్‌ల ప్రవాహం

ప్రయాణిస్తున్న
ముందే చేరిపోయిన మనసు
సభాప్రాంగణం
భోజరాజ కొలువుకూటం
కవిత్వం పరవళ్లు తొక్కుతున్నది

ఒక్కొక్కరు వేదిక నెక్కి
మేఘాన్ని విప్పి, జల్లు కురిపిస్తున్నరు
ప్రచండ భాస్కరుణ్ణి, రువ్వుతున్నరు
కరతాళ ధ్వనులు, గుండె లయలు
భావోద్వేగ సంరంభం

నా వంతు వచ్చింది
సహజాత్మకంగా
నా 'ఊరిగోస' చదివిన
నిశ్శబ్దాతి నిశ్శబ్దం

కవిత బాగా రాలేదా
అనుమానం..ఓడిపోయానా..

రెండ్రోజులకి
పేపర్లో నా ఫోటో,
నా కవితకి మొదటి బహుమతి
మైమరపించిన సన్మానం

దండా, శాలువా, మెమెంటో, చెక్కు
నా ఊరికి ఇచ్చిన
కవితనూ అంకితం చేసిన

ఊరిల
కదలిక మొదలయిందని
తెలిసింది ....

2015లో డెట్రాయిట్(అమెరికా)లో జరిగిన 'తానా' సభల సందర్భంగా వారి తరపున డెట్రాయిట్ తెలుగు సాహితీసంఘం(డి.టి.ఎస్.సి) నిర్వహించిన రచనల పోటీలో మూడవబహుమతి పొందిన రచన.

# స్త్రీ పాత్ర యొక్క ప్రస్థానం - నూరేండ్ల తెలుగు కథ

-పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మి



**సం**గీత సాహిత్యాలకు పుట్టినిల్లు,పెట్టినిల్లు అయిన విజయనగరంలో సాహిత్యరత్నాలైన పెద్దాడ సుబ్బారావు, కామేశ్వరీ దంపతుల ప్రథమ సంతానం. విజయనగర సాహితీ పరిమళాల ప్రభావం మరియు తల్లిదండ్రులనుండి వారసత్వంగా, బాల్యము నుండీ సంగీత, సాహిత్యాలపై మక్కువ ఎక్కువే. అందుకే పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే విజయనగరం సంగీత కళాశాలనుండీ వీణలో సర్టిఫికెట్‌కోర్సు, వక్తృత్వ వ్యాసరచన పోటీలలో జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఎప్పుడూ ప్రథమ స్థానమే. 1997 అం.ప్ర. ప్రభుత్వ రాష్ట్ర స్థాయి జన్మభూమి వక్తృత్వ పోటీలలో బంగారుపతక విజేత.

**విద్యాభ్యాసం:** బి.ఫార్మసీ(విశ్వవిద్యాలయ టాప్ ర్యాంకర్) పి.జి.(బయోఇన్ఫర్మేటిక్స్, బెంగుళూరు) ఉద్యోగం: క్వింటైల్స్, బెంగళూరు. సంగీత సాహిత్యాలలో నా వ్యవధినంతా గడిపి పరమావధిని చేరుకోవాలనే సదుద్దేశ్యంతో ఉద్యోగాన్ని విరమించి, ప్రస్తుత నివాసం అయిన హైదరాబాద్‌లో (తెలుగు విశ్వవిద్యాలయం) ఉండి కర్ణాటక సంగీతంలో బి.ఏ చేస్తున్నాను.

**వృత్తి:** గృహిణిని, వివాహం తర్వాత కూడా నిర్విరామంగా సంగీత, సాహిత్యాభ్యాసాలను ప్రోత్సహిస్తున్న సంగీత, సాహితీప్రియులు, సహృదయులు అయిన ముక్కామల శ్రీకృష్ణ గారి అర్ధాంగిని. ముగ్గురు పిల్లల తల్లిని.

**ప్రవృత్తి:** అచ్చంగా తెలుగు వంటి అంతర్జాల మాస పత్రికలకు సంగీతంపై వ్యాసాలు, హాస్యకథలు, లఘుకథలు రాయడం, కర్ణాటిక్ ఇండియా డాట్‌కాం వెబ్‌సైటుకు వ్యాసాలు రాయడం మరియు సంగీతసాధన, సాహిత్య పఠన.

**తె**లుగు సాహిత్యంలో కావ్యాలు, కథలు, కవితలు, నవలలు, కథానికలు మొదలైన చాలా ప్రక్రియలు ఉన్నాయి. నేను కథ అనే సాహితీ ప్రక్రియను విశ్లేషిస్తూ నా వ్యాసాన్ని సమర్పిస్తున్నాను. తెలుగు కథ ఆరంభమై సుమారుగా నూరుసంవత్సరాలు అగుచున్నది. ఈ నూరు సంవత్సరాలలో వచ్చిన ప్రతీ కథని విస్తృతంగా విశ్లేషించడం అసాధ్యం, కావున ఈ నూరుసంవత్సరాల (1902-2015) కాలంలో వివిధ రచయితలచే రచింపబడిన కొన్ని కథలను ఎంచుకుని వాటిలోని స్త్రీ పాత్రల విశ్లేషణ ద్వారా కథ అనే తెలుగు సాహితీ ప్రక్రియలో "స్త్రీల పాత్రల స్వభావ పరిణామాన్ని" సమగ్రంగా సమర్పించే ప్రయత్నం చేస్తున్నాను.

ఈ ప్రయత్నంలో నేను కథకుని/కథకురాలికంటే కథా విశ్లేషణకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను, ఎందుకంటే ఈ వ్యాసరచన ముఖ్య ఉద్దేశ్యం కూడా అదే కాబట్టి. నేను ఎంచుకున్న కథలు ఈ నూరు సంవత్సరాల కాలాన్ని ప్రతిబింబించేలా ఎంచుకున్నాను. ఉదా: 1902లో హిందూ సుందరి పత్రికలో వచ్చిన బండారు అచ్చమాంబ గారి "దంపతుల ప్రథమ కలహం"నుండీ ఈ దశాబ్దపు కథకులైన ముదిగంటి సుజాతా రెడ్డి, కాసుల ప్రతాప్ రెడ్డి వంటి వారు రాసిన కథల వరకూ మొత్తం నూరు సంవత్సరాల కాలం ప్రతిబింబించేలా కథలను ఎంచుకున్నాను. ఈ నూరు సంవత్సరాలలో దాదాపుగా వచ్చిన అన్ని కథలు సమకాలీన, సామాజిక, రాజకీయ పరిస్థితులను, ఉద్యమాలను, ఆచారవ్యవహారాలను ప్రతిబింబిస్తూ వచ్చాయి. వేరు వేరు సాహిత్యవాదాలకు, సిద్ధాంతాలకు అద్దం పట్టాయి. ఆయా కాలానుగుణంగా ఆచారవ్యవహారాలకు తగినట్లుగా పాత్రల చిత్రీకరణ, పాత్ర స్వభావాలలో పరిణామం కేవలం ఆ కథలలోని పాత్రలకే పరిమితంకాక సమకాలీన సమాజంలోని స్త్రీలపై కూడా ఎలాంటి ప్రభావాన్ని చూపించాయో వారి జీవితాలని ఆ పాత్రలు ఎలా ప్రభావితం చేసాయో కూడా విశ్లేషించే ప్రయత్నం చేసాను. స్త్రీల పాత్రల **సృష్టీకరణను** మూడు దశలుగా విభజించుకొనిన మొదటి దశలో స్త్రీ "తండ్రి చాటు బిడ్డగానో, భర్త చాటు భార్యగానో, కొడుకు సంరక్షణలో జీవితం ముగించే వృద్ధ మాతగానో "సృష్టించబడింది. అసలు ఆరోజుల్లో జీవితాన్నిగానీ, జీవన విధానాన్ని కానీ తనకు తానుగా నిర్దేశించుకునే స్వాతంత్ర్యం కూడా లేక ఒకరి పెద్దరికానికో లేక ఒకరి కట్టుబాట్లకో లేదా ఓ వెర్రి ఆచారానికో బలి కావటమే పరమావధిగా ఉండేది.

రెండవ దశలో చిత్రీకరించిన స్త్రీ పాత్రలు తమలోతాము చూసుకుంటూ, తమ చుట్టూఉన్న సమకాలీన సమాజంలో, కుటుంబంలో ఉన్న వివక్షతను గమనించినా వాటిని ఓర్పుగా సహించడం, భరించడం చూస్తాము. మొదటి దశ కన్నా ఇవి నయమే ఎందుకంటే మొదటి దశలోని పాత్రలు కనీసం ఆత్మ విమర్శకి కూడా నోచుకోనివి. ఇక మూడవ దశలో సృష్టించబడిన పాత్రలు తమపై అణచివేతలను ప్రశ్నించడం, ప్రతిఘటించడం, వివక్షల్ని తిరస్కరించడం విముక్తి దశగా పోరాడడం, చైతన్యంతో ముందుకెళ్ళడం కనబరిచాయి. అయితే అన్ని కాలాలలోని - అనగా అచ్చమాంబ, గుడిపాటి వేంకటాచలం, తిలక్, ఛాయాదేవి, ఓల్గా, సీతాదేవి, సరస్వతీదేవి నుండీ నేటి సుజాతా రెడ్డి, చాసో, తులసి, సత్యాగ్ని మొదలగు అందరి రచయితల కలాల నుండీ సృష్టించబడిన అన్ని పాత్రలు పైన వివరించబడిన ఏదో ఒకదశలో ఇమడగలగడం నేను గమనించాను. ఎందుకంటే రచయిత ప్రాచీనుడైనా అతని/ఆమె

భావాలు ఆధునికతను నింపుకుని ఉంటే వారు ఆకాలంలో కూడా ఎవరూ ఊహించని విధంగా ఒక పాత్రస్వభావంలో మార్పులను చేస్తూ ఆ పాత్రని ఒక ఆదర్శప్రాయమైన పాత్రగా మలచగలిగినారు. ఉదా:1902లో హిందూ సుందరి పత్రికలో ప్రచురితమైన బండారు అచ్చమాంబ (1874 –1905) గారి తొలి తెలుగు కథ "దంపతుల ప్రథమ కలహం" శీర్షికపై అభిప్రాయాన్ని బలపరుస్తుంది. అసలు భర్త ఎదుట నించుని మాట్లాడడానికి కూడా ధైర్యంలేని ఆరోజుల్లో కలహాలెక్కడనుంచి వస్తాయనుకోవచ్చు, కానీ ఆవిడ కథా ప్రారంభమే ఇలాచేసారు. "నేను పెళ్ళాడిన భార్యను కానీ దాసీను కాను. వివాహమాడుట వలన భర్తకు దాసీని అగునా ఏమి" అన్న లలిత పాత్ర ప్రశ్నతో కథ ప్రారంభం అవుతుంది. ఏ కాలంలో అయినా భార్య చరణదాసి కాదు హృదయ నివాసి అన్న మాటను పై వాక్యాల ద్వారా బలపరిచారామె. భార్యాభర్తల సమానత్వానికై చర్చించు కుంటున్న ఈ రోజుల్లో "సమానత్వం ఎప్పుడూ ఉంది" అని బలపరిచే వాక్యమిది. లలిత పాత్రకు అమ్మమ్మ అయిన పార్వతమ్మ ద్వారా "భార్య భర్త దగ్గర వినయవిధేయతలు గలిగి ఉండాలి గానీ విసుగు కోపము కలిగించి భర్త దేశాంతరము పోయే పరిస్థితులు తీసుకు రాకూడదనియూ, అలాంటి పరిస్థితికి ఆమెయే ఉదాహరణ అని ఆమె పశ్చాతాపము చెందడం అమ్మమ్మ పశ్చాత్తాపం లలితలో మార్పు తీసుకురావడం మనం గమనించగలము." ఇక ఆధునిక తెలుగు సాహితీ యుగకర్త గురజాడ (1861–1915) తన దిద్దుబాటు (1910) కథ ద్వారా పొరపాటుని దిద్దుకోమని హితబోధ చేసారు. ఈ కథలో కమలిని పాత్ర తప్పుచేస్తున్న భర్తను సరిదిద్దుకున్న తీరు సర్వదా ప్రసంశనీయం. చపలచిత్తుడైన మగవాడు తప్పు చెయ్యడం సహజమే కానీ అది రచ్చకెక్కకుండా దిద్దుకోవడం అడదాని నైపుణ్యం అని కమలిని పాత్ర స్పష్టంచేసింది. జీవితమనే కాగితంలో తప్పు లుండడం సహజం, అవి ఉంటే దిద్దుకోండి కానీ చించుకోకండి అని ఆ ఆధునిక సాహిత్య యుగకర్త చెప్పిన మాటలు నేటి యువ తరానికి ఎంతైనా అవసరం మరి.

ఇక చలంగా పేరుగాంచిన శ్రీ గుడిపాటి వేంకటాచలం (1894–1979)తన "శేషమ్మ"(1936) కథలో శేషమ్మ పాత్రద్వారా ఆనాటి వితంతువుల జీవితాలు ఎంత దయనీయంగా ఉండేవో వర్ణించారు "శేషమ్మకి ఈలోకంలో ఏమాత్రమూ అందము ఆనందము కన బడటం మానేసి 30ఏళ్ళు అయ్యింది. పిట్టల కూతలు, పిల్లల నవ్వులు ఆమెని ఇరిటేట్ చేస్తున్నాయి, ఇతరులు పాడుతూ ఉంటే ఆమెకు బాధగా ఉంది" అన్న మాటలు ఆమె మానసిక అస్వస్థతను తెలియ జేస్తాయి. భగవంతుని సృష్టిలో ఎంతో అందమైన ప్రకృతిని కూడా మోడుబారిపోయి, చాకిరీకే పరిమితమై, అందాలని కూడా చూడలేని కళ్ళున్న అంధురాలైంది. అది పాటనీ, పసిపాప నవ్వనీ ఆమెకు తెలుసు అంటే ఆమెకు మెదడు ఉంది కానీ దానికి జ్ఞానం ఇవ్వాలి, ఆమెకు హృదయం ఉంది దానికి అనుభవం ఇవ్వాలి అంటూ స్త్రీని అర్థం చేసుకొండీ అంటూ ప్రాధేయ పడ్డాడు.

ఇక కొ.కుగా ప్రసిద్ధి గాంచిన కొడవగంటి కుటుంబరావు గారు(1909–1980) తన "స్వేచ్ఛ"(1945) కథలో స్త్రీకి స్వేచ్ఛ ఎంత అవసరమో చక్కగా తెలియచెప్పారు. 1945 లోని రోజుల్లో స్వేచ్ఛని వ్యక్తీకరించే కనీస స్వేచ్ఛలేని స్త్రీ మానసిక సంఘర్షణ– పేరు కూడా పెట్టని "వదిన" పాత్రలో ప్రతిబింబించారు. "తప్పో ఒప్పో అంతరాత్మను అనుసరించడం కన్నా ఉత్తమమైన ఆదర్శం ఏమిటి??" అని ఆ పాత్ర చేత ప్రశ్నింపచేసి అంతరాత్మని చంపుకు బ్రతుకుతున్న ఆనాటి స్త్రీలెందరినో ఈ పాత్ర ద్వారా తట్టి లేపగలిగారు. "బాధ అనుభవిస్తే ఆనందం వల్ల కలిగే బాధనే అనుభవించాలి" అని తన శారీరిక వాంఛకి తప్ప ఇంక ఎన్నడూ కనీసం తనను మనిషిగా కూడా చూడని భర్త దగ్గరనుండీ బయటికి వచ్చి, ఇంకొక వ్యక్తిని పెళ్ళి చేసుకున్నప్పుడు ఆ కాలంలో భర్తని వదిలి వచ్చినందుకు నలుగురూ అంటున్న మాటలకు కలిగిన బాధని, ఆ భర్తనుండీ బయటపడి ఇంకొక వ్యక్తిని పెళ్ళిచేసుకున్నందుకు కలిగిన ఆనందాన్ని వ్యక్త పరచడానికి ఆపాత్ర చేత పైమాటలు అనిపించారు శ్రీ కొ.కు "ఈ పని చెయ్యడం వల్ల నేను పొందగలిగినదల్లా కేవలం స్వేచ్ఛ" అన్న ముక్తాయింపు ఆమె స్వేచ్ఛని ప్రాణంకన్నా ఎక్కువగా కోరు కుంటుందన్న నిజాన్ని ధృవీకరించింది. బహుశా స్వేచ్ఛా విహంగాల్లా ఉండాలనుకునే ఎంతోమంది స్త్రీలు ఈ పాత్రవల్ల ప్రభావితులై తమ దాస్య శృంఖలాలు తెంచుకున్నారో కదా.

ఇక విముక్తి (1980) కథ ద్వారా శ్రీ నెల్లూరి కేశవస్వామి (1920–1984) నవాబుల జుగుప్సాకరమైన ఆచారాలకీ నికృష్టాలకీ అమాయకులైన ఆడ పిల్లలు ఎలా బలి అయినారో కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. నవాబుల కామవాంఛకు సుగంధపుష్పాల వంటి ఆ కన్నెపిల్లల భవిష్యత్తులు మొగ్గలలోనే తుంచబడ్డాయని సిరాజ్, మీర్జా వంటి పాత్రలద్వారా యెద్దేవా చేసినా, నవాబులలో కూడా మాన వత్వం నిండిన మనుషులున్నారని సుల్తాన్ పాత్ర షీర్ అనే దాసిని పెళ్ళి చేసుకోవడంలో నిరూపించారు. మరి అబ్బూరి ఛాయాదేవి (1933) తన కథ 'స్పర్శ' (1989)లో ఆడపిల్లలని వెర్రి కట్టుబాటులనే వలయాలలో పెంచితే వారికి కన్నవారిపై వాత్సల్యం ఎలా కలుగు తుందని ఆలోచింపజేసారు. ఎనభై ఏళ్ళు పైబడ్డ అనారోగ్యపు తండ్రి మంచానికి దూరంగా కూర్చున్న యాభై ఏళ్ళ కూతురిని "అంత దూరంగా ఎందుకు? ఇలా వచ్చి కూర్చోమ్మా" అనడం వాళ్ళ మధ్య గల దూరాన్ని చాల దగ్గరగా తెలియచేస్తుంది. ఆడ, మగ మధ్య వివక్ష చూపించే తల్లితండ్రులున్న ఆ కాలంలో మగపిల్లాడి బాగోగుల కోసం జీవిత కాలం తపించిన తండ్రికి చెట్టంత కొడుకు పోతే ఎంత బాధ? కానీ అలాంటి సమయంలో "నాన్న పొదివి పట్టుకుని నేను ఉన్నాను మీరు ఏడవద్దు అని చెప్పాలని ఉంది కానీ ఆయనను స్పృశించడానికే బెదురు. ఆయన పెంచిన పెంపకం అలాంటిది" అని తండ్రి దగ్గర చనువులేని కూతురు పడే క్షోభ, ఆవేదన కూతురి పాత్ర ద్వారా ఆవిష్కరింపచేసారు ఛాయాదేవి.

సత్యాగ్నిగా పేరుపొందిన షేక్ హుసేన్ (1940) తన ముతా (1989) కథలో ముతా అనే మహమ్మదీయ ఆచారం పేరుతో బంగారు కలలు కంటున్న ఆడపిల్లల జీవితాలు ఎలా కల్లలుగానే మిగిలి పోతున్నయో తెలియజేసారు. కేవలం ధనికుల విలాసాలు తీర్చుకోవడానికి మసలుతున్న ముతా ఖురాన్లో లేదనీ, ముహమ్మద్ ప్రవక్త కొన్నికారణాల వల్ల దీన్ని ప్రవేశ పెట్టినా ఇది ఇస్లాం ధర్మం కాదనీ, ఇది ఇస్లాంలో పూర్తిగా నిషిద్ధమనీ, ఈ విషయం ప్రవక్తే స్వయంగా చెప్పినారనీ "మరియంబీ"పాత్ర ద్వారా ధైర్యంగా చెప్ప గలిగిన సత్యాగ్నిగారు నిప్పులాంటి నిజాన్ని లోకానికి నిర్భయంగా

తెలియజేసారు. అంతే కాదు ఈ ముతాలో చిక్కుకోకుండా తమ ఇచ్ఛానుసారంగా ధైర్యంగా జీవించే హక్కు మహమ్మదీయ కుటుంబాల్లో పుట్టిన ప్రతి ఆడపిల్లకీ ఉందని "ప్రేమాభిమానాలు బజారులో అమ్మే వస్తువులు కాదని, అవి సహజంగా మనసులో ఉండాలనీ" హబీబ్ పాత్ర ద్వారా చెప్పించి, ప్రేమించే హక్కు ప్రతీ ఆడపిల్లకీ ఉందని నొక్కి వక్కాణించారు.

ఇలాగే డి.కామేశ్వరిగారు నేటితరం ఆడవారు ఉద్యోగం చెయ్యాలంటే భర్త సహాయ సహకారాలు తప్పనిసరిగా ఉండాలని తన "చన్నీళ్ళు" (1997) కథలోని రేవతి పాత్ర ద్వారా చెప్పినారు. స్త్రీ ఉద్యోగ ఆదాయాన్ని చన్నీళ్ళుగా భావన చేసి, పురుషుడి ఆదాయాన్ని వేన్నీళ్ళుగా భావన చేసే పురుషాధిక్యత ప్రపంచం స్త్రీ ఆదాయాన్ని "వేన్నీళ్ళకు చన్నీళ్ళు" అనడం ఓ ఆచారంగా ఉంటూ వచ్చేది. "వేన్నీళ్ళలోనే చన్నీళ్ళు కలపనక్ఖర్లేదు, చన్నీళ్ళలో కూడా వేన్నీళ్ళు కలపచ్చు అని అర్థం చేసుకుంటే బావుంటుంది. కలపకపోయినా ఉత్తి చన్నీళ్ళు ఆరోగ్యానికి మంచిదని తెలుసుకోండి" అని రేవతి పాత్ర నేటి తరం ఆడవారికి ప్రతినిధిగా భార్యల ఉద్యోగాలు చిన్నవిగా చూసే భర్తలకు జ్ఞాన బోధలే మరి. స్వస్థి కథలోని (1996) సీతమ్మ పాత్రద్వార కె.వరలక్ష్మి (1950) జీవితం అంతా పేదరికాన్ని దిగమింగుతూ ఆచారి అయిన భర్తకి, గుడిలో రాముడికీ సేవ చేసి చేసి అలసి, సొలసి నిర్లిప్తత చెంది చివరికి ఆ జీవితంపై వెగటు చెంది "రాయిని తెచ్చి రాముడంటున్నామని, ఆ రాయిని గాలి వెలుతురూ లేని గుడిలో కూర్చుండబెట్టి సేవలు చెయ్యడం దేనికని" నిలదీయడం, భర్త తిడుతున్నా స్పందించక పోవడం, ఎంగిలి అంబలినే నైవేద్యంగా సమర్పించాలనుకునే స్థితికి దిగజారిపోవడం స్త్రీ నిర్లిప్తతకి పరాకాష్ఠలుగా అభివర్ణింపబడ్డాయి.

నేటి రచయిత్రులలో ఒకరైన ఓల్గా (1950) తన తోడు (1993) కథ ద్వారా భర్త లేకపోయినా ఆర్థిక సహాయం లేకపోయినా భార్య బ్రతకగలదు కానీ భార్యలేకపోతే డబ్బున్నా భర్త బ్రతకలేడని తేల్చి చెప్పారు. తన ఇష్టాలు, అభిరుచులు, తన శక్తులు తెలుసుకోలేని భర్త కాలం చేసాక సంగీతం నేర్చుకుంటూ, తన అభిరుచులు నెరవేర్చుకుంటూ, కాస్త విశ్రాంతి దొరికిందనుకునే విజయలక్ష్మి పాత్ర కాస్త ఆశ్చర్యపరిచినా ఆలోచింపచేస్తుంది కూడా. "అనాధనే మాట భర్త పోయిన ఆడవాళ్ళ విషయంలో నిజంకాదు, నిజమైన అనాధలు భార్య చనిపోయిన మగవాళ్ళే" అని గట్టిగా తనవాదాన్ని వినిపించారు ఓల్గా. ఆడదంటే ఇల్లు చక్కబెట్టి, వండిపెట్టి, మంచిచెడ్డలు చూడడానికే అయితే, ఆడది పనిమనిషా? లేక ఒక తోడా? అని ప్రతివాళ్ళ చేత ఆలోచింపచేసారు ఆమె. ఆమె ఆత్మాభిమానాన్ని గౌరవిస్తే, ఆమె మగవానికి ఒక్క చక్కనితోడు నిలువునీడ అవుతుందని, అలాకాక ఆమెని కేవలం చాకిరీకే ఉపయోగించుకుంటే దాసీనే అవుతుందని. తోడుకి, దాస్యానికీ ఉన్న సన్నని పొరను చాల విస్తృతంగా చెప్పించారు తన విజయలక్ష్మి పాత్రలో.

ఈ నూరేళ్ళ కథాసాహిత్యంలో ఎందరో రచయితలు, రచయిత్రులు స్త్రీ జీవితంలో దాదాపుగా అన్నిభావాలనీ ఆవిష్కరింపచేసారు. స్త్రీ పాత్రలని ఎలా సృష్టించినా, వాటివలన ఎలాంటి పరిణామాలకు సమాజం దారితీసినా స్త్రీ భగవంతుడు సృష్టించిన ఒక అక్షయ 'పాత్ర'. తన జననంతో పుట్టింటివారికి ఆనందాన్ని, మెట్టినింటికి మనువుతో గౌరవాన్ని, భర్తకి మనసునీ, మానాభిమాలనీ, కన్న మమకారానికి కేవలం కరుణను మాత్రమే ఇవ్వగల కారుణ్య మూర్తి, ఎనలేని కీర్తి అయిన స్త్రీ ఇవ్వడమే తెలిసిన అక్షయ"పాత్ర". ఇలా నిరంతరం తరతరాలుగా ఇవ్వడమే తప్ప పుచ్చుకోవడమే తెలియని స్త్రీ శక్తి స్వరూపిణీగా కొలవబడింది. అందుకే "ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు పూజలందుకుంటారు" అన్నది నిత్య సత్యం. అందుకే – నాతిని గౌరవిద్దాం, దేశదేశాలలో ఖ్యాతిని పొందుదాం.

## ఆహ్వానం

## కథానికతో ఓ సాయంత్రం

**'లేఖిని' మహిళా చైతన్య సాహితీ సాంస్కృతిక సంస్థ, శ్రీ త్యాగరాయ గానసభ సింహప్రసాద్ సాహితీ సమితి** ఆధ్వర్యంలో

త్యాగరాయగానసభ కళాసుబ్బారావు వేదిక, లలిత కళావేదికలలో ది. 14. 10.2017, సాయంత్రం 5గం. 30ని.

**శతజయంతి కథానికా రచయితల**
**(మా గోఖలే, చక్రవర్తి రంగస్వామి, సెట్టి ఈశ్వరరావు) సంస్మరణ**

**చక్రవర్తి రంగస్వామి కథానికలు**

ఆవిష్కరణ : **బి.ఎస్.రాములు**

బి.సి.కమిషన్ చైర్మన్, ప్రముఖ రచయిత

**మా కథలు–2016** (తెలుగు కథా రచయితల వేదిక ప్రచురణ)

ఆవిష్కరణ **డా॥సామల రమేష్‌బాబు** సంపాదకులు, అమ్మనుడి

**శతజయంతి రచయితల, గ్రంథాల పరిచయం**

శ్రీ సుధామ, ప్రముఖ కవి, రచయిత

**కథానికా సదస్సు**

నిర్వహణ: **శ్రీ విహారి,** ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

**ఆవిష్కరణలు–అంకితాలు–పురస్కారాల సభ**

**శ్రీ రావులపాటి సీతారాంరావు**

అధ్యక్షులు, ఆం.ప్ర.పోలీస్ హౌసింగ్ చైర్మన్

ముఖ్య అతిథి: **డా॥ కె.వి.రమణాచారి**

తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు

ఆత్మీయ అతిథులు: **కళా జనార్ధనమూర్తి,** అధ్యక్షులు, త్యాగరాయ గానసభ, **డా॥వాసా ప్రభావతి,** రచయిత్రి, కవయిత్రి, **యర్రంశెట్టి సాయి,** ప్రముఖ హాస్య రచయిత, **వి.ఉదయశంకర్,** ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్

**ఆవిష్కరణ గ్రంథాలు**

డా॥ వాసా ప్రభావతి నవల – భూత్‌బంంగళా, హనుమంతరావు కథానికల సంపుటి – సెల్లుఫోన్, వేదం సూర్యప్రకాశం – సూర్యస్పందన, వేదగిరి రాంబాబు – వ్యంగ్య కథానికలు

**వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం**

'టోపీ సబ్బార్' వేంపల్లి షరీఫ్ కథానికల సంపుటికి

**వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం**

శ్రీ దార్ల బుజ్జిబాబుకి.

–చలసాని నరేంద్ర
98495 69050

# దేశంలో భిన్నాభిప్రాయాలు పట్ల పెరుగుతున్న అసహనం

**గత కొంత కాలంగా దేశంలో తమ అభిప్రాయాలను ఒప్పుకోని వారి పట్ల, భిన్నాభిప్రాయాలు గలవారి పట్ల అసహనం పెరుగుతున్నది. ఇటువంటి అసహనం అనేక సందర్భాలలో హింసకు, దాడులకు కూడా దారితీస్తున్నది. ప్రముఖ పాత్రికేయురాలు, రచయిత్రి, మత సామరస్య వేదిక నాయకురాలు గౌరీ లంకేష్ (55) సెప్టెంబర్ 5 రాత్రి బెంగళూరులో దారుణ హత్యకు గురికావడం జాతీయ స్థాయిలో తీవ్ర కలవరం కలిగించింది. ఆ తరువాత త్రిపుర, పంజాబ్ వంటి చోట్ల కూడా పాత్రికేయులు హత్యలకు గురయ్యారు.**

మరోవంక గోహంతకులు అనే అనుమానంతో, గోరక్ష పేరుతో పలువురిపై అనేక చోట్ల దాడులు జరుగుతున్నాయి. కొందరు హత్యలకు గురవుతున్నారు. ఇటువంటి సంఘటనలు అదుపులోకి రాకపోతుండటం పట్ల స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న రాజకీయ పక్షాన్ని గాని, నాయకుడిని గాని విమర్శిస్తూ దేశంలో ఎక్కడ ఎవ్వరు ఎటువంటి సమావేశం జరుపతలపెట్టినా, నిరసనలు వ్యక్తం చేసే ప్రయత్నం చేసినా ఆంక్షలు విధిస్తున్నారు.

హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను తరలించడం కావచ్చు, ఆంధ్రప్రదేశ్‌లో ముద్రగడ పద్మనాభం పాదయాత్ర చేయడం కోసం విఫల ప్రయత్నాలు చేస్తూ ఉండటం కావచ్చు, పశ్చిమ బెంగాల్‌లో ఆర్ యస్ యస్ అధినేత డా. మోహన్ భగవత్ కార్యక్రమం జరుపుకోవడానికి అనుమతి నిరాకరించడం కావచ్చు.. ఇటువంటి ధోరణులకు అద్దం పడుతున్నాయి. గోరఖ్పూర్ ఆసుపత్రిలో సరైన వైద్యం అందక పదుల సంఖ్యలో బాలలు చనిపోతూ ఉంటే పరామర్శకు వచ్చే ప్రయత్నం చేసిన రాహుల్ గాంధీ వంటి వారిని అడ్డుకోవడం కూడా ఈ సందర్భంగా గమనార్హం.

ఎవరైనా ప్రభుత్వాన్ని గాని, ఒక వర్గాన్ని గాని విమర్శిస్తే వారిపై ముప్పేట మాటల యుద్ధం ప్రారంభిస్తున్నారు. కానీ వారు లేవనెత్తిన అంశాలను ప్రస్తావించే ప్రయత్నం చేయడం లేదు. రైతులు ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా తమపై పోలీసులు కాల్పులు జరపడంతో మధ్యప్రదేశ్‌లో రైతులు తిరగ బడ్డారు. ఈ సందర్భంగా గిట్టుబాటు ధర ఇవ్వని పాలను రోడ్లపై పారపోస్తే బాధ్యత గల ఒక మంత్రి ఆ విధంగా చేయడం వల్లనే దుర్భిక్షం నెలకొన్నదనడం ఎంత దుర్మార్గపు స్పందనో వెల్లడి అవుతున్నది.

కేవలం మరో రెండు నెలల్లో జరుగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందడం కోసం ఇంకా కాలువల నిర్మాణం పూర్తి కాకపోయినా సర్దార్ సరోవర్ ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని మోడీ, వివాదాస్పదమైన బులెట్ రైల్‌కు జపాన్ ప్రధానితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ అంశాల గురించి కేంద్ర మంత్రివర్గంలో



గౌరీ లంకేశ్

సవివరమైన చర్చ జరిగినట్లే లేదు. కేవలం దేశానికి ఇంత భారం, అనవసరం అయినా లెక్క చేయకుండా ప్రధాని ముచ్చట తీర్చడం కోసం బులెట్ రైల్ ప్రక్రియను వేగవంతం చేయలేదనే సురేష్ ప్రభు రైల్వే మంత్రిత్వ శాఖను కోల్పోవలసి రావడం యదార్థం కాదా?

మరోవంక విమర్శలు చేసేవారు సహితం హద్దు మీరి అసభ్య పదజాలం వాడుతూ ఉండటం మరిన్ని వివాదాలకు దారితీస్తున్నది. గౌరీ లంకేశ్ హత్య జరుగగానే దానిని సంఘ్ పరివార్ సంస్థలు జరిపించినట్లే పెద్ద ఎత్తున దేశం అంతటా విద్వేష ప్రచారం జరిపారు. అంతకు రెండేళ్ల ముందు కర్ణాటకలోని సాహితీవేత్త ఎం.ఎం.కలబురగి హత్యపై ఇప్పటి వరకు అక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దోషులను పట్టుకోలేక పోయింది. ఎఫ్ ఐ ఆర్ కూడా దాఖలు చేయలేక పోయారు. ఆయన కుటుంబ సభ్యులే సిబిఐ దర్యాప్తు జరుపుమని కోరారు. నిర్దుష్టమైన సాక్ష్యాధారాలు లేకుండా రాజకీయ విష ప్రచారానికి దిగడం సహితం పరిస్థితులను మరింతగా దిగజారుస్తున్నది.

ఇంకోవైపు గౌరీ లంకేశ్ హత్య జరుగగానే ఆమె నక్సలైట్ల మద్దతురాలని, వారిలోని ముఠా తగాదాలే ఆమె హత్యకు దారితీశాయని అంటూ సోషల్ మీడియాలో ప్రచారం పెద్ద ఎత్తున ప్రారంభమైంది. ఒక రచయిత, కళాకారుడు, ఉద్యమకారుడు ఎటువంటి సిద్ధాంతాలను అయినా కలిగి ఉండవచ్చు. ఎటువంటి అభిప్రాయలు అయినా వ్యక్తం చేయవచ్చు. చట్ట పరిధిలో వ్యవహరించినంత వరకు ఎవ్వరూ అభ్యంతర పెట్టనవసరం లేదు. అట్లా కాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనే ప్రయత్నం చేస్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకోవచ్చు. ఆ విధంగా చేయకుండా విద్వేష ప్రచారానికి దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం కాగలదు.

2016లో బిజెపి నేతలను విమర్శిస్తూ వార్తలు రాసినందుకుగాను పరువు నష్టం దావా కేసులో ఆమె ఆరు నెలల జైలు శిక్షకు గురయ్యారు. హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ఆమె గళం విప్పారు. ఈ విషయమై రాజకీయంగా, ఇతరత్రా చట్టబద్ధ పద్ధతులలో ఆమెను ఎదుర్కొనే ప్రయత్నం చేయవచ్చు. కానీ ఆమెపై విద్వేష ప్రచారానికి దిగే ప్రయత్నం, అదీ ఆమె హత్యకు గురైన తరువాత చేయడం దేశం మొత్తం తామే అధికారంలో ఉండాలని కోరుకొనే వారికి తగదు.

సైద్ధాంతిక విభేదాలున్నవారు సామాజిక మాధ్యమాలు, చర్చా

వేదికల్లో తరుచుగా మాటల దాడులకు దిగుతున్నారు. అయితే ఇటువంటి విభేదాలు దారి తప్పుతున్నాయి. టివి చర్చలలో విద్వేష పూర్వక చర్చలు ఎంత వెగటుగా జరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాము.

**ఒక జర్నలిస్టుగా ఎవరైనా వాస్తవాలకు అక్షరరూపం కల్పించే ప్రయత్నం చేస్తే, అటువంటి వాస్తవాలు ఎంత కఠినమైనవైనా మద్దతుగా నిలబడవలసిందే. అయితే నేడు చాలామంది వృత్తిపర నిబద్ధతలను విడనాడి ఉద్యమకారులుగా మారుతూ ఉండటం, చెప్పదలచుకున్న అంశాలను ద్వేషపూర్వకంగానో, అసభ్యకరంగానో చెప్పే ప్రయత్నాలు చేస్తూ ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పత్రికా రచన చేస్తున్న వారు ఉద్యమకారులుగా మారి కొన్ని రాజకీయ అభిప్రాయాలకు ప్రాణం పోసే వారు కావడంతో ఒకవిధమైన అలజడి కలుగుతున్నది.**

ఉదాహరణకు కంచె ఐలయ్య రచనలపై చెలరేగిన దుమారం విషయమే తీసుకోండి. ఈ దేశంలో నేడు పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపారస్తులు ప్రభుత్వ విధానాలను నిర్దేశిస్తూ అక్రమంగా ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారన్నది వాస్తవం. అందులో కులం ప్రసక్తి అవసరం లేదు. ఒక ఆచార్యుడుగా పరిశోధనలు చేసి, సమగ్ర అధ్యయనం చేసి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచటం వేరు. కానీ రెచ్చగొట్టే ధోరణిలో, మొత్తం ఒక సామాజిక వర్గాన్ని సమాజం ముందు నేరస్థులుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం సమాజంలో అల్లకల్లోలానికి దోహదపడే చర్య మాత్రమే కాగలదు.

కొన్ని కులాలను నేరస్థులుగా పేర్కొంటూ స్వతంత్ర భారత దేశంలో 70 ఏళ్ళ తరువాత కూడా ఇంకా కొన్ని చట్టాలు కొనసాగడం, ఆయా కులస్థులను నేరస్థులుగా వివక్షతకు గురి చేస్తూ ఉండటం అమానుషమని ఆందోళన చెందుతున్నాము. అటువంటి సమయంలో ఈ విధంగా కుల విద్వేషం ద్వారా ప్రయోజనం పొందే ధోరణులు ప్రమాదకరం కాగలవు.

విదేశాల నుండి లక్షల కోట్ల రూపాయలు వస్తాయి అనుకొంటే మత మార్పిడిలను ప్రోత్సహిస్తామని బహిరంగంగా చెప్పడం ద్వారా కంచె ఐలయ్య 'రహస్య ఎజెండా' తో సామాజిక అల్లకల్లోలం కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు భావించవలసి వస్తున్నది. అదే సమయంలో ఆయన వాడుతున్న పదజాలాన్ని, అనాగరిక వాఖ్యానాలను వ్యతిరేకిస్తున్న వారు సహితం ఆయన పట్ల అదేవిధమైన విద్వేషపూరిత భాషను ప్రయోగించడం ఆందోళన కలిగిస్తుంది.

దేశంలో నేడు పలు రాష్ట్రాలలో అధికార పక్షం పట్ల భిన్నాభిప్రాయం వ్యక్తం చేసేవారిపై అనుచితమైన ఆంక్షలు వ్యక్తంచేస్తున్నారు. శాంతియుతంగా నిరసనలు తెల్పడం కోసం కూడా అనుమతించడం లేదు. ఎక్కడైనా విషాదకర సంఘటన జరిగితే ప్రతిపక్ష నాయకులను సందర్శనకు అనుమతించడం లేదు. ప్రభుత్వ విధానాల పట్ల రైతులు, వివిధవర్గాల ప్రజలు నిరసన తెలిపే ప్రయత్నం జరుపుతుంటే నిర్దాక్షిణ్యంగా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత దేశాన్ని మనం చెప్పుకొంటూ ఉంటాము. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించడం ప్రాథమిక అంశం. అటువంటి ప్రాథమిక స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు ఆటంకం కల్పించడం నిరంకుశ విధానమే.

నేడు కేవలం భారత దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా కూడా అసమ్మతి తెలిపే అవకాశాలు తగ్గిపోతూ ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తనకు మద్దతు ఇవ్వని వారంతా ఉగ్రవాదులకు మద్దతు పలుకుతున్న వారే అంటూ నాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ అంటే మౌనం వహించిన అంతర్జాతీయ సమాజం ఇటువంటి ప్రజాస్వామ్య వ్యతిరేక వాతావరణానికి అంకురార్పణ జరిపిందని చెప్పవచ్చు.

స్వేచ్ఛ స్వతంత్రాలు పతాక స్థాయిలో ఉన్నాయని చెప్పుకొనే అమెరికాలోని విశ్వవిద్యాలయాలలో మాజీ విదేశాంగ కార్యదర్శులు హెన్రీ కిసెంజర్, కండోలీజా వంటి వారితో పాటు పలువురు ప్రముఖుల ప్రసంగాలను అకస్మాత్తుగా రద్దు చేయడం ఆ దేశంలో బలీయంగా అసమ్మతిని అణచివేసే ప్రయత్నాలకు అద్దం పడుతున్నది. స్వయంగా వీసా నిరాకరించడం ద్వారా నరేంద్ర మోడీ ఇదివరలో అమెరికాలో ప్రసంగించే అవకాశాన్ని కోల్పోవడం తెలిసిందే.

నేడు మన దేశంలో విభిన్న భావజాలాలు గల సంస్థలు, రాజకీయ పార్టీలు, వ్యక్తుల మధ్యనే కాకుండా ఒకే భావజాలం గల వారిమధ్య కూడా ఇటువంటి అసహనం తాండవిస్తున్నది. ఈ మధ్యనే అమెరికా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ బెర్కెలీ విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ భారత దేశంలో రాజకీయాలలో, వ్యాపారాలలో వారసత్వం కొనసాగుతున్నదని చెప్పారు. ఒక అభిప్రాయం వ్యక్తం చేసినందుకు కొందరు బిజెపి నాయకులు ఆయనపై చేసిన విమర్శలు వారిలోని అసహనాన్ని వెల్లడి చేస్తుంది.

రాహుల్ గాంధీ తరచుగా విదేశీ పర్యటనలు జరుపుతున్నారు. అయితే ఆయన ఎక్కడకు, ఎందుకోసం వెడుతున్నారో తన పార్టీ వారికి కూడా చెప్పకుండా వెడుతున్నారని ఇప్పటివరకు ఇతర పక్షాల వారు కూడా విమర్శలు కురిపించారు. అయితే మొదటిసారిగా తన పర్యటన కార్యక్రమం వెల్లడించి వెళ్లారు. భారత దేశంలో అధికారం కోరుకొనే వారు అనేకమంది, నరేంద్ర మోడీతో సహా అమెరికాలోని మేధావులు, విధాన నిర్ణయాలు తీసుకొనే వారి దృష్టిని పడటం కోసం ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ అటువంటి ప్రయత్నం చేస్తే ఎందుకు కన్నెర్ర చేయాలి ?

బహుశా కేరళలో మినహా నేడు దేశంలో ఏ రాష్ట్రంలో అయినా రాష్ట్ర మంత్రివర్గాలలో, చివరకు కేంద్ర మంత్రివర్గంలో ఒక అంశంపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకొనే పరిస్థితులు నెలకొన్నాయా? ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి అభిప్రాయాలకు విరుద్ధంగా మంత్రులు తమ అభిప్రాయాలు చెప్పగలిగే స్థితిలో ఉన్నారా? ఆ విధంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారు మంత్రులుగా కొనసాగగలరా? బండారు దత్తాత్రేయ వంటి వారు మంత్రి పదవి పోగొట్టుకోవడానికి స్వతంత్రించి కార్మిక అనుకూల, పేద ప్రజల అనుకూల విధానాలు చేపట్టడం కారణం కాదా ?

నేడు దేశంలో దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలలో ఒక కుటుంబం లేదా– కొద్దీ మంది వ్యక్తులు మాత్రమే కీలక నిర్ణయాధికారం కలిగి ఉంటున్నారు. వారి ఎదుగుదలకు అడ్డు రాగాల సామర్ధ్యం మరెవరిలో అయినా ఉన్నట్లు అనుమానిస్తే అటువంటి వారిని పక్కకు తప్పిస్తున్నారు. ఇటువంటి అభద్రతాభావం సహితం అసహనానికి పరాకాష్ఠగా భావించవచ్చు. ప్రజాస్వామ్యంలో ఏ విషయం పైన అయినా అన్ని స్థాయిలలో కూలంకషంగా చర్చలు జరగాలి. కానీ నేడు అటువంటి ప్రజాస్వామిక వాతావరణం దాదాపు ఏ సంస్థలో కూడా కనిపించడం లేదు!

– జొన్నా గోవర్ధన్
93906 00157

– సన్నిధానం నరసింహశర్మ
92920 55531



# పొత్తపుగుడుల ఉద్యమ పూజారి 'కళాప్రపూర్ణ' పాతూరి నాగభూషణం

**ప**రాయిదొరతనాల ఏలుబడుల క్రింద నలిగిపోతున్న కాలంలో–మనస్వంత బ్రతుకుల గురించి, మన సంస్కృతి గురించి, మన భాషా సాహిత్యాల కళల గురించి పోరు సలపడం జరిగింది. తీరా స్వతంత్ర్యం వచ్చాక, భాషా రాష్ట్రం వచ్చాక మన ఏలికలతో సైతం పోరాడ వలసిన పరిస్థితులు ఏర్పడడాన్ని చూసి స్వాతంత్ర్య సమరయోధులు చాలామంది మన స్తాపానికి గురి అయ్యారు. అనేక మహోద్యమాల రంగస్థలం, కూడలి అయిన గ్రంథాలయోద్యమాన్ని భాషారాష్ట్ర సాధనానంతరం తెలుగు దొరతనం తగినంతగా పట్టించుకోనందుకు– ఆ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన పాతూరి నాగభూషణంగారు ఆవేదన చెందేవారు. ఉద్యమపత్రిక 'గ్రంథాలయోద్యమం' ద్వారా గుండెగొంతు విప్పేవారు. ఉపన్యాసాలలో చెప్పేవారు.

గాడిచర్ల, అయ్యంకి, పాతూరి, వావిలాల, కోదాటి, వెలగా వంటి వారు ఆయా కాలాల్లో వారివారి బాటల్లో ఏకోన్ముఖంగా పొత్తపు గుడుల ఉద్యమానికి చేసిన సేవలు చరిత్రాత్మకాలు.

1907–1987 నడుమ ఎనభై ఏళ్ళ జీవితంలో అధిక భాగాన్ని గ్రంథాలయోద్యమానికి వెచ్చించిన మహానుభావుడు, కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణంగారు. 1970 దశకంలో ఆరునెలలపాటు ఆయన దగ్గర గ్రంథాలయ శిక్షణా తరగతుల్లో చదువుకొన్న కాలంలో నేను ఆయనకు ప్రియశిష్యుడిని అవడం నా జీవితంలో తీపిగురుతుల అదృష్ట కాలం.

రాజమండ్రి నుండి నేను విజయవాడలో దిగి, రామమోహన గ్రంథాలయం ఎదురుగా ఉన్న సందులో ఉండే గ్రంథాలయ పితామహ 'అయ్యంకి వెంకటరమణయ్యగారింటికి' వెళ్ళి ఆయనకి నమస్కరించుకునేవాణ్ణి. తరువాత వెళ్ళి వుండేది నాగభూషణంగారి చెంతనే.

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘానికి అయ్యంకి బాటలో 1938 నుండి నిర్మాణాత్మక కార్యక్రమాల విస్తృతిలో ఎన్నో సేవలు చేశారు పాతూరి వారు. గ్రంథాలయ సర్వస్వాన్ని, సంఘాన్ని జీవితాంతం తానే సంఘంగా, తానే సర్వస్వంగా కళ్ళలో పెట్టుకుని చూసుకున్నారు. స్వీయరచితాలు, సంపాదకత్వ ఫలితాలూ అయిన అరవైనాలుగు పొత్తాలను ఆయన సమాజానికి బహూకరించారు. కట్టమంచివారి ముసలమ్మ మరణం, మానికొండ సత్యనారాయణగారి చరిత్ర గ్రంథాలు, గాంధీ సాహిత్యం –ఇలా బహు కోణాల్లో వారు గ్రంథసేవ చేశారు. భార్య చనిపోయే పరిస్థితుల్లో ఆస్పత్రిలో ఉన్న గాడిచర్ల హరిసర్వోత్తమరావుకు సేవలందించిన సంస్కారి పాతూరి. 'హరిసర్వోత్తమ భవనం' ఆయన సర్వోత్తమ అభిమాన సాక్ష్యం.

తెలుగులో గ్రంథాలయశాస్త్ర గ్రంథాల్ని సంతరించి పెట్టిన వారిలో పాతూరి స్థానం పదిలమైనదే.

ఏసంఘమైనా శక్తిమంతం కావాలంటే ఆర్థిక పరిపుష్టి కూడా ముఖ్యమని భావించడం వల్లనే పాతూరి ముందుకు సాగగల్గారు. వ్యవసాయ గ్రంథాలను సైతం ఆయన ప్రకటించారు.

నేను విద్యార్థిగా అక్కడ సి.ఎస్.సి.కి. ఇంటర్వ్యూకి వెళ్ళాను. అప్పటికి పాతూరివారు ముఖతః తెలీదు. లిఖిత పరీక్ష అయ్యాక నన్ను పాతూరివారు, గద్దె రామమూర్తిగారు గ్రంథాలయోద్యమంపై చెప్పమన్నారు. ధైర్యంగా ఉద్రేకంగా ఉపన్యాసం వంటిది ఇచ్చేశాను. వెంటనే నాగభూషణంగారు ఆనందం పొంగి, మీకు సీటు ఇచ్చేస్తాం. అప్పుడే ఇతర విద్యార్థులకు చెప్పకండి అన్నారు. వెనకటితరం ఉద్యమ నాయకులు ఔత్సాహికుల్ని అలా అక్కున చేర్చుకునేవారు ఉద్యమ బలాపేక్షతో.

రాత్రి 12 గంటలు దాటినా సంఘ కార్యాలయంలో ఫైళ్ళు, ఉత్తర ప్రత్యుత్తరాలూ చూసుకునేవారు. నాయకులనుండి చిన్న కార్యకర్తలవరకూ, అందరికీ సమానస్థాయిలో ప్రత్యుత్తరాలిచ్చేవారు. లేఖలో మిగిలిన అంశాలుంటే తా.క. అంటే తాజాకలంగా రాసేవారు. ఓరాత్రి 12 గంటలవేళ సర్వోత్తమభవనంలో తన పని చూసుకుని దగ్గరలోని తమ యింటికి వెళుతున్నారు. భవనం మెట్లవద్ద చీకట్లో కాళ్ళకు మనిషి తగలడం చూసి ఏయ్ ఎవరు నువ్వు అని అడిగారు. ఆ చీడీల మీద పడుకున్న వ్యక్తి 'నేనండీ శ్రీరాముల్ని' అన్నారు. దీపంవేసి చూస్తే ఆయన పొట్టి శ్రీరాములు గారు. "ఏమిటి శ్రీరాములూ! నేను లోపల రాసుకుంటున్నా. దీపం వెలుగుతోంది కదా నన్ను పిలిస్తే పడక ఏర్పాటు చూద్దును కదా అన్నారు పాతూరివారు. అంటే "నేను దేశసేవా కార్యక్రమాలవంటివి చూసి వచ్చాను. మీరు ఏదో దేశంకి చెందిన కార్యక్రమాల్లో ఉన్నారు. వాటిని నేను ఆటంక పరచకూడదు. మన నేలపై ఎక్కడ పడుకుంటే ఏమిటండీ" అన్నారట పొట్టి శ్రీరాములుగారు. స్వాతంత్ర్య యోధులైన, గ్రంథాలయోద్యమ సారథులైన పాతూరి నాగభూషణంగారు జిల్లాగ్రంథాలయసంస్థ అధ్యక్షులుగా ఓడిపోయారు. అదొక చిత్రానుభవం. ఈ సంగతిని పాతూరివారు సురవరం ప్రతాపరెడ్డిగారికి తెలిపితే మనవంటివారు ఇటువంటి పదవులకు వెళ్ళడం గౌరవప్రదం కాదనే అర్థంలో లేఖ రాశారు. గ్రంథాలయ శిక్షణా తరగతి విద్యార్థుల్ని గ్రంథాలయ సంఘం పనులకు, ఆవరణ పరిశుభ్రతకు వినియోగించుకునేవారు. నేను రచయితనని నాకు కొంత ప్రత్యేక ప్రేమ చూపించి, శర్మగారూ మీరు ఆ బీరువాల్లోని నా ఫైళ్ళు, లేఖలూ చూసి అవసరమైన వాటిని వేరే భద్రపరచండి అని పురమాయించారు. ఆ సందర్భంలోనే పైన పేర్కొన్న సురవరంవారి లేఖ, పొట్టి శ్రీరాములు గారు పాతూరి వారికి నెల్లూరునుండి రాసిన 4,5 లేఖలూ, నాగభూషణంగారి అబ్బాయి మదరాసు నుండి రాసినలేఖ (నాగభూషణం గారి అబ్బాయి చనిపోయాడు) వంటివి వేరు చేసి ఆయనకి ఇచ్చాను. మృతిచెందిన తన కుమారుని లేఖ చూసి ఆయన కళ్ళు చెమర్చాయి. నాకే లేఖలు అక్కర పడతాయో మీకు

తెలిసింది అన్నారు నాతో.

ఒక ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భాన పొట్టి శ్రీరాములు గారు పాతూరి వారికి రాసిన లేఖల్ని ఒక వ్యాసంగా రాస్తే, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్, ఒకనాటి ఆంధ్రప్రభ సంపాదకులు నా ప్రాణ మిత్రులు వాసుదేవ దీక్షితులు గారు దానిని కళ్ళకద్దుకొని ప్రభ సంపాదకీయపుటలో ప్రకటించారు. రాజమండ్రి వచ్చినప్పుడు పెద్దలెవరైనా ఎసి వసతులూ అవీ చూపిస్తామన్నా– నాకవి అఖ్కరలేదు, మా శర్మగారింట్లో వుంటానని ఆనాడు అంతగా సౌకర్యాలు లేకపోయినా మాయింట్లో ఉండడం తలచుకుంటే ఆ గురుప్రేమ అనుపమానం అనిపిస్తుంది.

ఆకాశవాణి విజయవాడ కేంద్ర కార్యక్రమానికి ఆయనని కొన్ని ప్రశ్నలు వేయడానికి నన్నూ, వారి వారసత్వ స్ఫూర్తిగా సేవాకార్యక్రమశీలి అయిన శారదగార్నీ తీసుకువెళ్ళారు. తీరా కార్యక్రమానికి వెళ్ళాక శారదగారు అనుకోని క్రొత్త ప్రశ్నలను జటిలమైన వాటిని సంధించినా, తాపీగా, అనుభవ భూమికపై వారు ప్రత్యుత్తరాలిచ్చారు. ఆ కార్యక్రమం ప్రజాభిమానాన్ని బాగా చూరగొంది. వారు జీవించి వుండగానే ఆయన చరిత్రను రాయడానికి ముగ్గురు అర్హులున్నారని ప్రకటించారు. దానిలో నాపేరు ఒకటి కావడం గమనించి శారదగారు మూలచరిత్రను నాచేత రాయించి ఆంధ్రప్రదేశ గ్రంథాలయ సంఘ ప్రచురణగా ప్రకటించి ఒకనాటి ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డిచే ఆవిష్కరింపజేశారు.

ఓమారు గ్రంథాలయ శిక్షణకు వచ్చిన మాజట్టు నాగభూషణంగార్కి సమ్మానం చేశాం. కొంత నగదు ముట్టజెప్పాం. ఆ సభకు రైతు బాంధవుడు ఆచార్య రంగ గారు అధ్యక్షులు. నేను గురువుగారిపై వక్తను. ఏదో కవిత్వం అంటూ గిలకడం నా కలవాటు. గురువుగారిపై ఓ కవిత రాసి చదువుతూ

"తన పవిత్ర మాతృగర్భమును
వీడినప్పు డీయన
కేర్ కేర్ మని ఏడ్చారో?
లైబ్రరీస్ కేర్ (care, care) మని
ఏడ్చారో" అన్నాను.

వెంటనే చేతిమ్రోతలు! ఈ వాక్యాలకు ఆచార్య రంగాగారు పొంగి పోయి తన అమృత హస్తాలతో మెచ్చుకోలుగా వెన్నుపై తట్టారు. గురువుగారు చెమర్చిన కళ్ళతో దీవించారు. ఆ పెద్దోరి ప్రోత్సాహాల తీపిగురుతులు బతికున్ననాళ్ళూ నడిపిస్తాయి.

గ్రంథం– రచయిత– ప్రకాశకులు– ప్రజలమధ్య జ్ఞాన ప్రవాహాలు ప్రవహింపజేస్తూ నూతన గ్రంథాలయోద్యమం సాగవలసిన –గ్రంథాలయ శాస్త్రం పెరిగిన ఈ కాలంలో– పాలకుల నిర్లక్ష్యపు నీడల్లో గ్రంథాలయాలు ఎవరికివారే యమునాతీరే అన్నదశలో ఉన్నాయి. నేటి ఈ దుర్దశను చూసివుంటే పాతూరివంటివారు గుండెలు బ్రద్దలు కొట్టుకునేవారేమో. అధోగతినుండి పురోగతికి పాతూరివంటి వారి స్ఫూర్తి పూర్తిగా కావాలిప్పుడు.

# తనను తాను తెలుసుకోవడమే శిల్పం

– డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

**కొన్ని** కళ్ళు సూర్యగోళాలు
కొన్ని కనురెప్పలు కావ్యాలు రాస్తాయి
అక్కడ అక్షరాలు అమృతబిందువులుగా
వర్షిస్తాయి
సంవత్సరాలు గడుస్తున్న కొలదీ
కొన్ని శిల్పాలు ప్రకాశవంతం అవుతాయి
తమను తాము చెక్కుకొనే
ఉలులు వారి మునివేళ్ళలో ఉన్నాయి
అవును! వారికి ప్రేమించటమే తెలుసు
ద్వేషించటం రాదు
లోయల్లో నుండి ఉదయించే సూర్యుడికి
వాళ్ళు దివిటీలు పడతారు
వారికి కల్మషం లేదు
విశాలమైన కడలి అలలోనూ
మధుర సంగీతం వినిపిస్తారు
అవును! వారు వెన్నెలతో కడగబడ్డారు
పాలరాతి విగ్రహంలా భాసిస్తారు
వారి కనులతోనే మాట్లాడతారు
అందులో ఆత్మీయ భాష ఉంది
గుండెల్ని కదిలించే కుదుపు ఉంది
మనస్సులోని ప్రతిపొరపై
సంతకం చేయగల సాధికారత వారిది
వారి గొంతుకలోని స్వరాలకు
మనుషులను సజీవం చేసే శక్తి ఉంది
వారు దోసిళ్ళతో తలమీద పూలు జల్లుతారు
తేనె బిందువులు నాలుకకు అందిస్తారు
చెవిలో నదీ తరంగాల సవ్వడి వినిపిస్తారు
శిశువులకు ఆయువు పోయడం
వారికి ఓ దినచర్య
అవును! ప్రేమ ఒక జిజ్ఞాస
ప్రేమ ఒక విజ్ఞత
ప్రేమ ఒక జీవన సౌరభం
ప్రేమ ఒక రాగమాలిక
ప్రేమ మనో సౌందర్యం
నిజమే! ప్రకృతిని ఒడిసిపట్టలేనివారు
పెదాలతో జీవిస్తారు
పగలే వారు కునుకుతారు
సంభాషణలో వ్యతిరిక్తులవుతారు
ఒంటరితనం ఎప్పుడూ ఒక శాపమే
తోడే మనిషికి జీవం
పక్షి గువ్వలన్నీ జంటగానే వున్నాయి
వాటికి సృజనం ఉంది, సౌజన్యం ఉంది
సమున్నతి ఉంది, గెలుపు ఉంది
మనుషులు అభివ్యక్తి శూన్యులవుతున్నారు
భయం వారిని పాలిస్తుంది
భయం వారి నడకను కుంటు పరుస్తుంది
భయం వారి అభ్యున్నతికి గొడ్డలి వేటు
మనుషులు తోడుతోనే పల్లవిస్తారు
ప్రజ్వలిస్తారు కూడా
సంభాషణ ఓ వివేచన
వారికి ఏమి తెలుసనుకుంటారో
అది వారికి పూర్తిగా తెలియదు
వారు అర్ధ మనస్కులు
వారు చాలా విషయాలను స్వీకరించరు
అవే వారికి ఎదురు నిలబడతాయి
అనుబంధం అంటే ఏమిటి?
ఆహారం ఇవ్వడం ఒక్కటే కాదు కదా!
మనస్సును ఇవ్వగలగాలి
అదే అన్ని భావోద్వేగాలను స్వీకరిస్తుంది
తమలోకితాము చూసుకోవడమంటే ఏమిటి
తమలోని వెన్నెలను,చీకటిని చూడగలగడమే
ఎవరైనా తమని తాము
శిశువుగా ఆవిష్కరించుకోవాల్సిందే!
తోడుకు ఊపిరి పోయాల్సిందే!
గుండెలను వెలిగించే ఔదార్యం కావాల్సిందే
నిజమే! ఆ భాషణ లోనే సజీవత ఉంది
తన్ను తాను తెలుసుకునే భావన ఉంది
తనను తాను శిల్పించుకునే నేర్పు ఉంది
తనను తాను తెలుసుకోవడమే
విజయానికి సోపానం.

–పుప్పల నరసింహం
99857 81799

# నదులకోసం నడుం బిగించిన తెలుగుతేజం!


**దేశంలోని నదుల పరిరక్షణకు తెలుగుతేజం, జగమెరిగిన యోగి, ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జగ్గీ వాసుదేవ్ 'ర్యాలీ ఫర్ రివర్స్' పేర కన్యాకుమారి నుంచి హిమాలయాల వరకు యాత్రను ప్రారంభించారు. జలం లేకపోతే జీవంలేదన్న మౌలిక సత్యాన్ని తెలియజేసేందుకు సద్గురు ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా సెప్టెంబరు రెండవవారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆయన ర్యాలీ కొనసాగింది. ఈ రకమైన అవగాహన ర్యాలీ గతంలో ఎన్నడూ జరగలేదు. ఇపుడు మేల్కొనకపోతే నదులన్నీ ఎడారులుగా మారుతాయని హెచ్చరిస్తూ సద్గురు ప్రచారం చేపట్టారు. అనేక టెలివిజన్ ఛానళ్లకు, పత్రికలకు ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నారు. ఈ ర్యాలీ దేశంలోని 16 రాష్ట్రాలగుండా సాగి హిమాలయాలకు చేరుకుంటుంది.**

ఒక తెలుగుతేజం ఈ రకమైన అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గర్వించదగ్గ విషయం. దేశం మొత్తాన్ని ఆలోచింపజేస్తూ ర్యాలీలో భాగస్వాములు అయ్యేలా 'మిస్డ్‌కాల్' ఇవ్వమని పిలుపునిచ్చారు. ఇప్పటికే కోట్లాదిమంది మిస్డ్‌కాల్ ఇచ్చారని తెలుస్తోంది. 'ర్యాలీఫర్ రివర్స్' కార్యక్రమ ప్రచారం కోసం రూపొందించిన చిత్రం (లఘు డాక్యుమెంటరీలో కావేరీ ఇతర నదులు ఎండిపోగా ఆ పరివాహకప్రాంత ప్రజలు, జీవరాసుల బాధలు– కష్టాలు– కన్నీళ్ళను చూస్తుంటే మనసు చివుక్కు మంటుంది. నదుల పట్ల ఇంత నిర్లక్ష్యం వహించామా? అన్న ప్రశ్న గుచ్చుకుంటుంది.

ఈ ర్యాలీ ఉద్యమం కాదు... ఆందోళన కాదు... ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావడం కాదు. కేవలం అవగాహన కోసం వేలాది మందితో ర్యాలీని కొనసాగిస్తున్నట్లు సద్గురు వినమ్రంగా పలుమార్లు ప్రకటించారు. అంటే ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు... ప్రజలందరి బాధ్యత అని ఆయన గుర్తు చేసేందుకే ఈ వినూత్న శైలిలో ర్యాలీని చేపట్టారు. ఈ క్రమంలో అధికారులను, పాలకులను, సామాజిక స్పృహగల వారిని, పాఠశాల, కళాశాల విశ్వవిద్యాలయ విద్యార్థులను సైతం కలుపుకుని పోతున్నారు.

నదులున్నప్పుడే నాగరికత పరిఢవిల్లుతుందన్న ప్రాథమిక సూత్రాన్ని సద్గురు అందరికీ గుర్తు చేస్తూ ఉన్నారు. వ్యవసాయానికీ, పశు పోషణకు, మానవ మనుగడకు కీలకమైన నదులపై నిర్లక్ష్యం ఇంకానా ఇకపై కూడదని ఆయన అన్ని వయస్కుల వారికి సూచిస్తున్నారు. అందరి భాగస్వామ్యంతోనే ఈ మహత్కార్యం సాధ్యమని చెబుతున్నారు. తదనుగుణంగానే కార్యక్రమాల్ని రూపొందించి ముందుకు కదులుతున్నారు.

తెలుగువాడైన జగ్గీ వాసుదేవ్ 1957 సెప్టెంబర్ 3 (ఇది ఆయన షష్టిపూర్తి సంవత్సరం)న మైసూరులో సుశీల, డాక్టర్ వాసుదేవ్ జగదీశ్



దంపతులకు నాల్గవ సంతానంగా జన్మించారు. మైసూరులోనే ప్రాథమిక విద్య జరిగింది. తండ్రి జగదీశ్ రైల్వేలో ఉద్యోగరీత్యా పలు చోట్లకు బదిలీలు జరగడంతో జగ్గీ వాసుదేవ్ విద్యకూడా ఆయా ప్రాంతాల్లో కొనసాగింది.

మైసూరులోని చాముండి హిల్స్, యోగా గురువు రాఘవేంద్ర స్వామిల ప్రభావం బాల్యంనుంచే ఆయనపై బలంగా ఉంది. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఆయన ఆంగ్ల సాహిత్యంలో పట్టా పొందారు. ఆంగ్లంలో అద్భుతంగా మాట్లాడతారు.

జగ్గీ వాసుదేవ్ జీవితంలో సెప్టెంబర్ మాసానికి అధిక ప్రాధాన్యత కనిపిస్తోంది. ఆయన జననం, ఆధ్యాత్మిక పలకరింపు... జ్ఞాన ప్రవాహం, నదులకోసం ర్యాలీ. ఇదే మాసంలో ప్రారంభమైంది. 1982వ సంవత్సరం సెప్టెంబర్ 23న మధ్యాహ్నం చాముండి హిల్స్‌లోని ఒక బండరాయిపై కూర్చున్నప్పుడు అతనిలో కొత్త వైబ్రేషన్స్, ఆధ్యాత్మిక భావనలు, సరికొత్త అనుభూతి, అనిర్వచనీయమైన 'అలజడి' చోటుచేసుకుంది. దాని తరువాతనే ఆయన జీవితం రూపాంతరం చెందింది.

అనంతరం ప్రయాణాలకు, యాత్రలకు మరింత ప్రాధాన్యత నిచ్చారు. కొత్త అన్వేషణ... యోగా గురువు రాఘవేంద్ర స్వామీజీ ప్రభావంతో నేర్చిన యోగాను ఇతరులకు నేర్పేందుకు గాను 1983లో

## అమ్మ శ్రోత

-డా.ఎన్.గోపి
9391028496

కవిత్వం రాస్తే
ఏమొస్తదో అమ్మకు తెలియదు.
కండ్లు ఎర్రగా ఉబికి
మెడనరాలు పూలతీగల్లా ఉబ్బి
ఉద్వేగంతో
ఆమె ముందు కవిత్వం చదువుతున్నాడు.

తల్లికి అర్థం కాలేదు
విస్మయంగా చూసింది.
కొడుకు రాసిన కవిత్వం
ఆమె ఊహకు అతీతం.
మాతృభాషలో రాసిందే
మాతృమూర్తికి అర్థం కాలేదు.

'వెర్రినాన్న
ఎంత అమాయకంగా ఉండేవాడు
ఇవాళ
'అన్యాయం, అధర్మం, పార్లమెంటు' అంటూ
కొత్త మాటలు మాట్లాడుతున్నాడు.

ఆమె నిరక్షరాస్య కావచ్చు
కాని బాధ తెలియటానికి
అక్షరాలు అక్కరలేదు.
'అయ్యో
ఆ బాధేంటో నాకు చెప్పక
కాగితాలకు చెప్తున్నాడేంది'
అనుకుంది.

కొడుకు రాసిన
కవిత్వం కాగితాలను
గుండెలకు హత్తుకుంది అమ్మ.
ఇప్పుడు
కొడుకు స్పందనలు
ఆమె స్పందనలతో శ్రుతి
కలుపుతున్నాయి.

యోగా తరగతులను నిర్వహించారు. 1984లో విజయకుమారిని వివాహం చేసుకున్నారు. వీరికి ఒకకూతురు.

1982లో చాముండి హిల్స్‌లో కలిగిన దివ్య అనుభూతిని పదిలపరచుకుని, యోగా మాధ్యమం ద్వారా సేవలందిస్తూ పరోపకార లక్ష్యంతో పనిచేస్తూ, కొంతకాలం వ్యాపారం చేసి, చివరికి 1992 అంటే దశాబ్ద కాలానికి కోయంబత్తూరు చేరుకుని 'ఈషా ఫౌండేషన్'ను ప్రారంభించారు. గ్రామీణ పేద ప్రజానీకానికి అన్నివిధాలా సాయం అందించే ఉద్దేశంతో గ్రామీణ పునరుజ్జీవనమే లక్ష్యంగా, సామాజిక సంక్షేమమే ఊపిరిగా ఈ ఫౌండేషన్ ప్రారంభమైంది. ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యత నిచ్చారు.

'గ్రీన్ హౌండ్స్' పేర మరో సంస్థను స్థాపించి కోట్లాది మొక్కలను తమిళనాట నాటేలా ఉద్యమించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో తమిళనాడు పచ్చదనం శాతం పెరిగింది. పేదలకు ఉపాధికూడా లభించింది. ఈ విశేషకృషికిగాను ఇందిరాగాంధీ పర్యావరణ అవార్డు ఆయనకు దక్కింది.

తన ఫౌండేషన్ ద్వారా తమిళనాడులోని చాలా గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులకోసం అవిశ్రాంతంగా సంఘసేవ చేసినందుకు గాను రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతులమీదుగా పద్మ విభూషణ్ అవార్డును అందుకున్నారు.

ఆయన యోగా గురువుగా, మార్మికవాది (మిస్టిక్)గా, ప్రజా సేవకుడిగా, గొప్ప ఉపన్యాసకుడిగా, కవిగా, రచయితగా... ఇలా అనేక రంగాల్లో రాణించారు. తనదైన ముద్రను వేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, భారతదేశంలో ప్రభావశీలుర జాబితాలో తొలి వరుసలో నిలిచారు.

కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్ ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోడీ గత శివరాత్రి పండుగ సందర్భంగా అతిపెద్ద ధ్యాన ముద్రలోని శివుని విగ్రహాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే!

వందకుపైగా రచించిన పుస్తకాల్లో 'ఇన్నర్ ఇంజనీరింగ్' అన్న పుస్తకం కూడా మార్మికత, మానవ శక్తి సామర్థ్యాల గూర్చి వివరిస్తుంది.


మానవ శరీరం గొప్ప మెకానిజం గలదని దీన్ని సమర్థవంతంగా అందరూ ఉపయోగించుకోవాలని ఆయన అంటారు. తాను ఎలాంటి ఆధ్యాత్మిక గ్రంథాలు చదవలేదని, పురాణ, ఇతిహాసాలను చదవలేదని ఆయన నిజాయితీగా చెప్పుకుంటారు. కాని జీవన విధానాన్ని, సైన్స్‌ను, టెక్నాలజీని ఆయన గొప్పగా అర్థం చేసుకుని గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు, సైంటిస్టులు, డాక్టర్లతో సమానంగా చర్చల్లో పాల్గొని తనదైన దృక్పథాన్ని వెల్లడిస్తారు. అందులో 'సత్యం' కనిపిస్తుంది. ఓ కొత్త మెరుపు జతకూడి ఉంటుంది. ఈ విధానమే ఆయనను ప్రత్యేకంగా నిలిపింది. యోగా, ధ్యానం, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాలపై ఒక కొత్త వైఖరి ఆయన మాటల్లో దర్శనమిస్తుంది.

తాజాగా నదుల సంరక్షణకోసం ప్రారంభించిన ర్యాలీ సందర్భంగా చేస్తున్న ప్రసంగాలు, చెబుతున్న గణాంకాలు, మానవ మనుగడకు ఏర్పడిన ముప్పు తదితర అంకెలు, అంశాలు ప్రతి వ్యక్తిని కదిలిస్తాయి, ఆలోచింపజేస్తాయి.

ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించినా, వరల్డ్ ఎకనామిక్ సదస్సు (దావోస్)లో ప్రసంగించినా, హేమాహేమీలెందరో చెవియొగ్గి ఆయన మాటలు వింటారు. ప్రతిపలుకు ఎంతో స్పష్టంగా, నిజాయితీగా గుండెలోతుల్లోంచి వచ్చినందున ఆయన మాటకు ఎంతో గౌరవం ఇస్తున్నారు. తెల్లని జుత్తు, పొడవాటి గడ్డం, పెద్దమీసాలు, భుజంపై పెద్ద శాలువతో ఆరడుగుల ఈ ప్రతిభాశీలి, ప్రభావశీలి, జ్ఞాన సంపన్నుడు, కార్య నిర్వహణ దక్షుడు, లక్షలాది మంది కార్యకర్తలతో సంఘసేవ చేస్తూ, ధ్యానం, యోగా ద్వారా ఎందరో జీవితాల్లో శాంతిని పూయించిన జగ్గీ వాసుదేవ్ చిన్నపిల్లల్లో చిన్నపిల్లవాడిగా మారిపోతాడు. పేద పిల్లల మధ్యకు వెళ్ళి వారితో గ్రామీణ ఆటలు ఆడతాడు. వారిలో ఒకడిగా కలిసిపోతాడు. ఎద్దులబండిలోనూ ప్రయాణం చేస్తాడు.

అవసరమైతే సైకిల్ మోటారు నడుపుతాడు. ఖరీదైన కారు తోలుతాడు. 'ర్యాలీ ఫర్ రివర్స్' ర్యాలీలో కన్యాకుమారి నుంచి హిమాలయాల వరకు ఆయనే స్వయంగా వాహనం నడుపుతూ ప్రయాణిస్తున్నారు. ఆయన ఆహార్యం కొంత వింతగా కనిపిస్తుంది. తలపై పగిడి ధరిస్తారు. పొడవాటి గౌను వేసుకుంటారు. వైవిధ్య భరితమైన, విశిష్ట వ్యక్తిత్వం గల పరోపకారి, ఆధ్యాత్మికవేత్త, యోగా గురువు, ప్రపంచంలోని ప్రకృతి పచ్చగా ఉండాలని కోరుకోవడమేగాక అందుకు తన మేధోశక్తిని ధారపోస్తున్న ధీరుడు ఈ వాసుదేవుడు, స్ఫూర్తిప్రదుడు. ఇంత ఎత్తుకు చేరి, ఈ తరాన్ని ప్రభావితం చేసిన, చేస్తున్న జ్ఞాని తెలుగువాడు కావడం నిజంగానే గర్వపడే అంశం... కాదంటారా?

## నడుస్తూన్న చరిత్రకు నవలా రూపం నిషిధ




నల్లూరి రుక్మిణి నవల 'నిషిధ' దేశంలోని గ్రామీణ జీవితంలో కుల పరంగా నెలకొన్న పీడనను, అణచి వేతను చిత్రీకరించింది. ఆత్మాభిమా నాన్ని కాపాడుకోవటానికి, ఆత్మగౌర వంతో జీవించటానికి దళితులు చేస్తున్న ఉద్యమాలకు, ఆ క్రమంలో సాగే ప్రతి ఘటనా పోరాటాలకు ఈ నవల అద్దం పట్టింది.

ఈ నవలలో రచయిత్రి అల్లూరు అనే గ్రామాన్ని కేంద్రంగా చేసుకున్నారు. దాదాపు ఏడుదశాబ్దాల చరిత్రలో ఆ గ్రామంలో జరిగిన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిణామాల నేపథ్యాన్ని ఆమె ప్రస్తావించారు. ఆమె చిత్రించింది ఒక గ్రామ జీవితాన్నే అయినా అది నామవాచకంగా కాక సర్వనామంగా మారింది. భారతదేశంలో గ్రామాలు గ్రామాలుగా లేవు. గ్రామం-పల్లె, ఊరు-వాడ అనే ద్వంద్వం గ్రామంలో వుంది. ఊరుకు - వాడకు ఉన్న అంతరాలకి దేశంలో ఎక్కడైనా ఒకటే నేపథ్యం. రెండూ రెండు భిన్నప్రపంచాలు. వైరుధ్యభరిత ప్రపంచాలు. ఒక గ్రామంలోని వాస్తవిక సంఘటనలని ఆధారం చేసుకొని రచించిన ఈ నవలలో స్థానికతను సాధారణీకరించటం జరిగింది. ఆ రెండింటి మధ్య వుండే అన్యోన్య సంబంధాన్ని ఆమె సమర్థవంతంగా విశ్లేషించ గలిగారు. నిర్దిష్టత నుండి సాధారణీకరణ, సాధారణీకరణ నుండి నిర్దిష్టత అనే క్రమాన్ని సాధించటంలో ఆమె విజయం సాధించారు. అందుకే 'నిషిధ' నవల చదివితే నవలాకేంద్రమైన అల్లూరేకాక దేశంలో వున్న ఏ గ్రామమైనా మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

రచయితలు ఎందుకు రాస్తారు, ఎందుకు రాయాలన్నది చాలా ప్రధానమైన ప్రశ్న. తనదికాని ఒక సామూహిక అనుభవాన్ని తన అనుభవంగా మార్చుకుని, ఆ అనుభవాన్ని తిరిగి మళ్ళీ సమాజానికి అందించటం సృజనకారులైన రచయితల బాధ్యత. కేవలం తన వ్యక్తిగత అనుభవాల్ని మాత్రమే పదేపదే సాహిత్యం ద్వారా తెలియజేస్తే అది నిరర్థకం. దాన్నుండి ప్రజలు నేర్చుకునేది ఏమీ వుండదు. అది వాళ్ళ ఆలోచనల్ని విస్తరింపచేయదు. ప్రజల్ని చైతన్యీకరించటానికి ఉపకరించని రచన శైలిపరంగా, నిర్మాణపరంగా, భాషపరంగా ఎంత గొప్పదైనా అంతిమంగా అది చరిత్రలో స్థానాన్ని సంపాదించుకోలేదు. అయితే సామూహిక అనుభవాన్ని తన అనుభవంగా మార్చుకోవాలంటే రచయితకు గొప్ప పరిశీలనా దృష్టి వుండాలి. అమాయకత్వంలో వున్న చిన్నపిల్లలు తమ చుట్టూ వున్న ప్రకృతిని, పరిసరాలను ఎంత ఆశ్చర్యకరంగా, ఉత్సుకతతో, సున్నితంగా, దక్షతతో పరిశీలిస్తారో అలాంటి పరిశీలనా దృష్టి వుంటే తప్ప రచయితలు తమదికాని జీవితాన్ని తమ అనుభవంలోకి తెచ్చుకోలేరు. అయితే ఇలాంటి దృష్టికోణం ఒక్కటి వుంటేనే సరిపోదు. తాను పరిశీలించిన జీవితాన్ని అవగాహన చేసుకొని దాని మూలాల్లోకి వెళ్ళి విశ్లేషించుకోవటానికి అవసరమైన తాత్విక చింతనకూడా రచయితలకు వుండాలి. అలాంటి తాత్విక చింతన లేనివాళ్ళకు తాము పరిశీలించిన అంశాలు లేదా ఘటనలు విడి విడిగా మాత్రమే కనపడతాయి. వాటి మధ్య వుండే అంతర్గత ఐక్యత, వైరుధ్యం అర్థం కాదు. అలాంటి వాళ్ళే చెట్లను చూచి అడవిని చూడలేని వాళ్ళవుతారు. వాళ్ళది అసమగ్ర పరిశీలన. కాని 'నిషిధ' నవలా రచయితకి పరిశీలనా దృష్టి, అవసరమైన తాత్త్విక చింతన రెండూ వున్న కారణంగా నవలలో సమగ్రత కనపడు తుంది.

దళితులు తాము మనుషులమేనన్న ఎరుకను కలిగించుకొని, అలాంటి మనుషులుగా మారే క్రమంలో జరిగే పెనుగులాట ఎంత ఆవేదనాభరితంగా, బీభత్సంగా, హింసాత్మకంగా వుంటుందో 'నిషిధ'లో చాలా బలంగా చిత్రీకరించారు. వాళ్ళ కోర్కెలేవీ గొంతెమ్మె కోర్కెలు కావు. ఎవరికీ లేని ప్రత్యేక హక్కుల్ని వాళ్ళు ఎప్పుడూ కోరలేదు. కేవలం చదువుకోవటానికి, ఉద్యోగాలు చేయటానికి, తెల్లబట్టలు వేసుకోవటానికి, ఊరి రోడ్లమీద తిరగటానికి, అందరితోపాటు వేడుకలు జరుపుకోవటానికి, వెరసి వెన్నెముక వున్న మనుషుల్లాగా జీవించాలని వాళ్ళు కోరుకున్నారు. అయితే పై కులాలవాళ్ళకి తమ కోర్కెల వెనుక, తమ ఆధిపత్యాన్ని వాళ్ళు సవాల్ చేసినట్టుగా అనిపించింది. తరతరాలుగా దళితులపై తాము చేస్తున్న హింసకు, అణచివేతకు, దాష్టీకానికి అవకాశం వుండదన్న భయం వాళ్ళను వెంటాడింది. గ్రామీణ జీవితంలో వస్తున్న అన్ని మార్పులు, సౌకర్యాలు తమకు, తమబిడ్డలకు మాత్రమే అనుభవంలోకి రావాలని వాళ్ళు వాంఛించారు. దళితుల జీవితాల్లోకి మాత్రం ఆ మార్పుల వెలుగు కిరణాలు ప్రసరించడాన్ని ఆధిపత్యకులాలు సహించలేదు. ఆ మార్పుల క్రమంలో తమ దోపిడీ అణిచివేతలకు కాలం చెల్లే ప్రమాదం వుందని వాళ్ళు గ్రహించారు. అందుకే దళితుల పట్ల అత్యంత అమానవీయంగా వాళ్ళ ఆచరణ వుంటున్నది.

ఇది కేవలం కొందరు పెత్తందార్ల వ్యవహారం మాత్రమే కాదు. సమాజంలో చాలామంది ఆలోచనాపరులలో కూడా ఏదో ఒక స్థాయిలో కింది కులాలవాళ్ళ పట్ల, దళితుల పట్ల, స్త్రీల పట్ల, మైనారిటీలపట్ల ఇలాంటి నెగటివ్ కుసంస్కారభావాలు నెలకొనివున్నాయి. ఆ బృందాల ప్రజలు చేసే డిమాండుగాని, ఆ డిమాండ్లను సాధించుకోవటానికి వాళ్ళు జరిపే ఉద్యమాలు గాని, ఆ క్రమంలో వెల్లడయ్యే వ్యక్తీకరణలుగాని, వీళ్ళకు కళ్ళు నెత్తిమీదకి రావడంలాగా, పొగరుమోతుతనంలాగా, ధర్మానికి తూట్లు పొడవటంలాగా, గ్రామాలలో శాంతికి విఘాతం కలిగించే అంశాలుగా కనపడుతుంటాయి. అట్లాంటి దృష్టి వున్నకారణంగానే అణచివేతకు గురైనవాళ్ళు చేసే ఉద్యమాలపట్ల ఇలాంటి వాళ్ళల్లో ఒక ఉదాసీనత, ఒక నిశ్శబ్దం చోటుచేసుకున్నాయి. ఆ నిశ్శబ్దాన్ని నిర్లిప్తతని బద్దలు కొట్టటంలో ఈ నవల విజయాన్ని సాధించింది.

నవలలో ఎక్కడా ఏ అంశాన్నీ రచయిత్రి కేవలం సూచ్యప్రాయంగా మాత్రమే చెప్పలేదు. ఎలాంటి ఊగిసలాటలు లేకుండా వాస్తవాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. నవల చదివిన ఎవరికైనా గ్రామీణ జీవితాల్లోని కులవైరుధ్యాలు ఎంత అమానుషంగా వున్నాయో, అక్కడి రాజకీయార్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు మనుషుల ఆలోచనలమీద, సంస్కారంమీద, సంస్కృతిమీద, మానవ సంబంధాలమీద ఎలాంటి ప్రభావం వేస్తున్నాయో చాలా స్పష్టంగా అర్థమవుతుంది.

దళితులు తాము అనుభవిస్తున్న ఆత్మన్యూనత నుండి, తమమీద

(తరువాయి 48వ పేజీలో)




# తేట తెలుగు జాతీయాలు

తెలుగుభాష ఖాయిలాపడి మనుగడ ప్రశ్నార్థకం అవుతున్న నేటి పరిస్థితుల్లో డా. శ్రీనివాసతేజ, సుమారు 17వేల తేట తెలుగు జాతీయాలను సేకరించి తెలుగు జాతికి అందించిన పుస్తకం 'తేట తెలుగు జాతీయాలు'. ఈ "డా", సాహితీవేత్త కానీ, ఉపాధ్యాయుడు కానీ కాదు. ఆధునిక వైద్య శాస్త్రంలో ఉన్నత విద్యార్హతలు పొందిన మానస వైద్య నిపుణులు. అయితేనేం, తెలుగువాడిగా పుట్టినందుకు తన నుడికారం పట్ల మమకారం పెంచుకోవటమేకాక, తెలుగు భాషకు తనవంతుగా పాలు పంచుకుంటూ, తెలుగు సమాజం ఉజ్వల భవిష్యత్తుకు ఇటువంటి వారు హామీ అనే ధీమాను కలిగిస్తున్నారు రచయిత.

జనం నోళ్ళలో పలికే అచ్చతెలుగు జాతీయాలను ఎంతో ఓపిగ్గా ఏరి, కూర్చి, సంకలనం చేసి అకారాది క్రమంలో పొందుపరిచారు. రచయిత మాటల్లో చెప్పాలంటే – పోను పోను జాతీయాలు తగ్గి తెలుగు సొబగులు మసిబారవచ్చు. ఏదో ఒకనాటికి ఇవి కనపడకుండా పోయినా పోవచ్చు. అందువల్ల గత చరితను త్రవ్వుకోవటానికి అయినా వీటిని రాతల్లో పెట్టి నిలువ చేయాలి. ఈ మాటలు అక్షరసత్యాలు. ఇప్పటికే చదువుకున్న వాళ్ళ మాటల్లో తెలుగు బదులుగా ఇంగిలీసు మాటల వాడుక పెరిగింది.

తక్కువ మాటలతో ఎంతో పొందికగా, ఉన్నది ఉన్నట్లుగా ఆ మాటలకు కనిపించే అర్థం కాకుండా అసలు అర్థం వేరేగా ఉండేవి జాతీయాలు. తక్కువ, చిన్న మాటలతో ఎంతో అర్థాన్ని ఇచ్చేదిగా జాతీయం ఉంటుంది. ఈ జాతీయాలనే 'పదబందాలు', 'పలుకుబడి' అని, ఇంగిలీసులో 'ఇడియం' అనీ అంటారు. ఈ పుస్తకంలో విశేషం ఏమంటే, తెలుగు పుట్టుక మాటలతో కట్టిన జాతీయాలనే మన ముందుకు తెచ్చారు రచయిత. అయితే ఒక్క పరాయిమాటను మాత్రం వాడి కట్టిన జాతీయాలను, అచ్చతెలుగు జాతీయాలుగానే పుస్తకంలో పొందుపరిచారు.

రెండు లేదా అంతకంటే ఎక్కువగా ఇతర భాషాపదాలను ఉపయోగించిన జాతీయాలను ఇందులో చేర్చలేదు.

ఈ పుస్తకంలో ముఖ్యంగా చదువరులను ఆకట్టుకునేవి రెండు అంశాలున్నాయి. ఒకటి–అచ్చతెలుగు వాడకం. డా.సినారె, డా. సామల రమేష్‌బాబు రాసిన ముందుమాటలకు మాత్రం మినహాయింపు యిచ్చి(రాసింది రాసినట్లు) ప్రచురించారు. రెండవది– భాషాపరమైన పరిజ్ఞానం. డా.శ్రీనివాసతేజ "ఏది తెలుగు? ఏది కాదు??"అన్న శీర్షికలో 'నామాట'గాను, 'తెలుగు నుడి –జాతీయాలు' అన్న శీర్షికతో తెలుగు భాషకు సంబంధించిన ఎన్నో వివరణాత్మక విషయాలను అందించారు.

వాటినన్నింటినీ చదువుతుంటే –అచ్చతెలుగులో చాల ముచ్చటగా అనిపించక మానదు. 'నన్నయ' కు ముందు వెనుక కూడా జాను తెలుగు పలుకులు 31 అని(అచ్చులు–10, అల్లులు–21) వీటికి అదనంగా 5 అచ్చులు, 15 అల్లులు వచ్చి చేరాయనీ; 'సంస్కృత' మాటలను తత్సమాలుగా కాకుండా, తద్భవాలుగా –తెలుగు రాతల్లో ఇమిడేలాగ రావాలనీ; మూల ద్రావిడంలో పురుడు పోసుకున్నా తెలుగు ముందుగా వేరుపడిందనీ–ఇలా ఎన్నో ఆసక్తికర అంశాలున్నాయి ఈ పుస్తకంలో. ఇంకా ఈ పుస్తకంలో ఆరుచోట్ల మరికొన్ని భాషావిషయకమైన విశేషాలను అమర్చారు.

ఈ పుస్తకం తెలుగు భాష ఎదుగుదలకు, దాని కొనసాగింపునకు, రచయితలకు, కవులకు, పాత్రికేయులకు, ఉపన్యాసకులకు–తెలుగు భాషపై అభిమానం ఉన్న అందరికీ చేయూతగా ఉంటుంది.

తేటతెలుగు జాతీయాలు **–డా.పమిడి శ్రీనివాసతేజ.** ఫోన్: 8500121314. పేజీలు: 348, వెల: రు.250/–.ప్రచురణ: శ్రీ పబ్లికేషన్స్, నెల్లూరు, ఫోన్: 85006 54321. పంపిణీదారులు: పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ. ఫోన్:9866115655. **–ఎమ్.వి.శాస్త్రి** 9441342999

---

( 47వ పేజీ తరువాయి..)

బలవంతంగా రుద్దబడిన పరాయీకరణనుండి బయటపడటానికి తమని తాము విముక్తం చేసుకోవటం మొదటి షరతు. జడత్వం నుండి, నిష్క్రియాపరత్వం నుండి, పరాధీతన నుండి, కర్మభావన నుండి విముక్తం చేసుకుంటూ, తమ శక్తి గురించి, సామర్థ్యం గురించి, సామూహిక బలం గురించిన ఎరుక దళితులలో కలగాల్సిన అవసరాన్ని ఈ నవల ప్రతిపాదించింది.

'నిషిధ' నవలలో బలంగా చిత్రించబడిన మరొక పార్శ్వం రాజ్యాంగ యంత్రాగం. ఇటు పోలీసు యంత్రాంగం, అటు రాజకీయ వ్యవస్థ ప్రతి సందర్భంలోను పెత్తందార్లకు, ఆధిపత్యవాదులకు కొమ్ముకాస్తూ దళితుల న్యాయబద్ధమైన ఆకాంక్షల్ని చిదిమివేస్తున్నాయి. ఇలాంటి సందర్భాలలో న్యాయం పక్షం వహించాల్సిన న్యాయ యంత్రాంగం కూడా ఆధిపత్య వాదుల వైపునే నిలబడుతోంది. తన స్వతంత్ర ప్రతిపత్తికి తానే తిలోదకాలు ఇచ్చుకుంటూ దళితులపై మారణకాండ జరిగిన కేసుల విచారణలో రాజ్యాంగ ఆదర్శమైన 'సమత' దృష్టితో కాక అగ్రకుల మనస్తత్వంతో తీర్పులు చెపుతోంది. మతం, రాజ్య యంత్రాంగం, న్యాయవ్యవస్థ కలగలసి పీడితులపై సాగిస్తున్న ముప్పేట దాడి ఎంత పాశవికంగా వుంటుందో ఈ నవల చదివితే అర్థం అవుతుంది.

'నిషిధ' ఒక గొప్ప మానవ అనుభవాన్ని ప్రేరేపించగల శక్తివున్న నవల. ఇది కేవలం దళితులకు మాత్రమే చెందిన నవలకాదు. దళితేతరు లందరూ తాము ఎలా వున్నామో, తాము ఎలా వుండకూడదో తెలుసుకోవటానికి తప్పనిసరిగా చదవాల్సిన నవల. మనందరిలో మొద్దుబారిపోతున్న సున్నితత్వాన్ని తిరిగిపొందటానికి, మనం కూడా మనుషులుగా మారడానికి, మనలో మనం ఎంతగా యుద్ధం చేసుకోవాలో తెలియచెప్పే గొప్ప నవల 'నిషిధ.' ఈ కోణంలో వచ్చిన అతికొద్ది తెలుగు నవలలో ఇదొకటి. దళిత జీవితాన్ని రొమాంటిక్ దృష్టితో చిత్రీకరించిన నవలలకు భిన్నంగా 'నిషిధ' రాజకీయార్థిక వ్యవస్థ దృష్టికోణం నుండి వెలువడిన నవల.

నిషిధ **–నల్లూరి రుక్మిణి,** సి.132, యస్.వి.యన్. కాలనీ, గుంటూరు – 522006, 9989133401 పేజీలు –384, వెల– 180 రూపాయలు. **– యోగి**




# పర్యావరణ విజయం

కస్తూరి విశ్వనాథంగారు ఒక భాషా శాస్త్రవేత్తగా, సాంఖ్యక శాస్త్ర ఆచార్యునిగా, అనువాదకునిగా, సంపాదకునిగా, కవిత, కథానిక, నాటక ప్రక్రియా రచయితగా సాహితీ లోకానికి చిరపరిచితులు. సామాజిక అవసరాన్ని బట్టి రచనలు గావించే స్పృహ ఉన్న కొద్ది మంది రచయితల్లో కస్తూరి విశ్వనాథం గారు ఒకరు. కలుషితమవుతున్న పర్యావరణాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని వివరిస్తూ విశ్వనాథంగారు రచించిన మంచి పుస్తకం 'పర్యావరణ విజయం'. ఇందులోని పాత్రలు పశుపక్ష్యాదులు. ఈ రచనను చదువుతుంటే పంచతంత్ర కథలు తప్పనిసరిగా గుర్తుకువస్తాయి. మానవుడు స్వార్థంతో పర్యావరణాన్ని పాడుచేస్తున్నాడని, పర్యావరణం ప్రమాదరహితంగా ఉన్నప్పుడే ప్రతి జీవీ ఆరోగ్యంగా, ఆనందంగా మనగలుగుతుందనే సత్యాన్ని రచయిత ఈ పుస్తకం ద్వారా తెలియజేశారు.

'పర్యావరణ విజయం' అనే ఈ గ్రంథంలోని పాత్రలు వన్య ప్రాణులు. ఇవి మనుష్య భాషలో మాట్లాడినట్లు రచయిత చిత్రించారు. సింహం, కోతి, నక్క, కుక్క, ఎలుగుబంటి, చిరుత, మెట్టతాబేలు, కాకి, మొసలి, తోడేలు, అడవిపంది, అడవిదున్న, రేచుకుక్క, కొంగలు, నీటి కోళ్ళు, జింకలు, తేనెటీగలు– ఇలా ఎన్నెన్నో జీవాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. 'పర్యావరణాన్ని పరిరక్షించండి' 'వన్యప్రాణుల్ని కాపాడండి' అనే నినాదాలతో వ్యాసాల రూపంలో వివరిస్తే పాఠకుడికి ఆసక్తి కలగదు. కాని తాను చెప్పదలచుకున్న విషయాన్ని చక్కటి కథగా మలచి వివిధ జీవాలను పాత్రలుగా తీర్చిదిద్ది గ్రంథాన్ని రచించిన విశ్వనాథం గారు తమ ప్రయత్నంలో విజయాన్ని సాధించారనే చెప్పవచ్చు.

రచన ప్రారంభంలోనే కోతి– నక్క సంభాషణ ద్వారా పాఠకుని తన అధీనంలోకి తెచ్చుకున్న రచయిత పుస్తకం చివరివరకూ అదే విధమైన ధోరణిలో రచనను సాగించటం మెచ్చుకోదగిన విషయం. అడవి జంతువులన్నీ మానవ సమాజంలోని ఆచార వ్యవహారాల్ని, ఆలోచనా విధానాన్ని, మంచిచెడ్డల్ని, ఎత్తులకు పైఎత్తుల్ని ప్రతిబింబిస్తాయి. ఇంతకు పూర్వం అడవిలో పుష్కలంగా నీరు, ఆహారం లభించేవని, ప్రస్తుతం వాటిని తమకు దక్కకుండా చేస్తున్న మానవుని మీద ప్రణాళికతో దాడి చెయ్యాలని వన్యమృగాలు ఆలోచించినట్లు రచయిత తెలిపారు. ఇన్నాళ్లూ ఐకమత్యం లేకపోవటం వల్ల నాశనమయ్యామని, ఇక మీదట కలసికట్టుగా ఉండాలని, 'మనల్ని మనమే రక్షించుకోవాలి. అవసరమైతే త్యాగాలకు సిద్ధపడా'లని నిర్ణయించుకున్న తీరులో వన్య మృగ చైతన్యం కనిపిస్తుంది.

వన్యమృగాల్ని భయపెట్టటానికి, బంధించటానికి, చంపటానికి మానవుడు చేసే ప్రయత్నాలన్నిటినీ తిప్పికొట్టే యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్న వన్యమృగాలు ఒక కార్యాచరణ పథకాన్ని నిర్మించుకున్నాయి. వన్యప్రాణుల జీవనానికి భంగాన్ని కలిగించే ప్రయత్నాలు చేస్తున్న తీరును పసిగట్టటానికి ఈ–మెయిలు, కా–మెయిలు వ్యవస్థను రూపొందించుకున్న వన్యప్రాణుల ఆలోచనలు అభినందనీయం.


అడవుల నరికివేతను సమర్థించేవారు, వ్యతిరేకించేవారూ మానవుల్లో ఉన్నారని, అయితే రెండవ వర్గం వారు చాలా తక్కువ అని వన్యప్రాణులు బేరీజు వేసుకున్నాయి. మనుషులకు వన్యప్రాణులమీద ద్వేషం బాగా పెరిగిపోయిందని, వాళ్లకు ప్రాణహాని కలిగించకుండా బుద్ధి వచ్చేటట్లు చెయ్యాలని వన్యప్రాణులు నిర్ణయించుకున్నాయి. అందుకోసం జంతు సమైక్య సమితి ప్రణాళికాబద్ధంగా పనిచెయ్యాలనుకున్నది. అడవుల్ని జనావాసాలుగా, విద్యాలయాలుగా, కాంక్రీటు భవనాలుగా మార్చే మానవుల ప్రయత్నాల్ని తిప్పి కొట్టాలని నిర్ణయించుకుని దానికనుగుణంగా వన్య ప్రాణులు పనిచేశాయి.


ప్రకృతి సంరక్షణ సమితి, భారతీయ ప్రాణి సంరక్షణ సమితి జంతువుల హక్కుల సంరక్షణ సంఘం, పీపుల్ ఫర్ ఆనిమల్స్ మొదలైన సంఘాలు అడవుల్ని నరికే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వం మీద ధ్వజమెత్తే తీరును రచయిత ఇందులో తెలిపారు. అడవిని రూపుమాపి, కట్టడాల్ని నిర్మించాలనే ప్రయత్నం చేసిన మానవుల మీద వన్యప్రాణులు ఐకమత్యంగా దాడి చేసిన తీరు వార్తా పత్రికలద్వారా లోకానికి వెల్లడి కావటం, అడవుల్ని రక్షిత ప్రాంతాలుగా ప్రకటించటానికి శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి చర్చలు జరపటం ఎక్కువమంది అనుకూలంగా తమ అభిప్రాయాల్ని ప్రకటించటం, ఆ తర్వాత వన్యప్రాణులు విజయోత్సాహాన్ని జరుపుకోవటంతో ఈ పుస్తకం ముగుస్తుంది.

పర్యావరణ పరిరక్షణ ప్రబోధంతో వెలువడిన విలువైన పుస్తకం 'పర్యావరణ విజయం' అందరూ చదవదగిన గ్రంథమిది.

పర్యావరణ విజయం. రచయిత: డా.కస్తూరి విశ్వనాథం. ప్రతులకు – రచయిత, 1024 మెయిన్ రోడ్, గోకులం 3వ స్టేజి, మైసూరు–570 002– చరవాణి 09480770557– వెల రూ. 120/–

**– డా॥ గుమ్మా సాంబశివరావు**
9849265025






## ఎస్. శంకర్‌నారాయణ

# కలం రేఖలు

**కొద్ది**మంది వల్ల క్రమంగా తెలుగు ప్రాధాన్యత తగ్గిపోతోంది. మరి కొంతమంది తిరిగి తెలుగు ఆ ప్రాధాన్యతను సంతరించుకోవాలని ఉద్యమిస్తున్నారు. మరి కొందరు తెలుగు వైభవాన్ని నలుగురికీ తెలియజేయడానికి రచనలు చేస్తున్నారు, చిత్రాలు గీస్తున్నారు.

ఈ మధ్య తెలుగు సాహితీవేత్తలు నన్నయ నుంచి నేటి ఆధునిక రచయితల వరకూ దాదాపు రెండు వందలమంది సాహితీ వేత్తలను మన కళ్ళముందుకు తెస్తూ సత్తిరాజు శంకర్‌నారాయణగారు ఓ గ్రంథాన్ని తెలుగు పాఠకులకు అందించారు. మామూలుగా కథలో, వ్యాసాలో మరోటో రాయడానికి బొమ్మలు వేయించి మనముందుకు తెస్తుంటారు. ఈ వినూత్న ప్రయోగంలో బొమ్మలకి సూక్ష్మ పరిచయంగా కొన్ని వివరాల్నిచ్చుకుంటూ పోయారు.

శంకర్ నారాయణగారు ఆకాశవాణిలో చాలా ఉన్నత పదవులలో పనిచేశారు. ఆ రోజుల్లో ఎంతోమంది సాహితీవేత్తల్ని, కళాకారుల్ని కలుస్తుండేవారు. వాళ్ళతో కొద్దిసమయమే గడిపినా వాళ్ళ రూపాలు ఆయన మనసులో అలా నిలిచి పోయాయి. ఆ రూపురేఖల్ని తమ నైపుణ్యంతో శాశ్వత పెన్సిల్ స్కెచెస్‌గా మలిచారు. ఆ పోర్ట్రెయిట్స్‌కి ముళ్లపూడి శ్రీదేవిగారు తమ కలంతో క్లుప్త సమాచారాన్ని జోడించారు. శ్రీదేవిగారు ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణగారి సతీమణి. శంకర్‌నారాయణగారు ప్రముఖ చిత్రకారులు బాపుగారి సోదరులు.

ప్రతి ఇంటి గ్రంథాలయంలోను ఉంచుకోవలసిన గ్రంథం 'కలం రేఖలు'. (కలం రేఖలు- ఎస్. శంకర్‌నారాయణ, వెల రూ. 200/-. ప్రతులకు: నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సుల్తాన్ బజార్, కోఠీ, హైదరాబాద్)


– వీఆర్పీ



**శిశుపాల వధ:** మూలం: మాఘ మహాకవి ఆంధ్రీకర్త: చిటిప్రోలు కృష్ణమూర్తి; పుటలు: 304, వెల: రు.300, ప్రతులకు: చిటిప్రోలు వెంకటరత్నం-7702358616, చిటిప్రోలు సుబ్బారావు-9701049000, చిటిప్రోలు అనంత రామారావు-9949142381 మరియు నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్.




**తలిశెట్టి రామారావు తొలి తెలుగు వ్యంగ్యచిత్రాలు:** సేకరణ: ముల్లంగి వెంకట రమణారెడ్డి; పుటలు: 232, వెల: రు.150/, ప్రతులకు: ముల్లంగి వెంకట రమణారెడ్డి, ఇంటి నెం.39-18-1 సాయిసూర్య రెసిడెన్సీ, స్టేట్‌ఎక్సైజ్ ఆఫీసు ఎదుట, మాధవధార, విశాఖపట్నం-7. ఫోన్:0891-2722189, 8985082177.



**పద్యానుభవం:** రచన: డా॥ జి.వి.పూర్ణచందు పుటలు:208, వెల:రు.125/, ప్రచురణ: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి. ప్రతులకు: శుశ్రుత ఆయుర్వేదిక్ హాస్పిటల్, 1వ అంతస్తు, సత్నాం టవర్స్, బకింగ్‌హామ్‌పేట పోస్టాఫీసు ఎదురుగా, గవర్నరుపేట, విజయవాడ-2.ఫోన్: 0866-2434320.




**ఎన్నీల ముచ్చట్లు:** 'మానేటి కైతల ఊట' సినారె స్మృతి కవిత్వం. సంపాదకులు: కూకట్ల తిరుపతి. పుటలు: 140, వెల: రు.50, ప్రచురణ: సాహితీ సోపతి, కరీంనగర్. ప్రతులకు: 9440763479, 9491598040, 9494723743, 9949247591.



**ఎములాడ మూలవాగు:** కవితాసంపుటి. రచన: సంకేపల్లి నాగేంద్రశర్మ; పుటలు:100, వెల:రు.80/, ప్రచురణ: శరత్ సాహితీ కళా స్రవంతి. ప్రతులకు: ఇంటి నెం.6-6-1031/1, శివాజీనగర్, కరీంనగర్.

**గుంటూరుజిల్లా ప్రముఖ కవులు:** రచయిత: డా.వెన్నిసెట్టి సింగారావు; పుటలు: 60, వెల: రు.80, ప్రతులకు: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు. ప్రతులకు: డా.పి.సూర్యకుమారి, నెం.371, పార్కురోడ్డు, క్రిష్ణానగర్ 6వ లైను గుంటూరు-6.ఫోన్: 0863-235238, 9390315584.





**ఇల్లలికిన ఈగ:** ఇతర వ్యాసాలు. రచన: ఖండవల్లి సత్యదేవప్రసాద్; పుటలు:408, వెల.రు.250/-ప్రచురణ: ప్రతులకు: ఋషిపీఠం ప్రచురణలు, ఫ్లాట్ నెం.1,19,46, హెచ్‌ఐజి ఎ-40, డా.ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాదు-62. ఫోన్:040-27134557, 27132550.

**మల్లెచెట్టు చౌరస్తా:** కవిత్వం. రచన: మమత వేణు; పుటలు: 100, ప్రచురణ: సాహితీ సోపతి, కరీంనగర్. ప్రతులకు: మమత కచ్చె, ఇంటి నెం.5-5/3/2, శాతవాహన కాలనీ, రేకుర్తి, కరీంనగర్.





**తెలుగు సాహితీ వైభవం:** వ్యాస సంపుటి. రచన: ఆచార్య ఎస్. గంగప్ప; పుటలు: 209, వెల: రు. 125/, ప్రచురణ: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు. ప్రతులకు: శ్రీమతి ఎస్. పార్వతమ్మ, సి/73, శ్రీనివాస్‌నగర్ కాలనీ, గుంటూరు-6. ఫోన్: 0863-2231805.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
October 2017, Vol.3, Issue 8

Date of publication : 1st of every month
Date of posting : 4th of every month

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17